అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సోమవారం 20-2-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 50 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



జడేజా మాయ
- పది వికెట్ల ప్రదర్శనతో మాయాజాలం
- రెండో టెస్టులో భారత్ ఘన విజయం
- ఛేదనలో మెరిసిన రోహిత్, పుజార, కోహ్లి

వివరాలు ఆటలులో..

త్రిపురలో హింసోన్మాదం




(ఫైల్)


- బీజేపీ మూకదాడి.. సీపీఐ(ఎం) మద్దతుదారుడి హత్య

అగర్తల : త్రిపురలో ఎన్నికల అనంతర హింసాకాండ రాజుకుంటోంది. బీజేపీ గూండాల చేతిలో సీపీఐ(ఎం) మద్దతుదారుడు ఒకరు ...2లో

అదానీ జోలికొస్తే.. ప్రతీకారమే

జర్నలిస్టులు, ప్రతిపక్ష నాయకులు, సాధారణ పౌరులపైనా కేసులు

- వందల కోట్లతో పరువునష్టం ఆరోపణలు, క్రిమినల్ కేసులు నమోదు
- వేర్వేరు రాష్ట్రాల్లో కేసుల విచారణ..తట్టుకోలేకపోతున్న బాధితులు



అదానీ కంపెనీ అక్రమాలు, స్టాక్ మార్కెట్ మోసాలపై 'హిండెన్‌బర్గ్' నివేదిక ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రపంచ మీడియా స్వేచ్ఛగా ఈ నివేదికపై వార్తా కథనాలు రాసింది. భారత్‌లో మాత్రం ప్రధాన మీడియా, వందలాది టీవీ ఛానల్స్ భయపడుతున్నాయి. ఈ వ్యవహారంతో ప్రధాని మోడీ పేరు ముడిపడి ఉన్నందున మీడియా, టీవీ ఛానల్స్ 'హిండెన్‌బర్గ్' నివేదికపై విశ్లేషణ చేయడానికి వెనుకాడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం..'అదానీ గ్రూప్' వేసే పరువునష్టం కేసులు. మరోవైపు మోడీ సర్కార్ నుంచి ఎదురయ్యే వేధింపులు. అదానీపై వార్తలు రాసిన..వ్యాఖ్యలు చేసిన స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్స్, జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, మరికొంత మందిపై వందలకోట్ల పరువునష్టం కేసులు, క్రిమినల్ కేసులున్నాయి.

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలో పర్యావరణ కార్యకర్త బెన్ పెన్నింగ్, సీఎన్‌బీసీ, టీవీ 18 జర్నలిస్టులపై అదానీ కంపెనీలు క్రిమినల్ పరువునష్టం కేసులు వేశాయి. 'హిండెన్‌బర్గ్' నివేదిక బయటకు వచ్చాక పెద్ద పెద్ద మీడియా సంస్థలు మాట్లాడటానికి, వార్తలు రాయడానికి జంకుతున్నాయి. దీనికి కారణం అదానీ గ్రూప్‌నకు మోడీ సర్కార్ నుంచి అందుతున్న మద్దతు, సహకారం. గౌతం అదానీ కంపెనీ ఆర్థిక అక్రమాలు, ఆ కంపెనీలకు దక్కుతున్న రుణాలపై ఇన్వెస్టర్స్, జర్నలిస్టులు, సాధారణ పౌరులు, ఎంతో మంది రాజకీయ నాయకులు ఆరోపణలు చేశారు. ఇప్పుడు 'హిండెన్‌బర్గ్' నివేదికతో వారి ఆరోపణలకు మరింత బలం చేకూరింది. పరువునష్టం కేసులు, కోర్టు కేసులు వేస్తూ అదానీ గ్రూప్ కంపెనీ ఇంతకాలం బెదిరిస్తూ వస్తోంది. కోర్టు ఆదేశాలతో ...2లో



మోడీకి అనుకూలంగా మీడియా

హిండెన్‌బర్గ్ నివేదికలో పేర్కొన్న అంశాలు..'భారత ఆర్థిక వ్యవస్థ'పై జరిగిన తీవ్రవాద దాడిగా మోడీ అనుకూల మీడియా చెబుతోంది. 'ఆర్థిక తీవ్రవాదం' పేరుతో అనేకమంది ఆరోపణల్ని, విమర్శల్ని కొట్టిపారేస్తోంది. హిండెన్‌బర్గ్ నివేదికపై భారతీయ మీడియా చర్చించడానికి ఇష్టపడటం లేదని, 400 టీవీ ఛానల్స్‌లో అత్యధికం అనుకూలంగా ఉండటం మోడీ సర్కార్‌కు కలిసివచ్చిందని న్యూస్‌లాండ్రీ జర్నలిస్ట్ 'మనీషా పాండే' అన్నారు. "ఒక బడా కార్పొరేట్ కంపెనీపై వచ్చిన నివేదికగానే కాదు, ఇది భారత ప్రధాని మోడీ, ఆయన పాలనపై వచ్చిన ఆరోపణలుగా చూడాలి" అని చెప్పారు.

హిండెన్‌బర్గ్ ఏం చెప్పింది?

హిండెన్‌బర్గ్ నివేదికలో పేర్కొన్న ముఖ్యమైన ఆరోపణ..భారత స్టాక్‌మార్కెట్‌ను కృత్రిమంగా ప్రభావితం చేయటం. మలేషియాలోని ఒక కంపెనీ అదానీ షేర్లను కొనుగోలు (ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా) చేసింది. దీంతో అదానీ షేర్ల ధరలు అమాంతం పెరిగిపోయాయి. షేర్లు కొనుగోలు చేసిన ఆ కంపెనీ అదానీదే. స్టాక్ మార్కెట్‌లో షేర్ ధర భారీగా పెరిగాక, ఆ ధరను పరిగణనలోకి తీసుకొని ఎల్ఐసీ, ...2లో

గిరిజనేతరుల సంగతేంటి?

చట్ట సవరణపై కేంద్రం తాత్సారం..

- 75 ఏండ్ల గుర్తింపే సమస్య అంటున్న గిరిజన శాఖ
- అర్హత కలిగిన అందరికీ హక్కుపత్రాలకోసం ఆందోళన
- తిరస్కరించినవి పున:పరిశీలించాలనే డిమాండ్





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోడు భూముల హక్కు పత్రాల కోసం సాగుదారులు ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల చివరినాటికి అర్హత కలిగిన అందరికీ హక్కుపత్రాలిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 4,14,353 లక్షల మంది నుంచి 12,46,846 లక్షల ఎకరాల అటవీ భూముల కోసం అర్జీలు అందాయి. కొన్ని చోట్ల ఎలాంటి సర్వేలు చేయకుండానే దరఖాస్తులను తిరస్కరించారన్న విమర్శలు లేకపోలేదు. మరి కొన్ని చోట్ల కనీసం గ్రామ సభలు కూడా నిర్వహించలేదన్న ఆరోపణలు సైతం వస్తున్నాయి. రకరకాల కొర్రీలతో ...5లో

కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న కన్నుమూత

షుగర్ లెవల్స్ పడిపోవడంతో ఆస్పత్రికి తరలింపు


(ఫైల్)

- కార్డియాక్ అరెస్ట్‌తో మృతి
- ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక
- సందర్శించిన సీఎం, మంత్రులు



నవతెలంగాణ-కంటోన్మెంట్/అడిక్‌మెట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే జి. సాయన్న కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఆదివారం ఉదయం ఆకస్మికంగా షుగర్ లెవెల్ పడిపోవడంతో కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కార్డియాక్ అరెస్ట్ రావడంతో మృతి చెందారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకుని నియోజకవర్గంలో అభిమానులు, కార్యకర్తలు శోక సంద్రంలో మునిగిపోయారు. కాగా, ఎమ్మెల్యే సాయన్న పార్థివదేహాన్ని కవాడిగూడ అశోక్‌నగర్‌లోని ఆయన నివాసానికి తీసుకురాగా, ముఖ్యమంత్రి కేసీఆర్ సందర్శించి నివాళ్లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ...5లో

టికెట్ రద్దుతో రైల్వేకు ఆదాయం

నాలుగేండ్లలో రికార్డు స్థాయిలో ఆర్జన

- 2019-23 మధ్య గడించిన సొమ్ము రూ. 1900 కోట్లకు పైనే : కేంద్ర రైల్వే మంత్రి



న్యూఢిల్లీ : దేశంలో ఈ-టికెట్ల రద్దు రైల్వేకు భారీగా ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. 2019-23 మధ్య భారత రైల్వే రికార్డు స్థాయిలో రూ. 1900 కోట్లకు పైగా వసూలు చేసింది. కొన్ని నిర్ణీత మొత్తాలను సౌకర్యాల రుసుముగా కూడా పొందింది. కేంద్ర రైల్వే మంత్రి పార్లమెంటులో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ-టికెట్లు, కంప్యూటరైజ్డ్ ప్యాసింజర్ రిజర్వేషన్ పాలసీ (పీఆర్ఎస్) కౌంటర్ల ద్వారా జారీ చేయబడిన టికెట్లు.. ఇలా రెండింటిపై రైల్వే ప్రయాణీకుల రూల్ 2015 ప్రకారం టికెట్ రద్దుపై రద్దు లేదా క్లియరేజ్ ఛార్జీ విధించబడుతుంది. దీంతో టికెట్ల రద్దు రైల్వేకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది.

పార్లమెంటులో ఒక ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖిత పూర్వక సమాధానాన్ని వెల్లడించారు. కేంద్ర మంత్రి సమాచారం ప్రకారం.. ఐఆర్‌సీటీసీ, ఈ-టికెటింగ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఆన్‌లైన్ రిజర్వ్ చేసిన ఈ-టికెట్లను బుక్ చేసుకునే ప్రయాణీకుల నుంచి భారతీయ రైల్వే క్యాటరింగ్ మరియు టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) సౌకర్య రుసుమును విధిస్తుంది. 2019-20 నుంచి 2022-23 ...5లో

విక్రయానికి ల్యాండ్‌పార్సెల్స్

మూడు జిల్లాల పరిధిలో అమ్మకానికి 39 పార్సెల్స్

- రంగారెడ్డిజిల్లాలో 10, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 6, సంగారెడ్డి జిల్లాలో 23 విక్రయం
- కనీస ధరల్లో 121 గజాల నుంచి 10,164 గజాల స్థలాలు
- రేపటి నుంచి ప్రీబిడ్ సమావేశాలు
- మార్చి 1న ఈ-ఆక్షన్

వివరాలు 5లో..


hmda Growing Global

ప్రశ్నించే వారికే పట్టం కట్టాలి

నిస్వార్థంగా, నిబద్ధతతో పనిచేసే వాళ్లను ఎన్నుకోవాలి

- పైరవీకారులు, ప్రలోభాలకు గురిచేసే వారి పట్ల అప్రమత్తత అవసరం
- సీపీఎస్‌ను తెచ్చిందే కాంగ్రెస్, బీజేపీ
- ఆయా పార్టీల అభ్యర్థులు ఉపాధ్యాయులకు ఏం భరోసానిస్తారు?
- దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలి
- డీఏలు పెండింగ్, సకాలంలో జీతాలు రాక టీచర్లలో అసంతృప్తి
- సమస్యలు పరిష్కరించేలా సర్కారుపై ఉద్యమిస్తా
- విద్యారంగ పరిరక్షణే నా లక్ష్యం : నవతెలంగాణతో స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డి

ములాఖాత్



సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించే వారికే పట్టం కట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) బలపరిచిన స్వతంత్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పావన్నగారి మాణిక్‌రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఓటు అమూల్యమైందనీ, అందువల్ల ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసే వారిని, ...2లో



న్యాయవ్యవస్థను సవరించొద్దు



భారీ సైజు జాతీయ జెండాతో నిరసన కవాతు

టెల్ అవీవ్ : ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కొత్త ప్రభుత్వం న్యాయవ్యవస్థను సవరించేలా ప్రణాళికలు చేస్తోంది. దీనికి వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. భారీ సైజులో ఉన్న జాతీయ జెండాతో కవాతు చేస్తూ...నెతన్యాహు సర్కార్ చర్యలకు వ్యతిరేకంగా గళమెత్తారు.

క్రైస్తవ సమాజంపై హింస ఆపండి



కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలి

న్యూఢిల్లీ: క్రైస్తవులపై ద్వేషం , హింసను లక్ష్యంగా చేస్తున్నారంటూ... క్రైస్తవ సమాజానికి చెందిన ప్రజలు జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. నినాదాలు చేశారు. కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

పాతపెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలి



హర్యానా సీఎం ఇంటి వద్ద నిరసన..జలఫిరంగులతో కట్టడి

పంచకుల: బీజేపీ పాలిత హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ నివాసం సమీపంలో ప్రభుత్వఉద్యోగులు నిరసనకు దిగారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపై జలఫిరంగులు ప్రయోగించారు. అయినా తమ నిరసనగళం వినిపించారు.

విరబూసిన పుష్ప అందాలు



తులిప్ ఫెస్టివల్ కు రా రమ్మంటున్న ప్రకృతి

న్యూఢిల్లీ: మండి హౌస్ సర్కిల్‌లోని లాన్‌లో పూలు పూస్తాయి. ది న్యూ ఢిల్లీ మునిసిపల్ కౌన్సిల్ 20 సమ్మిట్‌కు ముందు దేశ రాజధానిని సుందరీకరించడానికి 'తులిప్ ఫెస్టివల్'లో భాగంగా తులిప్‌లను నాటారు.

నీట్‌పై సుప్రీంకు తమిళనాడు

- రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని పిటీషన్



న్యూఢిల్లీ : జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)పై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దేశంలో వైద్య కోర్సుల్లో ప్రవేశానికి ఏకైక ప్రవేశమార్గం నీట్ అనేది భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణం, ప్రాథమిక సమానత్వ హక్కును ఉల్లంఘించడం, ఫెడరలిజయం సూత్రాలను విస్మరించడంగా ప్రకటించాలని సుప్రీంకోర్టులో తమిళనాడు ప్రభుత్వం శనివారం ఒరిజినల్ సూట్ వేసింది. న్యాయవాది సబరిష్ సుబ్రమణ్యం ద్వారా ఈ సూట్‌ను కోర్టులో దాఖలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం వేసిన ఈ పిటీషన్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చింది. 'నీట్‌లో సాధించిన మార్కులే అన్ని వైద్య, అనుబంధ కోర్సుల్లో ప్రవేశానికి ప్రమాణం అని చెప్పడం భారత రాజ్యాంగంలోని నిబంధనలు, రాజ్యాంగం యొక్క ప్రాథమిక నిర్మాణం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఏకపక్షంగా ఉల్లంగించడమే' అని సుప్రీకోర్టు ప్రకటించాలని పిటిషన్‌లో తమిళనాడు ప్రభుత్వం కోరింది. 'నీట్ పరీక్షను ప్రవేశపెట్టడం, కొనసాగించడం వల్ల తమిళనాడు రాష్ట్రంలోని విద్యార్థులు ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, తమిళనాడు రాష్ట్ర విద్యా మండలి అనుబంధ పాఠశాలల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడ్డడం వలన' సుప్రీంకోర్టును తమిళనాడు ప్రభుత్వం ఆశ్రయించాల్సి వచ్చిందని పిటీషన్‌లో పేర్కొంది.

'నీట్‌తో వైద్య కళాశాలల్లోని ప్రభుత్వ సీట్లలో విద్యార్థులను చేర్చుకునే రాష్ట్రాల అధికారాన్ని హరించడం వల్ల సమాఖ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తుంది. విద్య అనేది రాష్ట్రాలకు సంబంధించిన అంశం, దీనిపై చట్టాలను రూపొందించడం రాష్ట్రాల హక్కు, రాష్ట్ర విశ్వవిద్యాలయాల కోసం విద్యను నియంత్రించే హక్కు రాష్ట్రాలకు ఉంది. ప్రైవేట్, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ కళాశాలలు అనే తేడా లేకుండా అన్ని వైద్య కళాశాలల్లో ప్రవేశానికి నీట్‌ను ప్రవేశపెట్టడం సమాఖ్య నిర్మాణానికి, విద్యకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని ఉల్లంఘించడమే' అని పిటీషన్ వాదించింది.

అలాగే, నీట్ వల్ల రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నివసించే, స్టేట్ బోర్డ్ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. నీట్ పరీక్ష సిబిఎస్ఇ/ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌పై ఆధారపడినందున ఈ విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నప్పుడు విపరీతమైన ప్రతికూలతను ఎదుర్కొంటున్నారని, నీట్ అనేదితమిళనాడు స్టేట్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సెట్ చేసిన సిలబస్‌కు భిన్నంగా ఉందని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది.

అదేవిధంగా ఆర్థిక వనరుల కొరత, కోచింగ్ తరగతులకు ప్రాథన్యత, సంవత్సరం వ్యవధి తీసుకొని పరీక్షను మళ్లీ రాయకపోవడం వంటి అనేక ఇతర కారణాల వల్ల కూడా పైన పేర్కొన విద్యార్థులు ప్రతికూలంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం పిటీషన్‌లో స్పష్టం చేసింది. 'అందువల్ల, ఈ విద్యార్థులు ఇంటర్ పరీక్షలలో ఎక్కువ మార్కులు సాధించినప్పటికీ, ఎక్కువ అవకాశాలు ఉన్న అర్బన్, సెమీ-అర్బన్ విద్యార్థులతో సమానంగా పోటీ పడలేరు' అని తమిళనాడు ప్రభుత్వం తన పిటీషన్‌లో పేర్కొంది.

త్రిపురలో హింసోన్మాదం

(మొదటిపేజీ తరువాయి)

హత్యకు గురయ్యారు. కళ్యాణ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణం జరిగింది. ద్వారికపూర్ పంచాయితీలో బీజేపీ 'ప్రధాన్'గా వ్యవహరించే కృష్ణ కమల్‌దాస్, అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా దాడి చేసి కొట్టడంతో సీపీఐ(ఎం) మద్దతుదారుడు దిలీప్ శుక్లా దాస్ మృతి చెందాడు. కృష్ణ కమల్‌దాస్, దిలీప్ శుక్లా దాస్ కుటుంబాలు ద్వారికపూర్‌లో పక్కపక్కనే నివసిస్తూఉంటాయి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇరు కుటుంబాల మధ్య చిన్నపాటి వాదన జరిగింది. వాదనలో రెచ్చిపోయిన కృష్ణ కమల్‌దాస్, అతని కుటుంబ సభ్యులు ఒక్కసారిగా రెచ్చిపోయి దిలీప్ శుక్లా దాస్‌పై దాడికి దిగారు. తీవ్రంగా కొట్టారు. కమల్‌దాస్ దాడి నుంచి దిలీప్ శుక్లాను అగ్నిమాపక సిబ్బంది రక్షించి కోవాయిలోని ఆసుప్రతికి తీసుకుని వెళ్లారు. అయితే దిలీప్‌కు తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆతన్ని ఆస్పత్రికి ఆదివారం ఉదయం జీబీపీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయినా దిలీప్ శుక్లాను రక్షించుకోలేకపోయారు. ఆదివారం అతను మృతి చెందాడు. దిలీప్ మృతితో కళ్యాణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో విషాదచాయలు నెలకున్నాయి. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కృష్ణ కమల్‌దాస్‌ను అదుపులోకి తీసుకుని ఆదివారం కోవాయి కోర్టులో ప్రవేశపెట్టారు.

కాగా, మరోవైపు దిలీప్ శుక్లాదాస్ మృతదేహాన్ని స్వీకరించడానికి ప్రయత్నించిన జితేంద్ర చౌదరి నేతృత్వంలోని సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డకున్నారు. దీంతో మృతదేహాన్ని తమకు అప్పగించేందుకు పోలీసు అధికారులు నిరాకరించడాన్ని నిరసిస్తూ కుంజాబన్ ప్రాంతంలో హెరిటేజ్ పార్కు వద్ద సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

'పది' గట్టేక్కేనా!

మరో నెలన్నరలో పదో తరగతి వార్షిక పరీక్షలు

- తొలిమెట్టు, మనఊరు-మన బడికే ఎక్కువ సమయం కేటాయింపు
- ఇంకోవైపు టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు, ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్
- సిలబస్ పూర్తయినా.. ప్రత్యేక ప్రణాళిక అమలు నామా మాత్రమే
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పది వార్షిక పరీక్షలపై ఆందోళన

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులను ఈ విద్యాసంవత్సరం గట్టెక్కించడం విద్యాశాఖకు అంత ఈజీగా కనిపించడం లేదు. సర్కారు బడుల్లో ఏండ్లుగా సబ్జెక్టు టీచర్ల సమస్య కొనసాగుతూనే ఉన్నది. దీనికితోడు ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం మనబస్తీ, మన బడీ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పనుల భారమంతా ప్రధానోపాధ్యాయులపైనే వేసింది. కాగా హెడ్‌మాస్టర్లు ఆ పనులతో పాటు తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) నోడల్ ఆఫీసర్లుగా మండలాల్లో పర్యవేక్షణకు ఎక్కువ సమయం కేటాయించారు. ఫలితంగా కొంతమేర చదువులపై తగిన శ్రద్ధ చూపించలేకపోయారు. వీటికితోడు ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఇదే సమయంలో మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్స్ షెడ్యూల్ విడుదల చేయడంతో పెద్ద సంఖ్యలో టీచర్లు దరఖాస్తు చేసుకోవడం, వారు కోరుకున్న పాఠశాల వివరాలు సేకరించడంలో మునిగిపోయారు. ఇవన్నీ కూడా ఈ విద్యాసంవత్సరం తరగతి బోధన, విద్యార్థుల చదువులపైన ఎక్కువ ప్రభావం చూపనున్నాయి. కనీసం ఈ నెలన్నర రోజులు ఒక ప్రణాళికతో లక్ష్యం ఏర్పరుచుకుని చదువులు గాడిన పెట్టకపోతే హైదరాబాద్ జిల్లా ఫలితాలు మునుపుకన్నా ఇంకా



దిగజారుతాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.

హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా మొత్తం 1585 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మైనార్టీ, కేంద్రీయ, బీసీ వెల్ఫేర్, రైల్వే, టీఎస్ ఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ స్కూల్స్ తదితర పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల నుంచి ఈ ఏడాది 80,198 మంది విద్యార్థులు పదోతరగతి వార్షిక పరీక్షలు రాయనున్నారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా చూస్తే 4,785 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకుగాను.. 1,89,791 మంది విద్యార్థులు ఈసారి పది వార్షిక పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే ప్రాక్టీస్ పేపర్-1 పరీక్షలు పూర్తికాగా ఈ నెల 27 నుంచి మార్చి 29 వరకు ప్రీ ఫైనల్స్ ఎగ్జామ్స్ కొనసాగుతాయి. ఏప్రిల్ 3 నుంచి 13వరకు పది వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఇదిలావుంటే న్యాస్ ఫలితాల నేపథ్యంలో గతేడాది ఆగస్టు-సెప్టెంబర్‌లో రాష్ట్రంలోని విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యాలు రోజురోజుకి దిగజారిపోతుండడంతో వాటి పెంపు లక్ష్యంగా విద్యాశాఖ యుద్ధప్రాతిపదికన ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరుతో తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యార్థుల్లో చదవడం, రాయడం, అభ్యాసన సామర్థ్యాలు సాధించే విధంగా మాతృభాష, ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించారు. తొలిమెట్టు కార్యక్రమం పర్యవేక్షణకు మండల స్థాయిలో సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను నోడల్ అధికారులుగా నియమించారు. వారంలో రెండు రోజులు వారి మండలంలోని పాఠశాలలను సందర్శించి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించడంతో పాటు మండల నోడల్ అధికారులు, క్లస్టర్ అధికారులను సమన్వయం చేసుకుంటూ విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందించాలి. ఇక మనబస్తీ-మనబడి(మన ఊరు-మనబడి) కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లో తొలిదశలో 239 స్కూళ్లను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తోంది. వీటి పనులకుగాను ఇప్పటికే పనులు అప్పగించిన ఆయా ఏజెన్సీలు ఇన్‌ఫుట్ డేటా ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి స్కూల్ హెడ్‌మాస్టర్, ఏఈ కలిసి ఆ స్కూల్లోని మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఎస్టిమేషన్ పూర్తి చేసి.. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. వివిధ స్థాయిలో పరిశీలన అనంతరం కలెక్టర్ నిధులు మంజూరు చేస్తారు. ఆ నిధులు మంజూరైన వెంటనే సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాకమిటీతో కలిసి అగ్రిమెంట్ చేసుకుంటారు. ఆ అగ్రిమెంట్‌ను అప్‌లోడ్ చేయగానే కలెక్టర్ స్కూల్ ఖాతాలో నిధులు జమ చేసిన అనంతరం పనులు ప్రారంభించారు. ఇవన్నీ పనులు కూడా ప్రధానోపాధ్యాయులే చేయాలి. వీటికితోడు మంత్రులు, విద్యాశాఖ ఉన్నతాధికారుల సమీక్షల వల్ల ఎక్కువ సమయం ఈ పనులకే కేటాయించారు. ఫలితంగా ఆ ప్రభావం విద్యార్థుల చదువులపై పడింది. అంతేగాక సిలబస్ పూర్తయినా.. స్లో లర్నర్స్‌తో పాటు ఏటా పది ఫలితాల్లో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో అధికశాతం విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారు. ఇలాంటివారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా చర్యలు నామమాత్రమే. అంతేగాక వచ్చే టెన్త్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఒక కార్యాచరణ లేకపోవడంపై పేద విద్యార్థుల చదువుల పట్ల విద్యాశాఖ అధికారులకు ఉన్న నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు

పదో తరగతి విద్యార్థులు సబ్జెక్టులపై మరింత పట్టు సాధించేందుకు 40 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతులు మార్చి 10 వరకు కొనసాగుతాయి. పాఠశాల ప్రారంభ సమయం కంటే ముందు ఉదయం 8.00 నుంచి 9.00 గంటల వరకు ఒక సబ్జెక్టు, పాఠశాల సమయం అనంతరం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు మరో సబ్జెక్టులో రోజూ తరగతులు నిర్వహిస్తున్నారు. వాటిపైనే వారం వారం పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా ప్రతి ఆదివారం, రెండో శనివారాల్లో వారాంతపు పరీక్షలు జరుగుతున్నాయి. ప్రతి వారం ఒకే రోజు రెండు పరీక్షలు (ఉదయం 9 నుంచి11 గంటల వరకు ఒక పరీక్ష, 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రెండో పరీక్ష) నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు మార్చి 19వరకు నిర్వహించనున్నారు. ఈ మధ్యలోనే ప్రీ ఫైనల్స్ పరీక్షలు ఈ నెల 27 నుంచి ప్రారంభమై.. మార్చి 29న ముగుస్తాయి. ఇక అనంతరం వార్షిక పరీక్షలే.

ప్రశ్నించే వారికే పట్టం కట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

నిస్వార్థంగా, నిజాయితీగా, నిబద్ధతతో విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేసే వారిని ఎన్నుకోవాలని కోరారు. పైరవీకారులు, ప్రలోభాలకు గురిచేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని సూచించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట ఉరితాడుగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్)ను తెచ్చిందే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలని విమర్శించారు. ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు సీపీఎస్ గురించి ఉపాధ్యాయులకు ఏం భరోసానిస్తారని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు మాణిక్‌రెడ్డి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల నుంచి ఎలాంటి స్పందన వస్తున్నది.?

నన్ను గుర్తు పట్టే వారు సాదరంగా ఆహ్వానిస్తున్నారు. కొందరు నేను తెలియకపోయినా టీఎస్‌యూటీఎఫ్ ఉద్యమాలు, నేను చేసిన పనిని గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలతోపాటు నివాస ప్రాంతాలకు వెళ్లినా మంచి ఆదరణ ఉన్నది. అయితే ఉపాధ్యాయులు ప్రభుత్వ తీరు పట్ల సంతృప్తిగా లేరు. పదోన్నతులు, బదిలీలు, భాషాపండితుల అప్‌గ్రెడేషన్, సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్ అమలు, 317 జీవో బాధితులు సొంత జిల్లాలకు రావడం, స్పౌజ్ టీచర్ల బదిలీ ఇలా అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో సమస్యలు పేరుకుపోయాయి. సర్కారు బడుల్లో పారిశుధ్య కార్మికుల్లేరు. సమస్యలు తీవ్రమవుతుంటే ఉద్యమాల్లేవంటూ కొందరు ఉపాధ్యాయులంటున్నారు. అది వాస్తవమే. టీఎస్‌యూటీఎఫ్ చేసిన ఉద్యమాల గురించి ప్రస్తావిస్తే సంతృప్తిపడుతున్నారు. అయితే ప్రభుత్వాలను ప్రశ్నిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి. దీన్నే ఉపాధ్యాయుల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నా.

గతంలోనూ మీరు పోటీ చేశారు. ఇప్పుడు మళ్లీ బరిలో ఉన్నారు. ఉపాధ్యాయ సమస్యలెలా ఉన్నాయి.?

ఉపాధ్యాయులు అప్పుడూ, ఇప్పుడూ సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. అయితే అప్పటితో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో మరింత జఠిలమయ్యాయి. వాటిపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరముంది. నిజాయితీగా ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం పనిచేసే ప్రతినిధి కావాలి. ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయుల వాణిని వినిపిస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఆయనకుతోడు ఇంకొకరు కావాలి.



ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. మీరు ప్రచారానికి వెళ్లినపుడు ప్రశ్నించడం లేదా?

ఉపాధ్యాయులు తప్పకుండా వాటిని అడుగుతున్నారు. అయితే దాటవేత ధోరణితో సమాధానం చెప్పడం లేదు. ఏం చేస్తే ఆ సమస్య పరిష్కారానికి నోచుకుంటుందో శాస్త్రీయంగా వివరించి మేం చెప్తున్నాం. 317 జీవో కారణంగా వేరే జిల్లాలకు కేటాయించిన వారిని దశలవారీగా స్థానిక జిల్లాలకు పంపాలి. దీనిపై ప్రభుత్వాన్ని ఒప్పించాలి. కోర్టు ఆదేశాలతో ఆగిపోయినా బదిలీలు, పదోన్నతులు చేపట్టాల్సిందే. వాస్తవాలను వివరిస్తున్నాం.

భాషాపండితులు, పీఈటీలకు పదోన్నతుల అంశం కోర్టు పరిధిలో ఉంది. దీనికి ప్రత్యామ్నాయం ఉందంటారా?

పండితులు, పీఈటీల అప్‌గ్రెడేషన్ గోస తీవ్రంగా ఉన్నది. జాప్యం కావడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణం. ఉపాధ్యాయులందరికీ పదోన్నతులొస్తుంటే పండితులు, పీఈటీలకు మాత్రమే రాకపోతే ఆ బాధ తీవ్రంగా ఉంటుంది. తుది తీర్పునకు లోబడి అప్‌గ్రెడేషన్ ప్రక్రియ చేపడతామంటూ ప్రభుత్వం చెప్పి హైకోర్టు అనుమతి పొందాలి. సర్కారు దీనిపై గట్టిగా ప్రయత్నించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలి.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు మొదటి తారీఖున రావడం లేదు కదా?

అవును. మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. 40 ఏండ్ల కింద నాలుగు డీఏలు బకాయి పడ్డ పరిస్థితి ఉండేది. తెలంగాణ వచ్చాక ఆ పరిస్థితి లేదు. కానీ ఇటీవలి కాలంలో ఒకటో తారీఖున ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు రావడం లేదు. దీంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించే పరిస్థితి లేదు. జీపీఎఫ్ రుణాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ట్రెజరీల్లో ఆమోదం పొందినా ఈ కుబేర్‌లో బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు. దీనిపై ఏమంటారు?

సీపీఎస్ రద్దు కోసం టీఎస్‌యూటీఎఫ్ మొదటి నుంచి పోరాడుతున్నది. అయితే ఇది రాజకీయ ఎజెండాగా మారాలి. ఏ పార్టీ అయినా సీపీఎస్ రద్దుపై హామీ ఇవ్వాలి. అలా ప్రకటించేలా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించాలి. సీపీఎస్ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలి. కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కుని సీపీఎస్‌ను తెచ్చాయి. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) చట్టాన్ని రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించాలి. అప్పటి వరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను ఓపీఎస్ పరిధిలోకి తేవాలి.

రాజకీయ పార్టీల నుంచి కూడా అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మీరు స్వతంత్రంగా బరిలో ఉన్నారు. ఉపాధ్యాయులు ఎవరిని ఆదరిస్తారు?

ఉపాధ్యాయులు స్వేచ్ఛగా జీవించేందుకే ఇష్టపడతారు. ఉపాధ్యాయుల ఓట్ల ద్వారా ఎన్నికయ్యే వ్యక్తి ఓ రాజకీయ పార్టీ చెప్పుచేతల్లో ఉండొద్దని భావిస్తారు. అందుకే స్వతంత్రంగా ఉంటూ ప్రభుత్వాలను ప్రశ్నించే అభ్యర్థులనే ఆదరిస్తారు. నేను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను. నాలుగు దశాబ్దాలుగా విద్యారంగ పరిక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడుతున్నాను. నిస్వార్థంగా, నిజాయితీగా, నిబద్ధతతో పనిచేస్తున్నాను. అయితే ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట ఉరితాడుగా మారిన సీపీఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఏ విధమైన హామీనిస్తారు.? సీపీఎస్ రద్దు గురించి ప్రకటిస్తారా? దీనిపై స్పష్టతనివ్వాలి.

ఉపాధ్యాయ ఓటర్లకు మీరిచ్చే సందేశమేంటీ?

మార్చి 13న పోలింగ్ ఉంది. నేను సోమవారం (ఈనెల 20న) నామినేషన్ దాఖలు చేస్తున్నాను. విద్యారంగ పరిరక్షణ, శాసనమండలిలో ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసే అభ్యర్థిని ఎన్నుకోవాలి. ఓటు అమూల్యమైంది. ప్రశ్నించే అభ్యర్థికి పట్టం కట్టాలి. ప్రలోభాలకు గురికావొద్దు. నిస్వార్థంగా, నిబద్ధతతో పనిచేసే వారిని ఆదరించాలి. పైరవీకారులు, ప్రలోభాలకు గురిచేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. అమూల్యమైన ఓటు ద్వారా గెలిపించే అభ్యర్థి విద్యారంగాన్ని పరిరక్షించుకునేలా ఉండాలి. ప్రభుత్వాల పనితీరుతోపాటు నిజాయితీ, నిబద్ధత, పోరాడే పటిమ, ప్రశ్నించేతత్వం ఉన్న అభ్యర్థులను పరిశీలించి ఆదరించాలి. అప్పుడే విద్యారంగంతోపాటు సమాజానికి మేలు కలుగుతుంది. ఇదే నేను ఉపాధ్యాయులందరికీ చెప్పే విషయం.

న్యాయం జరిగేలా చూస్తా

- వరంగల్ రైతు గట్ల సురేందర్‌కు బండి సంజయ్ హామీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

న్యాయం జరిగేలా చూస్తానని వరంగల్ రైతు గట్ల సురేందర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ హామీనిచ్చారు. అధికార పార్టీ నేతల అండతో తన భూమిని కబ్జా చేసి తనను చంపేందుకు కుట్ర చేస్తున్న తన సోదరుడి బారి నుంచి కాపాడాలంటూ వరంగల్ జిల్లా పొనకల్‌కు చెందిన రైతు పొట్ల సురేందర్...బండిసంజయ్‌ను ఆదివారం కలిశారు. ఆయన ఐద్రోజులుగా హైదరాబాద్‌లో నాగలిపట్టిన ఫ్లెక్సీతో అర్ధ నగ్నంగా తిరుగుతూ సీఎం, మంత్రులు, డీజీపీని కలిసేందుకు ప్రగతి భవన్, డీజీపీ కార్యాలయంసహా మంత్రుల చాంబర్ల చుట్టూ తిరుగుతున్న విషయం తెలిసిందే. తన పొలం తనకు ఇవ్వకపోగా, రెండుసార్లు చంపేందుకు యత్నించారనీ, దాడి చేశారని బండి ఎదుట వాపోయారు. పోలీసులను, మంత్రులను ఆశ్రయించినా న్యాయం జరగలేదన్నారు. 'బాధపడొద్దు. నీకు అండగా ఉంటా. న్యాయం జరిగేలా కృషిచేస్తా' అని భరోసా ఇచ్చారు. వెంటనే సదరు రైతు పక్షాన న్యాయ పోరాటం చేయాలంటూ లీగల్ టీంకు బాధ్యతలు అప్పగించారు.

అదానీ జోలికొస్తే.. ప్రతీకారమే

(మొదటిపేజీ తరువాయి)



ఎంతోమంది నోరు మూయించే ప్రయత్నం చేసింది. కేంద్రంలోని పాలకుల నుంచి అందుతున్న మద్దతు, సహకారంతో ఇదంతా సాగుతోంది. 'అదానీ గ్రూప్' గురించి మాట్లాడితే ప్రతీకారం తప్పదనే పరిస్థితి సృష్టించింది. హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చాక అదానీ గ్రూప్ మనుషులు పెద్ద సంఖ్యలో రంగంలోకి దిగారు.

మూడు రాష్ట్రాల్లో ఆరు కేసులు

67 ఏండ్ల పరంజమ్ గుహా థాకుర్తా ఇండిపెండెంట్ జర్నలిస్టు. ఆయనపై అదానీ గ్రూప్ ఆరు పరువునష్టం కేసులు వేసింది. ఇందులో మూడు క్రిమినల్ కేసులున్నాయి. గౌతం అదానీ కంపెనీ అక్రమాలపై వరుస వార్తా కథనాలు రాసినందుకు ఆయనకు దక్కిన ఫలితమిది. ఒక ఉన్నత స్థాయి కోర్టు న్యాయమూర్తి అదానీ గ్రూప్‌నకు అనుకూలంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ థాకుర్తా వార్తా కథనం రాశారు. దీనిపైనా ఆయన కోర్టు కేసు ఎదుర్కొంటున్నారు. ఇకపై ఆయన అదానీ పేరెత్తడానికి వీల్లేదు, అదానీపై వార్తలు రాయరాదు..అంటూ ఆ కేసులో న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుల విచారణను ఎదుర్కోవటానికి ఆయన అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

"గౌతం అదానీ కంపెనీ వ్యవహారాలపై మాట్లాడరాదు..అంటూ కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాల్ని ధిక్కరించలేం. అదానీ కంపెనీలు వేసిన కేసులను ఎదుర్కొనేందుకు పెద్దమొత్తంలో డబ్బులు ఖర్చు అవుతున్నాయి. మూడు రాష్ట్రాల్లో కేసుల విచారణకు హాజరవుతున్నాం. మానసికంగా, శారీరకంగా మమ్మల్ని వేధించటమే ఇది" అని థాకుర్తా సహ ఉద్యోగి అబీర్ దాస్‌గుప్తా చెప్పుకొచ్చారు. "మా సమయాన్ని, కుటుంబాల్ని ప్రభావితం చేస్తున్నారు. ఎంతో సమయాన్ని కోల్పోవటమేగాక, ఆదాయాన్ని సైతం వదులుకోవాల్సి వస్తోంది" అని చెప్పారు.

మోడీకి అనుకూలంగా మీడియా

ఎస్‌బీఐ వేల కోట్ల రుణాలు ఇచ్చాయి. అదానీ కంపెనీల అక్రమాల్లో మచ్చుకు ఇదొక ఉదాహరణ మాత్రమే. ప్రధాని మోడీకి గౌతం అదానీ అత్యంత సన్నిహితుడు అన్నది అందరికీ తెలిసిందే. కేంద్ర ప్రభుత్వంతో ఆయనకు ఉన్న సంబంధాలు, సహకారంతో రుణాలు అందాయని అర్థమవుతోంది. దీంతో ఓడరేవులు, విమానాశ్రయాలు, బొగ్గు క్షేత్రాలు, వంట నూనెల తయారీ..ఇలా అనేక రంగాల్లో 'అదానీ గ్రూప్' గుత్తాధిపత్యం పతాక స్థాయికి చేరింది.

ఖదీర్ ఖాన్ చావుకు పోలీసులే కారణం

- వారిపై చర్యలు తీసుకోవాలి
- ఆ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి :ఆవాజ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఖదీర్‌ఖాన్ చావుకు పోలీసులే కారణమనీ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ పోలీసులు ఖాదిర్ ఖాన్‌పై చైన్ స్నాచింగ్ కేసు బనాయించి చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు.

దీంతో అతను చనిపోయారని తెలిపారు. దొంగతనంతో సంబంధం లేని వ్యక్తిని అరెస్టు చేసి హింసించడం అత్యంత దుర్మార్గమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖదీర్ ఖాన్ కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చైన్ స్నాచింగ్ కేసులో అనుమానితుడిగా అతన్ని అరెస్టు చేశారనీ, నేరం ఒప్పించడం కోసం పోలీసులు తీవ్రంగా కొట్టడంతో చనిపోయాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారని తెలిపారు. వీపుమీద కమిలిన దెబ్బలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. నేరంతో ఖదీర్ ఖాన్ కు సంబంధం లేదని నిర్ధారణ అయ్యాక గుట్టుచప్పుడు కాకుండా వదిలేశారని తెలిపారు. కిడ్నీ ప్రాంతంలో తగిలిన దెబ్బల కారణంగా జనవరి ఐదున ఆస్పత్రిలో చేరారనీ, చికిత్స పొందుతూ ఖాదిర్‌ఖాన్ మృతి చెందాడని తెలిపారు. అతని మరణంతో భార్య ముగ్గురు పిల్లలు అనాధలయ్యారని పేర్కొన్నారు.

పోలీసులను కఠినంగా శిక్షించాలి : ఏఐవైఎఫ్

ఖాదీర్‌ఖాన్ చావుకు కారణమైన పోలీసులను కఠినంగా శిక్షించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లిఉల్లాఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మెదక్ పోలీసులు ఖాదీర్ ఖాన్ పై చైన్ స్నాచింగ్ కేసు బనాయించి చిత్రహింసలకు గురిచేసి ఆయన చావుకు కారణమయ్యారని విమర్శించారు. ఈ ఘటనలో పోలీసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఖదీర్ ఖాన్ కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

ఖదీర్‌ఖాన్ మృతి కేసులో సీఐ సహా నలుగురు పోలీసుల సస్పెన్షన్



సంచలనంగా మారిన ఖదీర్‌ఖాన్(37) మృతి కేసులో మెదక్ పట్టణ సీఐ మధు, ఎస్సై రాజశేఖర్, కానిస్టేబుళ్లు పవన్ కుమార్, ప్రశాంత్‌ను సస్పెండ్ చేస్తూ ఐటీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

వారానికి ఐదు రోజుల పని దినాలు కల్పించాలి

కనీస వేతనం రూ.26 వేలు చేయాలి

- మార్చి 6న ఛలో లేబర్ కమిషనరేట్ : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికులకు వారానికి ఐదు రోజుల పని దినాలు చేయడంతో పాటు, రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు పట్టణంలో గల శ్రామిక భవన్‌లో ఆదివారం జరిగిన కిర్బీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలపరిమితి ముగిసిన జీవోలన్నింటిని వెంటనే సవరించాలని కోరారు. మోడీ ప్రభుత్వం కనీస వేతనం రూ.7వేలుగా ప్రతిపాదించడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రయివేటీకరణను వేగవంతం చేయడం దేశానికి ద్రోహం తప్ప వేరేది కాదన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులను చూస్తే.. బీజేపీకి కార్పొరేట్ల మేలు తప్ప వేరే ప్రజల బాగోగులు అవసరం లేదని రుజువైందని చెప్పారు. బడ్జెట్‌లో కనీస వేతనాల ఊసే లేకపోవడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా లాంటి వాటిమీద స్పష్టత ఏమాత్రం రాలేదని విమర్శించారు. స్కీమ్‌లకు బడ్జెట్ పెంపుదల లేదని, రవాణా చట్టం, విద్యుత్ చట్టం లాంటివి ఉపసంహరించుకుంటుందేమోనని ఎదురుచూసిన కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. రవాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు గురించి ఊసేలేదని తెలిపారు. కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ పై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్మిక వర్గ సమస్యలు, కనీస వేతనాలకై మార్చి 6న నిర్వహించ తలపెట్టిన ఛలో లేబర్ కమిషన్ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లిఖార్జున్, రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రెటర్ వి ఎస్ రాజు, నాయకులూ శ్రీనివాస్, మల్లేశు, సుధాకర్, లకాన్, ఏడుకొండలు, ప్రభు, మహేశ్వర్ రెడ్డి, శంకర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో తొలి గజల్ కవయిత్రి 'ఇందిర' ఇక లేరు

- క్యాన్సర్‌తో మృతిచెందిన ఆమె
- సంతాపం ప్రకటించిన తెలంగాణ సాహితీ, టీఎస్‌యూటీఎఫ్




(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోనే తొలి గజల్ కవయిత్రి బైరి ఇందిర(60) ఇకలేరు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో ఆదివారం కన్నుమూశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన బైరి ఇందిర తాను చూసిన అనుభవం లోకి వచ్చిన ఉదంతాలకు అక్షర రూపమిచ్చి కథానికలుగా తీసుకొస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి గజల్ కవయిత్రిగానూ ఆమె పేరుపొందారు.

ఇల్లెందులోని జెడ్పీహెచ్ఎస్ సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విరమణ చేశారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా శాస్త్రీయ ఆలోచనలతో విద్యార్థులను తీర్చిదిద్దారు. ఒక వైపు ఉపాధ్యాయురాలుగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రవృత్తిగా సాహిత్యాన్ని చివరి వరకు సమాజహితానికి అందించారు. 1998లో 'తేనెల పలుకు' కవిత్వానికి ఆస్ట్రేలియా అంతర్జాతీయ అవార్డు లభించింది. 2016లో విజయవాడ మానస సాహిత్య అకాడమీ జాతీయ స్థాయి అవార్డు దక్కింది. 2009లో ఉమ్మడి రాష్ట్రంలో అంటేవుర్ రాష్ట్ర స్థాయి సాహిత్య అవార్డు, 2013లో కొత్తగూడెం 'చిగురు సాహిత్య అకాడమీ' నానో విభాగంలో అవార్డులు లభించాయి. 'అలవోకలు' వచన కవిత్వం, 2007లో, 'అభిమతం' 2016లో తొలి 'తెలంగాణ గజల్ కావ్యం' అచ్చయ్యాయి. 2021లో 'అక్షింతలు' మినీ కవితలు, 'వలపోత' కథలు, 'మరోప్రారంభం' కవిత్వం పుస్తకాలు వెలువరించారు. 2022 డిసెంబర్‌లో వురిమళ్ల ఫౌండేషన్ అవార్డు అందుకున్నారు.

తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ నివాళి

ప్రముఖ కవయిత్రి, తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ సభ్యురాలు బైరి ఇందిర మరణం సాహితి లోకానికి తీరని లోటని తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభాపురం జనార్థన, కె. ఆనందాచారి అన్నారు. నిజాంపేటలోని ఆమె నివాసంలో ఆమె భౌతికకాయానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, రాష్ట్ర కోశాధికారి అనంతోజు మోహన్ కృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి సలీమ, నగర నాయకులు శరత్ సుదర్శి, ఎం. రేఖ నివాళులు అర్పించారు.

సాహితి స్రవంతి సంతాపం

ఉమ్మడి రాష్ట్రంలో సాహితీ స్రవంతి కార్యకర్తగా ఖమ్మం, హైదరాబాద్‌లో జరిగిన జనకవనం, సాహిత్య కార్యశాలలో ఆమె చురుగ్గా పాల్గొన్నారు. తరువాత తెలంగాణా సాహితిలో ఉన్నారు. ఆవిడ మృతికి సాహితి స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, సత్యరంజన్, సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ సంతాపం తెలిపారు.

అధ్యాపకులు ఎం.కోటేశ్వర్‌రావు, అభ్యుదయ రచయిత బైరి ఇందిర మరణాలకు టీఎస్‌యూటీఎఫ్ సంతాపం

అధ్యాపకులు ఎం. కోటేశ్వరరావు, బైరి ఇందిర మరణాల పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.జంగయ్య, చావరవి సంతాపం ప్రకటించారు. ఆదివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.ఇరు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు మన్నెపల్లి కోటేశ్వరరావు (75) ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేశారని తెలిపారు. అభ్యుదయవాదిగా, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఉద్యమాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. బైరి ఇందిర (60) ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఉపాధ్యాయులుగా పనిచేశారని పేర్కొన్నారు. టీఎస్ యూటీఎఫ్‌లో, అభ్యుదయ కవి, రచయిత్రి. సాహితీ స్రవంతి, అక్షరాస్యత, ప్రజాసైన్స్ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు.

మనుస్మృతి హక్కులను హరిస్తే... రాజ్యాంగం కల్పించింది

- స్వేచ్ఛ జేఏసీ సదస్సులో సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్
- మనువాదానికి మరణ శాసనం రాయాల్సిందే : ప్రజాకవి జయరాజు
- సదస్సు అనంతరం నేతల అరెస్ట్
- శాంతియుతంగా సదస్సు పెట్టుకుంటే అరెస్టులా? : స్వేచ్ఛ జేఏసీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజల స్వేచ్ఛకు నిర్బంధాలు విధించి, కులాధిపత్యంతో కులపీడన చేసిన మనుస్మృతిని మళ్లీ తీసుకురావడం శోచనీయమని సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్ అన్నారు. అణగారిన ప్రజలను మనుస్మృతి అణిచివేసిందని, భారత రాజ్యాంగం మాత్రం వారిని అక్కున చేర్చుకుని హక్కులు కల్పించిందని తెలిపారు. స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి' అనే అంశంపై జేఏసీ కన్వీనర్ టి.రమేష్ అధ్యక్షతన ఆదివారం అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో నిర్వహించిన సదస్సులో సతీష్‌చందర్ పాల్గొని మాట్లాడారు. మనుస్మృతి వేల ఏండ్లుగా ఈ దేశ ప్రజలను వర్ణం, కులం అనే గీతలు గీసి మెజారిటీ ప్రజలను అణచివేసిందని, ముఖ్యంగా మహిళలను ఒక ప్రాణం ఉన్న మనిషిగా చూడడానికి నిరాకరించిందన్నారు.



భర్త చనిపోతే భర్తతో పాటే పాడే ఎక్కి చావాలని నిర్దేశించడంతో పాటు వారికి చదువు, ఆస్తి వద్దని, సేవ మాత్రమే చేయాలని కుతంత్రం చేసిందని విమర్శించారు. కానీ భారత రాజ్యాంగం వారికి చదువు ఇచ్చిందని, ఆస్తి అవకాశం కల్పించిందని, ఓటు హక్కు ఇచ్చిందని, రాజ్యాన్ని పాలించాలని కూడా చెప్పి ఎంతో స్వేచ్ఛను కల్పించిందని తెలిపారు. కానీ రాజ్యాంగం పాటిస్తామని వాగ్దానం చేసిన పాలకులే నేడు రాజ్యంగ హక్కుల పట్ల చిన్నచూపు చూపుతున్నారని విమర్శించారు. రచయిత జూపాక సుభద్ర మాట్లాడుతూ.. మనుస్మృతికి వ్యతిరేకంగా, భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కుల రక్షణకు పోరాటం తప్పదన్నారు. ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ.. అంబేద్కర్, మార్క్స్, బుద్ధుడు చెప్పిన అంశాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికే, రాజ్యాంగం హక్కుల రక్షణ కోసమే స్వేచ్ఛ జేఏసీ ఏర్పడిందన్నారు.

మనువాదానికి మరణ శాసనం రాయాలని పాటతో ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్వేచ్ఛ జేఏసీ కోకన్వీనర్లు కోలా జనార్ధన్, ఝాన్సీ, ఆదాం రాజు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, పీడీఎస్‌యూ నాయకులు మహేష్, డీబీఎఫ్ నాయకులు శంకర్, నాయకులు గుత్తా జ్యోత్స్న, కృష్ణచంద్, రామకృష్ణలు పాల్గొన్నారు.

నేతల అరెస్టు

సైఫాబాద్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి' అనే అంశంపై శాంతియుతంగా సదస్సును ముగించుకుని వెళ్తున్న స్వేచ్ఛ జేఏసీ, సామాజిక, ప్రజాసంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నేతలను నాంపల్లి, ముషీరాబాద్ పోలీసు స్టేషన్లకు తరలించారు. రాష్ట్రంలో శాంతియుతంగా హాల్ మీటింగ్ కూడ నిర్వహించుకోలేని పరిస్థితి ఉండటం దౌర్భాగ్యమని స్వేచ్ఛ జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని తగులబెడతామంటున్న వాళ్లను పోలీసులు రక్షిస్తున్నారని, రాజ్యాంగాన్ని రక్షించాలని శాంతియుతంగా సమావేశాలు నిర్వహిస్తున్న వాళ్లను అక్రమ అరెస్టులు చేయడం శోచనీయమన్నారు.

ఇదేంతీరు : డీవైఎఫ్ఐ

హైదరాబాద్‌లోని అంబేద్కర్ రీసోర్స్ సెంటర్‌లో భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి సదస్సు ముగించుకుని తమ ఇండ్లకు వెళ్తున్న స్వేచ్ఛ జేఏసీ నాయకులను అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ తెలిపారు. అరెస్టు చేసిన ప్రజాసంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్‌తో సహా పలువురు స్వేచ్ఛా జేఏసీ నేతలను అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ దగ్గరున్న అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహిస్తారనే అనుమానంతో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, జర్నలిస్టు సతీష్ చందర్, కవి జయరాజు, జూపాక సుభద్ర, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు, జేఏసీ కన్వీనర్ టి.రమేష్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్, బానాసా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదాం రాజు వంటి ప్రజాసంఘాల నేతలను అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో 'భారత రాజ్యాంగం-మనుస్మృతి సదస్సు అనంతరం ఇంటికి వెళ్తున్న సామాజిక ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అప్రజాస్వామికంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో శాంతియుతంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు.

అప్రజాస్వామికచర్య : కేవీపీఎస్

స్వేచ్ఛ జేఏసీ నాయకులకు అక్రమంగా అరెస్టు చేశారనీ, ఇది అప్రజాస్వామక చర్య అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో 'భారత రాజ్యాంగం-మనుస్మృతి' అంశంపై జరిగిన సదస్సులో వారు పాల్గొన్నారనీ, సదస్సు అనంతరం ఇంటికి వెళుతున్న సామాజిక, ప్రజాసంఘాల నేతలను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు.

ఎస్ఆర్ఎంఐఎస్టీ వీసీకి కల్నల్ ర్యాంకుతో సత్కారం




హైదరాబాద్ :

ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఎంఐఎస్టీ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ సి. ముత్తమిళ్ చెల్వన్‌కు అత్యుత్తమ గౌరవం దక్కింది. నేషనల్ కాడెట్ కార్ప్స్‌కు అందజేసిన సేవలకు గాను గౌరవ కల్నల్ గుర్తింపు లభించింది. ఈనెల 18న జరిగిన పిప్పింగ్ వేడుకల్లో ఆయనకు ఈ సత్కారం చేశారు. ఎస్ఆర్ఎంఐఎస్టీలోని డాక్టర్ టీపీ గణేశన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చిన లెఫ్టినెంట్ జనరల్ ఎ. అరుణ్, వైఎస్ఎం ఎస్ఎం విఎస్ఎం, జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఆఫ్ సౌత్ ఇండియా సంయుక్తంగా ర్యాంకును, బ్యాడ్జిలను ప్రొఫెసర్ ముత్తమిళ్ చెల్వన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి గౌర అతిథిగా కమాండర్ అతుల్ కుమార్ రస్తోగి డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎన్‌సీసీ డైరెక్టరేట్ పాల్గొన్నారు. ఈ గౌరవం తనకు దక్కినందుకు గర్వపడుతున్నానని ప్రొఫెసర్ ముత్తమిళ్ చెల్వన్ అన్నారు.

వ్యసనంలా యాంటీ బయాటిక్స్....

- దాంతో ఇతర మందులూ పని చేయని వైనం
- ఇష్టానుసారంగా వాడిన ఫలితం
- భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పకపోవచ్చు : నిపుణుల హెచ్చరికలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరోనా మహమ్మారి మానవాళి పట్ల చూపించిన దయనీయ పరిస్థితులు అందరికి అనుభవంలోకి వచ్చినవే. అయితే సమీప భవిష్యత్తులో కంటికి కనిపించని మరో మహమ్మారి పొంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ప్రజల అవగాహనాలేమి పెరిగి కోరి విపత్తుకు స్వాగతం పలుకుతున్నారని హెచ్చరిస్తున్నారు. ఈ మారు వచ్చే మహమ్మారి కారణంగా మందులే పని చేయని దారుణ పరిస్థితులు ఏర్పడబోతున్నాయని విశ్లేషిస్తున్నారు. వైద్యసేవల ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ పుణ్యమానీ, ఖరీదైన మందుల వాడకం పేరుతో ప్రజలు అవసరానికి మించి యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. దీనికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, నియంత్రణ లేకపోవడం కూడా ఈ పరిస్థితికి మరో బలమైన కారణంగా చెబుతున్నారు. ఇప్పటికే వారంలో ఒక్కో విభాగంలో వారంలో మూడు నుంచి నాలుగు కేసుల్లో రాసిన మందులు పని చేయనివి ఉంటున్నాయని పలువురు డాక్టర్లు తమ అనుభవాలను చెబుతున్నారు. ఆధునిక వైద్య చికిత్సలో రోగం రావడానికి కారకాన్ని మొదట గుర్తించాలి. ఆ తర్వాత చికిత్సలో భాగంగా సంబంధిత డాక్టర్లు సిఫారసు చేసిన మందులను, సూచించిన మోతాదులో మాత్రమే (రాసిన దాని కన్నా ఎక్కువ కాకుండా, తక్కువ కాకుండా) వాడాలి. సాధారణంగా వ్యాధులు ఫంగస్, వైరస్, పరాన్న జీవులు (పారాసైట్స్), హానికారక బాక్టీరియాల కారణంగా వస్తుంటాయి. వీటిని రోగ నిర్ధారణ పరీక్షల ద్వారా గుర్తించి, అందుకు తగిన చికిత్సను అందిస్తారు. అయితే చాలావరకు డాక్టర్ల వద్దకు వెళ్లకుండా రోగకారకాన్ని కూడా గుర్తించకుండా అన్ని రోగాలకు ఒకే మందు అన్నట్టు ... మెడికల్ షాపుల నుంచి యాంటీబయాటిక్స్‌ను తీసుకుని వాడటం కూడా ఇబ్బందికరంగా మారుతున్నట్టు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇబ్బడి ముబ్బడిగా యాంటీబయాటిక్స్ వాడకంతో అవి పని చేసే శక్తిని కోల్పోతున్నట్టు గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2015లోనే వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయా దేశాలను హెచ్చరించింది. ఆ సభ్య దేశాల్లో వాటి నియంత్రణకు మార్గదర్శకాలను జారీ చేసింది. దీన్ని కార్యరూపంలో ఉంచాల్సిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు, ఫార్మకో విజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా ఔషధ వ్యవస్థను నియంత్రిస్తూ క్రమపద్ధతిలో కొనసాగించాల్సి ఉన్నది. దీనికి తోడు రాష్ట్రంలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ పని చేస్తున్నది. కేంద్ర, రాష్ట్ర పరిధిలో పలు వ్యవస్థలను ఏర్పాటు చేసినప్పటికీ యాంటీబయాటిక్స్ ఇష్టానుసారంగా వాడే దానిపై పూర్తి స్థాయిలో నియంత్రణ సాధించకపోవడం గమనార్హం. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం...ప్రతి ఆస్పత్రిలో ఫార్మసీ అండ్ థెరపటిక్ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికి ఫార్మసిస్ట్ కన్వీనర్‌గా, ఆస్పత్రి సూపరింటెండెంట్ లేదా డైరెక్టర్ అధ్యక్షునిగా వ్యవహరిస్తారు. అన్ని క్లినికల్ విభాగాలకు చెందిన డాక్టర్లు సభ్యులుగా ఉంటారు. ఒక మైక్రో బయాలజిస్ట్ కు ఇన్ఫెక్షన్ డిసీజెస్ నియంత్రించే హోదా కల్పించి యాంటీబయాటిక్స్ పాలసీని అమలు చేయాల్సి ఉంటుంది. అయితే చాలా వరకు కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రులు ఈ పాలసిని అమలు చేయకపోవడం లేదా మొక్కుబడిగా అయిందనిపించినట్టు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం వీటన్నింటిని నియంత్రించాల్సిన నిపుణులు సూచిస్తున్నారు.



2050 నాటికి 10 మిలియన్ల మరణాలు :డాక్టర్ బుర్రి రంగారెడ్డి

వైద్య పరిభాషలో యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)గా వ్యవహరించే యాంటీ బయాటిక్స్ పని చేయని పరిస్థితిని ఆపకపోతే 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా 10 మిలియన్ల మరణాలు సంభవించే ప్రమాదముందని ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ బుర్రి రంగారెడ్డి హెచ్చరించారు. 2019 నాటికే 4.95 మిలియన్ల మంది బాక్టీరియల్ డ్రగ్ రెసిస్టెన్స్‌తో చనిపోయిన విషయాన్ని లాన్సెట్ రిపోర్ట్ చేసిందని గుర్తు చేశారు. పశువులకు సైతం అనవసరంగా వాడే మందులతో మనుషుల్లోకి ఆహారం రూపంలో ఈ ప్రమాదం వస్తున్నదని తెలిపారు. ఉదాహరణకు ఇ.కొలి అనే యాంటీబయాటిక్ ఔషధం ముగ్గురిలో ఒకరికి మాత్రమే, క్లెబ్సియెల్లా న్యూమోనియా ఇద్దరు రోగుల్లో ఒకరికి మాత్రమే, కార్బపెనెమ్స్ అసినెటొబాక్టర్ బ్యూమన్ని పది మందిలో ఒకరికి మాత్రమే పని చేస్తుండడం పొంచి ఉన్న ప్రమాదాన్ని సూచిస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యతో ప్రపంచవ్యాప్తంగా 2050 నాటికి 28 మిలియన్ల మంది పేదరికంలోకి నెట్టబడతారనీ, ఇండియాలో దీనికి సంబంధించి నిర్దిష్టమైన గణాంకాలు లేకపోయినప్పటికీ వైద్య ఖర్చులతో పేదరికంలోకి నెట్టబడుతున్న అంశాల్లో ఇది కూడా చేరబోతున్నదని తెలిపారు.

భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవాలి

తెలంగాణ తొలి గజల్ కవయిత్రి 'ఇందిర'కు నివాళి



కవులు, కళాకారులు సామాజిక బాధ్యతను తలకెత్తుకుని సామాజిక సమస్యలను కవితలు, కళా రూపాల్లో వ్యక్తం చేస్తుంటారు. అలా సమాజం గజల్ గీతం పట్ల తన బాధ్యతను నెరవేరుస్తూ కవితలు, గజళ్లు.. రచనలు, గేయాలాపనలతో సమాజాన్ని చైతన్య పరిచారు. తెలంగాణ సాహితిలో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఉన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన బైరి ఇందిర.. తాను చూసిన... అనుభవంలోకి వచ్చిన ఉదంతాలకు అక్షర రూపమిచ్చి.... కథానికలుగా తీసుకొస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి గజల్ కవయిత్రిగానూ పేరొందారామె. ఇల్లెందులోని జడ్పీఎస్ఎస్, సుబ్బానగర్ ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విరమణ చేశారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా శాస్త్రీయ ఆలోచనలతో విద్యార్థులను తీర్చిదిద్దారు. ఒక వైపు ఉపాధ్యాయురాలుగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రవృత్తిగా సాహిత్యాన్ని చివరి వరకు సమాజహితానికి అందించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం (19-02-2023)న కన్నుమూశారు.

- 1998లో 'తేనెల పలుకు' కవిత్వానికి ఆస్ట్రేలియా అంతర్జాతీయ అవార్డు.
- 2016లో విజయవాడ మానస సాహిత్య ఆకాడమీ జాతీయ స్థాయి అవార్డు.
- 2009లో ఉమ్మడి రాష్ట్రంలో అంటేవుర్ రాష్ట్ర స్థాయి సాహిత్య అవార్డు.
- 2013లో కొత్తగూడెం 'చిగురు సాహిత్య అకాడమీ' నానో విభాగంలో అవార్డు.

'అలవోకలు' వచన కవిత్వం, 2007లో, 'అభిమతం' 2016లో 'తెలంగాణ గజల్ కావ్యం' అచ్చయ్యాయి. 2021లో 'అక్షింతలు' మిని కవితలు, 'వలపోత' కథలు, 'మరోప్రారంభం' కవిత్వం పుస్తకాలు వెలువరించారు. 2022 డిసెంబర్‌లో వురిమళ్ల ఫౌండేషన్ అవార్డు అందుకున్నారు.

నేను పోయినప్పుడు

నేను పోయినప్పుడు
వస్త్రానికి బదులు
ఓ కాగితాన్ని కప్పండి
కవిత రాసుకుంటాను

సిరాబుడ్డినీ, పెన్నునొకదాన్ని
బ్యాగులో వుంచండి
మనసులో
ముల్లు గుచ్చుకున్నప్పటి పాటో
గాయపడిన గజలో
గుండెలోయలనుండి
జాలువారొచ్చు
సెల్ మర్చిపొయ్యేరు
బోర్ కొట్టి చస్తాను

పసుపూ-కుంకుమ పులిమి
భయానకంగా మార్చకండి
నన్నందరూ గుర్తుపట్టాలి మరి!
దండలతో మూసెయ్యకండి
నాకు ఎలర్జీ!!
ఆ రేకులతో ఏ దార్నైనా
మెత్తగా పరవండి

పుణ్యస్త్రీ, పాపపు స్త్రీ అని
పేర్లు పెట్టకండి
నచ్చదు
సామాన్లేవీ పారేయొద్దు
అడిగిన వాళ్లకిచ్చేయండి
బ్యాండ్ వాళ్ళను
ఓల్డ్ మెలొడీస్ వాయించమనండి
డ్యాన్సులాడి లేట్ చెయ్యకండి
టైమంటే టైమే!

మంగళవారమో!
అమంగళవారమో!!
పాడెకు కోడిపిల్లను కట్టి
హింసించకండి
బడికి కబురు పెట్టండి
నే బతికిన క్షణాలు తలుచుని
వాళ్ల సెలవిచ్చుకుంటారు

దింపుడుకళ్లం దగ్గర
చెవులు గిల్లుమనేలా పిలవకండి
తలుచుకునేవారెవరో నాకు తెలుసు

డబ్బుకు ఇబ్బందక్కరలేదు
పక్కవాళ్ల కొట్లో ఖాతా ఉంది
అన్ని రోజులూ ఇక్కడే ఉండండి
మళ్లీ మళ్లీ చస్తానా ఏంటి!

మట్టిలో కప్పెట్టకండి
పురుగూ పుట్రా భయం!
కాస్త చూసి తగలబెట్టండే...
చుట్టుపక్కల మొక్కలుంటాయేమో!
గంధపు చెక్కలతో కాలడం కంటే
జ్ఞాపకమై పరిమళించడమే
ఎక్కువ నాకు

పనిలో పని!
నా నవ్వులూ కన్నీళ్ళు
ఆవిరైపోతున్న కాష్టం దగ్గర
కవిసమ్మేళనం పెట్టండి
నేనూ ఉన్నట్టుంటుంది
తనివితీరా విన్నట్టుంటుంది

- బైరి ఇందిర

కవితలకు ఆహ్వానం

డా. బాబాసాహెబే అంబేద్కర్ 132 వ జయంతి సందర్భంగా 125 మంది కవులతో, ఒక కవితా సంపుటి తీసుకుని రానున్నట్లు నిర్వాహకులు తంగిరాల సోని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 20 - 25 పంక్తులకు (లైన్లు) మించకుండా యూనికోడ్ ఫాంట్‌లో మార్చి 20 లోగా sonytangirala@gmail.com మెయిల్ ఐడికి పంపవచ్చు. వివరాలకు తంగిరాల సోని 9676609234 నంబరు నందు సంప్రదించవచ్చు.

సూర్యుడు

లోకం తట్టుకోలేని వెలుగును
తనలో దాచుకొని ఉంటాడు,
ప్రతిరోజూ
పసిపాప కళ్ళు తెరిచినట్లు
మెల్లిమెల్లిగా మేల్కొని
అల్లరల్లరి చేస్తాడు,
తాను అలసిపోగానే
మనల్ని హాయిగా నిద్రబుచ్చి
మరో లోకానికి పయనిస్తాడు!

పిల్లాడిలా ఎప్పుడూ పాకుతూ
కరములనే కిరణాలుగా వెదజల్లి
అంతా తానై అల్లుకుపోతాడు,
బంతిలా ఎప్పుడూ దొర్లుతూ
అందరి ఎదలోకి దూరిపోతాడు!

నెత్తి మీదికి ఎక్కి
ఒక్కోసారి విసిగిస్తాడని
అందరూ తిట్టుకుంటారే గానీ,
ఒక్కక్షణం తాను లేకపోతే
అందరూ అల్లాడిపోతారు!

అప్పుడప్పుడు
మేఘాలపరుపులపై కునుకు తీస్తూ
కాసింత నీడవరాన్ని అందిస్తాడు,
వరదలు ముంచెత్తినా
చలిపులి పంజా విసిరినా
కంటిచూపుతో కట్టడిచేస్తాడు!

సూర్యుడు
ప్రతిరోజూ నిండు చందమామే,
అతనికి ఏ పక్షమూ లేదు
అందరి పక్షమై
వెలుగుదారులను చూపిస్తూ
బతుకుముద్దలు తినిపిస్తాడు!

ఎంత గొప్పోడైనా
అతని ముందు మిణుగురు పురుగే,
అందుకే లోకాలన్నీ గోళాలై
అతని చుట్టే ప్రదక్షిణం చేస్తాయి!

కాంతి
అతని ఒక్కడిదే కావచ్చు కానీ,
అందరి కళ్ళల్లో ఉండేది
అతడు పంచిన వెలుగే!

- పుట్టి గిరిధర్,
9494962080



ఏడాదికోసారి వచ్చే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం తెలుగు నేలపై ఘనంగా జరగడం చూస్తుంటాం. ఆ రోజు రెండు తెలుగు రాష్ట్రాల్లో కోలాహలానికి తక్కువే ఉండదు. బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకుని యునెస్కో 1999 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రకటించింది. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. ఈ లక్ష్యాలతో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకోవాలి.



- ముక్తేశ్వరరావు
విశ్రాంత ఐఏఎస్ అధికారి

మన రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంది?

మన రాష్ట్రంలో మాతృభాష పరిస్థితి దినదిన గండంగా ఉంది. దీనికి నూరేళ్ల ఆయుష్షు పోయాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది.

బడిలో పరిస్థితి ఎలా ఉంది?

పిల్లలు చదవడం, ఉపాధ్యాయులు బోధించడం ఏ మాధ్యమంలో ఉండాలి? ఇది మాతృభాషకు సంబంధించిన నిత్య జీవిత సమస్య. తరగతి గదిలో బోధనకు సంబంధించిన సమస్య. బోధనకు సంబంధించిన సమస్య అనడం కన్నా విద్య విజ్ఞానాలకు సంబంధించిన సమస్య అనడం సముచితం. విద్యా విజ్ఞానాలు మాతృభాషలోనే బోధించాలన్న అంతర్జాతీయ విధానాలకు విరుద్ధంగా మన రాష్ట్రంలో చట్టాలు అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో కస్తూరి రంగన్ మాతృభాషలోనే ప్రాథమిక స్థాయిలో విద్యా బోధన కొనసాగాల్సిన అవసరాన్ని పదే పదే చెప్పారు. అత్యంత క్లిష్టమైన విషయాలను సుబోధకంగా చెప్పారు. అన్నమాచార్యుల వారు చెప్పినట్లు వెల సులభము, ఫలమధికము అన్నట్లుగా మాతృభాషలో విద్యాబోధన వల్ల కలిగే ఫలితాలను కస్తూరి రంగన్ విస్తృతంగా చెప్పారు. ఇది నేర్చుకోవడానికి సంబంధించిన సమస్య అని ఆయన చెప్పినా కూడా వీటన్నిటినీ పెడచెవిన పెట్టి మన దోవన మనం పోతున్నాం. అందువల్ల బడిలో మాతృ భాష ఒక భాషాంశంగా మార్కులు తెచ్చుకునే సబ్జెక్టుగానే మిగిలిపోయే ప్రమాదంలో పడింది. భాషా పరమైన అంశంగా మారటం అనేది భాషకి గడ్డు రోజులు వచ్చినట్టు సూచించే మొదటి ప్రమాద సూచిక.

ఏలుబడిలో.. పరిస్థితి ఎలా ఉంది?

రెండవ అంశము నిత్య జీవితంలో ప్రజలు ప్రభుత్వం చేస్తున్న కార్యకలాపాలని తెలుసుకునేందుకు వాటిని అనుసరించేందుకు, ఆలోచించేందుకు, ప్రశ్నించేందుకు వాళ్లు అత్యున్నతమైన లేదా అతి శ్రేష్ఠమైన హక్కుని కలిగి ఉంటారు. పాలనా వ్యవహారాలకు సంబంధించిన జీవోలు మొదలైనవన్నీ కూడా జిల్లా స్థాయిలోనూ, మండల స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలో కూడా నిరాఘాటంగా భాషా ప్రయుక్త రాష్ట్రమని పేరుగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కూడా సాగుతున్న విషయం. మనం ఎవరం నిరూపించాల్సిన అవసరం లేదు. కోర్టులో కొన్ని నిత్యసత్యాలుగా భావించే అంశాలు ఉంటాయి. అంటే ఉదాహరణకి ఇవాళ ఫలానా తేదీ అని నిరూపించక్కర్లేదు. ఇవాళ ఫలానా ఏడాదని నిరూపించాల్సినా అవసరం లేదు. అలాగే తను మనిషి అని నిరూపించక్కర్లేదు. ఇలాంటివన్నీ కూడా ఎలాగా నిరూపించాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా పాలన భాషలో కనుమరుగవుతున్న వృత్తాంతం కూడా మనకి కనపడుతోంది. ఉదాహరణకి ఒక అరడజన్ జీవోలు కూడా భాషలో తేలేని స్థితి మనకు ఉంది. మొత్తం రాష్ట్ర ఆవిర్భావం దగ్గర నుంచి ఇప్పటివరకు తీసుకుంటే ఒక రెండు శాతం మించి జీవోలు ఇవ్వలేని దుస్థితి. మన పాలనా వ్యవహారాలన్ని ఇంగ్లీష్ వాడు ఉన్నప్పటికన్నా ఉత్సాహంగా మనం ఇవాళ నిర్వహించుకుంటున్నాం. ఈ రకంగా నిత్య జీవితాన్ని కూడా ప్రభావితం చేసే పాలన వ్యవహారాల్లో కూడా గండం వచ్చింది.

మూడోది న్యాయ వ్యవహారాలు.. ముఖ్యంగా ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా అనేక చిన్న చిన్న సమస్యలు కూడా కోర్టుల ముందుకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ కోర్టులు - రెవెన్యూ కోర్టులు, న్యాయానికి సంబంధించిన కోర్టులు. రెండు రకాల కోర్టుల్లోని వ్యవహారాలు అంటే విచారణ దగ్గర నుంచి వాగ్మూల నివేదికలు చేయడం వరకు అన్నింటికీ మొదట ఇంగ్లీషులో నిర్వహిస్తున్నారు. రాష్ట్రం తరపున పని చేసే పోలీసు యంత్రాంగంలో కూడా చాలావరకు నివేదికలు, విచారణకు సంబంధించినంతవరకు ఇంగ్లీషులోనే జరుగుతున్న విషయం మనకి స్పష్టంగా తెలుసు. అందువల్ల న్యాయ వ్యవహారాల్లో ముఖ్యంగా రైతులు కూలీలు నిరుపేదలు సాధారమైన చిక్కులు తెలియనటువంటి వారు, చదువుకున్న వారిలో ఉపాధ్యాయులు, అధికారులు కూడా న్యాయస్థానాల ముందు నీళ్ల నములుతూ నిలబడి నిర్వీర్యంగా, నిస్తేజంగా నిలబడాల్సిన దుస్థితి వస్తోంది. ఇది న్యాయ వ్యవహారాలకు సంబంధించిన విషయం.

నాలుగవది శాసన నిర్వహణ వ్యవహారాలకు సంబంధించిన విషయం.. శాసన నిర్మాణంలో ముఖ్యంగా శాసన నిర్మాణంలో జరిగే, శాసనసభలో ప్రవేశ పెట్టే చర్చలు తెలుగులో జరిగినప్పటికీ కూడా రూపొందించేటటువంటి చట్టం ఇంగ్లీష్‌లోనే రూపొందిస్తున్నారు. నిజానికి అధికార భాషా సంఘం తర్వాత ఇచ్చినటువంటి జి నాయర్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సర్క్యులెట్స్‌లో చీఫ్ సెక్రటరీ పేర్కొన్నది శాసన నిర్మాణంలో బిల్లులు కూడా తెలుగులో ప్రవేశపెట్టాలి. కానీ తెలుగు కాపీని శాసన సభ్యులకు మాత్రమే ఇస్తున్నారు. అది అధికారిక కాపీ తెలుగు వాళ్లకు ఎక్కడా దొరకదు. ఏ తెలుగువాడైనా తనకు తెలుసుకోవాలనుకున్నా దానికి తెలుగు గెజిట్ కాపీలో దొరకు రాజ పత్రాలన్నీ కూడా ఇంగ్లీష్‌లోనే ముద్రించబడి ఉంటాయి. శాసన నిర్మాణం అయినటువంటి బిల్స్ అన్ని కూడా ఇంగ్లీషులోనే వస్తూ ఉంటాయి. ఏదో దానికి సంబంధించిన నామమాత్రపు అనువాదాలు మాత్రమే ఉంటున్నాయి. దీన్ని ఎవరైనా పరిశీలించుకోవచ్చు. నిత్య జీవితంలో మాతృభాష ఈ రకంగా కనుమరుగవుతుంది.

గుడిలో పరిస్థితి ఎలా ఉంది?

తర్వాతది గుడి.. గుడిలో మనకి నవవిధ ప్రక్రియల గురించి ప్రధానంగా సంప్రదాయాల్లో చెప్తారు. వందనం, కీర్తనం, శ్రవణం ఇవన్నీ చెప్తారు. వీటిల్లో అన్నీ కూడా వీటన్నిటికీ సంబంధించి ఉదయం స్వామి వారి మేలుకొలుపు దగ్గర నుంచి సాయంత్రం పవళింపు సేవ పర్యంతం ఆరగింపు పవళింపు సేవ అన్ని జరిగేంత వరకు ప్రతి దానికి సంబంధించిన కీర్తనలు ఉన్నాయి. మన పూర్వీకులు అందరూ కూడా దేవాలయాల్లో ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

ఇవాళ కూడా తమిళనాడులో శివాలయంలో తేవారంలు కృష్ణ ఆలయంలో పాశురములను పాడుతూ ఉంటారు. ఆయా సందర్భాల్లో సన్నివేశాల్లో కానీ ఇవన్నీ కూడా కనుమరుగైపోయి మొత్తం కేవలం సంస్కృతంలో శబ్దాలు మాత్రమే ఉన్నటువంటి పరిస్థితి మనకు కనబడుతోంది. భక్తులకు ఆధ్యాత్మికవేత్తలకు మమ అనుకోడానికి మాత్రమే పనికొచ్చే అంశంగా గోత్ర నామాలు చెప్పుకునే అంశంగా గుడి ఉంది. గుడిలో పాడే కీర్తనలు కూడా మెల్లమెల్లగా కనుమరుగైపోతున్నాయి.

రాష్ట్రం బయట తెలుగు పరిస్థితి ఏమిటి?

గతంలో ప్రవాస ఆంధ్రులకు వారి మాతృభాషలో చదువుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు వారు ఆ అవకాశాన్ని కోల్పోతున్నారు. ఇతర ఇరుగుపొరుగు రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ ఉన్న తెలుగువారి పిల్లల చదువు సంధ్యల కోసం నిధులు కేటాయించడం మానేశాయి. ఇప్పటివరకు చెప్పినవన్నీ నిత్య జీవితంలో మాతృభాష విషయంలో ఎదురవుతున్న సమస్యలు.

> ఇప్పుడు జరిగే, జరుగుతున్న భాషా దినోత్సవాలు కూడా ఇలాగే ఉన్నాయి. వీటివల్ల ఏ ప్రయోజనము ఒనగూరదు. కనీసం ఈ ఒక్కరోజైనా మాతృభాష ఎదుర్కొంటున్న గండాలను తప్పించడానికి ఏం చేయాలి? సమస్య కళ్ళల్లోకి నేరుగా ఎలా చూడాలి అని దృక్పథాన్ని మనం అలవర్చుకోవాలని నేను కోరుకుంటున్నాను. నిజానికి భాష ప్రాతిపదికగా ఒక రాష్ట్రాన్ని కోరుకున్న మొదటి రాష్ట్రం మనది! ఇటీవలి చరిత్రలోకి తొంగి చూసినా ఆ నిజాలన్నీ తెలుస్తాయి. కానీ మనం చరిత్రను నేర్చుకోం! చరిత్ర నుంచి నేర్చుకోం అని భీష్మించుకుని కూర్చున్న వారిని ఏం చేయగలం?

అనువాదం.. అవసరం!

మరొక ప్రధానమైన సమస్య ఈ శతాబ్దానికే సమస్యగా ఉన్న విషయం అనువాదం. ఆధునిక విషయాలు, సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో సహాయకారిగా ఉండేది అనువాదం. కొత్త విషయాలు ప్రజానీకానికి అందాలంటే ప్రత్యేకంగా అనువాద విభాగం ఉండాలి. పదకోశాలు తయారవుతూ ఉండాలి. మన దేశంలో ఇది జరగాల్సినంతగా జరగడం లేదు.

విదేశాలను చూసి నేర్చుకోలేమా?

ఈ సందర్భంగా ఒక విషయాన్ని ప్రస్తావిస్తాను. చైనాకు సంబంధించిన ఒక విద్యార్థి ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్ళాడు. అక్కడ ఒక ప్రొఫెసర్ ఒక కొత్త అంశాన్ని ప్రస్తావిస్తూ ఈ చైనా విద్యార్థిని ఉద్దేశించి "ఈ విషయం చాలా కొత్తది! బహుశా మీకు తెలిసి ఉండకపోవచ్చు" అని రెండు మూడుసార్లు అనేసరికి ఆ చైనా విద్యార్థి "లేదండి! ఈ విషయం మాకు ముందే తెలుసు!" అన్నాడు. ఆ ప్రొఫెసర్ ఆశ్చర్యపోయి "ఇది ఎలా సాధ్యం?" అని అడిగాడు. దానికి ఆ విద్యార్థి "ఆ అంశానికి సంబంధించి అనువాద గ్రంధాలు మా భాషలో ఉన్నాయి" అని చెప్పాడు. తీరా చూస్తే ఆ విషయం లోకంలోకి వచ్చి గట్టిగా వారం కూడా కాలేదు. అంటే చైనా వాళ్ల అనువాద విషయంలో అంత వేగంతో ఉన్నారు అని అర్థమవుతుంది. శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలకు అందించడంలో చైనా డాక్టర్లు ఇంజనీర్లు ముందంజలో ఉన్నారు అనడానికి ఇదొక నిదర్శనం. ఒక కొత్త విషయం ప్రపంచంలోకి వచ్చిన కొన్ని గంటల్లోనే అది చైనా భాషలోకి అనువదింపబడటం ఆశ్చర్యకరం. ఈ విషయంలో మనం వెనకబడి ఉండటానికి కారణం దీన్ని ఒక సమస్యగా గుర్తించకపోవడం. ఇది అభివృద్ధికి దోహదం చేస్తుందన్న విషయాన్ని గమనించకపోవడం. ఏ ప్రభుత్వాలు దీన్ని గట్టిగా పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఆంగ్లంపై మోజు తగ్గేదే లేదా?

నిత్యజీవితంలో కాకుండా అనువర్తిత విషయంలో కూడా కొన్ని సమస్యలు ఉన్నాయి. ప్రదర్శన కళలు అంటే సంగీతం, సాహిత్యం, నృత్యం, నాటకం మొదలైన వాటి విషయంలో మహానగరం, పల్లెటూరు అనే తేడా లేకుండా పరిచయ వాక్యాలన్ని ఆంగ్లంలోనే కొనసాగడం గమనించాలి. కళాకారులు కవులు పాడే పాట, చెప్పే కవిత తప్పించి మిగతా అంశం అంతా ఆంగ్లంలోనే కొనసాగుతోంది.

సమాజంలో కాస్త గొప్పవారిగా పేరుపొందిన వ్యక్తులు పరస్పరం కలుసుకున్నప్పుడు, వారు వేదికల మీద మాట్లాడేటప్పుడు కచ్చితంగా ఆంగ్లంలో మాట్లాడితేనే గౌరవం అన్న భావన ప్రబలంగా ఉండిపోయింది. దాదాపు అర్ధ శతాబ్దం కిందట పానుగంటి లక్ష్మీ నరసింహారావు స్వభాష పేరుతో వెలిబుచ్చిన ఆవేదన ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో కూడా వేదిక మీద ఇచ్చే ప్రదర్శనలు, తల్లిదండ్రులతో జరిపే సంభాషణ ఆంగ్లంలోనే కొనసాగుతోంది.

నిత్య వ్యవహారంలో తిష్ట వేసిన ఆంగ్లం!

వాళ్లు వీళ్లు అనే తేడా లేకుండా మధ్యతరగతి, అల్పాదాయ వర్గాలు, సంపన్నులు.. ఇలా అన్ని రకాల కుటుంబాలలో రోజువారి వాడకంలో ఉన్న పదాలు ఆంగ్లమయం అయిపోతున్నాయి. అన్నం బదులుగా రైస్, నీళ్ల అనడానికి వాటర్, ఉప్పు అనడానికి సాల్ట్ ఇలా ఎన్నో పదాలు ఇంగ్లీష్ వే వాడుతున్నారు.

ఇలా జరుపుకుందామా?


ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఎలా జరుపుకోవాలి? కేవలం ఒక వేడుకగా జరుపుకోవాలా? ఒక నిమిషం తెలుగులో మాట్లాడటం, తెలుగు వైభవాన్ని కీర్తిస్తూ కొన్ని పద్యాలు గేయాలు ఆలపించుకోవడం.. ఇంత మాత్రమేనా? నిర్మొహమాటంగా చెప్పాలంటే ఇది ఎలా ఉందంటే పనసకాయ దొరికింది కదా అని తద్దినం పెట్టినట్టుగా ఉంది.

ఇవన్నీ చూస్తుంటే ఇటీవలే స్వర్గస్తులైన విశ్వనాథ్ 'ఓ సీత కథ' సినిమాలోని ఒక సన్నివేశం గుర్తొస్తోంది. అందులో రమాప్రభ పాత్ర అమాయకమైనది. పక్క వాళ్ళ ఇంట్లో గారెలు చేస్తుంటారు. ఎందుకంటే వాళ్ళింట్లో వారి తండ్రి తద్దినం కాబట్టి. అప్పుడు ఆ అమ్మాయి మన ఇంట్లో కూడా తద్దినం ఎప్పుడు పెట్టుకుంటామో! నాన్న ఎప్పుడు పోతారో అనుకుంటుంది. ఇప్పుడు జరిగే, జరుగుతున్న భాషా దినోత్సవాలు కూడా ఇలాగే ఉన్నాయి. వీటివల్ల ఏ ప్రయోజనం ఒనగూరదు. కనీసం ఈ ఒక్కరోజైనా మాతృభాష ఎదుర్కొంటున్న గండాలను తప్పించడానికి ఏం చేయాలి? సమస్య కళ్ళల్లోకి నేరుగా ఎలా చూడాలి అని దృక్పథాన్ని మనం అలవర్చుకోవాలని నేను కోరుకుంటున్నాను.

నిజానికి భాష ప్రాతిపదికగా ఒక రాష్ట్రాన్ని కోరుకున్న మొదటి రాష్ట్రం మనది! ఇటీవలి చరిత్రలోకి తొంగి చూసినా ఆ నిజాలన్నీ తెలుస్తాయి. కానీ మనం చరిత్రను నేర్చుకోం! చరిత్ర నుంచి నేర్చుకోం అని భీష్మించుకుని కూర్చున్న వారిని ఏం చేయగలం?

రాజు కన్నా మొండివాడు బలవంతుడు అంటారు. మన తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకు రాజు, మొండివాడు ఒకరే కావడం విశేషం! ప్రాప్తం ఉన్న తీరానికి పడవ పోతోంది.

శ్రమజీవులకై 'పిడికెడు బువ్వ కోసం' కవిత్వం



యాడవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

కవిని "శబ్దబ్రహ్మ" అంటారు. కవిత్వం అనేది ఒకరకమైన కళ. మాటల మాంత్రికత్వం మాటల మోహనత్వం. మనం మాట్లాడితే మండుటెండల్లో ముంచు పువ్వులు రాలినట్లు ఉండాలంటారు. అందుకే అర్థవంతమైన మాటల సముదాయం భాషగా చెప్పుకోవచ్చు. ఏ కవికైనా వస్తువును కవిత్వంగా మార్చడానికి ఉపయోగించే కవితా సామాగ్రి పదజాలమే. జీవితం నుంచి ఎదిగి వచ్చిన, శ్రమ విలువ తెలుసుకున్న కవి గంగాపురం శ్రీనివాస్.

తన హృదయంలో నుంచి కట్టలు తెంచుకొని వచ్చిన కవితా పంక్తులే "పిడికెడు బువ్వ కోసం". ఆరుగాలం చెమట చిందించి, పంట పండించే జీవులకు ప్రతిఫలం దక్కాలని, అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఆరాటపడుతున్న అక్షర సేద్యకుడు శ్రీనివాస్. బాధల నుంచి స్వయంగా ఎదిగిన కవి. ధైర్యంతో ఎదుర్కొనే లక్ష్యం చేరుకొని వికసించిన కవి. కనుక దీనుల హృదయాల, పరుల ఆధీనంలో ఉన్న జీవితాలకు ధైర్యం నూరి పోసి గమ్యాన్ని బోధించాడు.

కవి ఏ అంశం మీద కవితలు రాసినా తప్పనిసరిగా, ప్రత్యేకంగా ఉపమాలంకారాలతో రాయడం ఆయన ప్రత్యేకత. "పిడికెడు బువ్వ కోసం" కవితా సంపుటిలో మొత్తం 75 కవితా ఖండికలు ఉన్నాయి. ఈ కవితలు ప్రతి ఒక్కటి జీవితానికి వాస్తవంగా ఉన్నవిగా పాఠకులకు అనిపిస్తాయి. ప్రేమ, ఆప్యాయత, అనురాగం, బాధ, స్నేహం, కార్మికులు, కర్షకులు, ఆరాధన, దేశభక్తి, ఆకలి, పల్లె, పట్నం అనేక రకమైన వస్తువులతో కవిత్వీకరించడం విశేషం. తన ఆవేశాన్ని నరనరాన పారించి, అక్షరాలతో కవిత్వం రాసిన యువ కవి శ్రీనివాస్.

సమాజంలో జరుగుతున్న దృశ్యాలను గమనించి స్పందించిన విధానం బాగుంది

**"నిండిన కుండలు ఒకవైపు
మండే కడుపులు మరోవైపు
ఆహారం వృధాలు ఒకవైపు
ఆర్తనాదాలు ఒకవైపు" (ఉదయ సంధ్యలు)** అంటూ తన నిరసన తెలియ చెప్పాడు.



> యువ కవి గంగాపురం శ్రీనివాస్ రాసిన ప్రతి కవిత ఒక ఆణిముత్యంగా చెప్పవచ్చు. సామాజిక సమస్యల ఇతివృత్తంగా రాసిన ఈ కవితల సంపుటి ఆలోచించ దగ్గది.

**"నా అక్షరాలు
ఆకలి కేకలు పోగొట్టే
సైనికుల చేతిలోనీ హలాలు
సరిహద్దును కాపలా కాసే
సైనికుల తుపాకీ లో తూటాలు" (నిప్పురవ్వలు)** అని పదునైన భావాలను అక్షరాలుగా మలిచి దోపిడి మీద తిరుగుబాటు చేస్తున్నాడు.

**"భూ భ్రమణ విధానాన్ని
భూచక్రాలు చూపిస్తే
నాలా అపైకి ఎదగాలవి
చిచ్చుబుడ్డి నేర్పిస్తాయి" (దీపావళి విజ్ఞానవలి)**

ఈ కవితలో కవి విశాల ఆశావాద దృక్పథాన్ని తేట తెల్లం చేస్తుంది.

**"జీవితాంతం తోడుంటానని చెప్పి
సీమంతానికి లేకపోతివి
బారసాలకు రాలేకపోతివి
చిన్నోని ముద్దు మురిపం
చూడలేకపోతివి" (చకోర పక్షి)**

దేశాంతర ఎడబాటు ఏళ్ల తరబడి సరదాలు, సంతోషాలు, పుట్టిన, చచ్చిన పులకింత లేదు. రెండు వైపులా తీరని శోకాన్ని శ్రీనివాస్ చక్కగా చిత్రించాడు.

**"చదువుల బాలశిక్ష రానోళ్లు
విలువల పెద్ద బాలశిక్షను
ఓపిగ్గా ఒంట పట్టించుకుని
నాడిపట్టి రోగం తొక్క తీసి" (పైశాచికం)** అంటూ ఆసుపత్రిలో డాక్టర్ల పైసల పిచ్చితనాన్ని వివరించాడు.

యువ కవి గంగాపురం శ్రీనివాస్ రాసిన ప్రతి కవిత ఒక ఆణిముత్యంగా చెప్పవచ్చు. సామాజిక సమస్యల ఇతివృత్తంగా రాసిన ఈ కవితల సంపుటి ఆలోచించ దగ్గది. ఇలాంటి కవితా సంపుటాలు మరెన్నో ఆయన కలం నుంచి జాలువారాలని కోరుకుంటూ అభినందనలు తెలియజేద్దాం.

భాషా రక్షణ

ఆలోచనల అంకురం,
సృజనకు వేదికైన మాతృభాష
పరిపూర్ణ మూర్తిమత్వంతో
మిసమిసలాడే అజంతా సుందరి.

ఓ మనిషీ!
శ్వాసలో శ్వాస అయిన
సొంత భాష వైశిష్ట్యాన్ని గుర్తించక,
స్వార్థాల జోలెలు నింపుకుంటూ
కుహనా మేధస్సుకై
వెంపర్లాడే బతుకూ ఒక బతుకేనా?
ఆత్మగౌరవం లేని పయనం
విలువలేని
కాగితపు పువ్వుల హారమేగా!

స్వీయ ప్రతిభను మరచి
పరులకు దాసోహమంటూ
వారి అడుగులకు మడుగులొత్తే
మనిషి మనిషేకాడు,
జీవచ్ఛవం మాత్రమే
అట్టి వానికి మిగిలేది
చరిత్ర ఛీత్కారమేనని గుర్తెరిగి,
దేశరక్షణ ఎంత గొప్పదో
భాషా పరిరక్షణా
అంతే గొప్పదని తెలుసుకో.
అమ్మభాష
విలువల వలువలు కాపాడు.

(అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా)

- వేమూరి శ్రీనివాస్, 9912128967

నా చిన్నతనంలో మా అమ్మ, పెద్దమమ్మలు, అత్తయ్యలు పూసలతో అందమైన అల్లకాలు అల్లుతుండేవారు. రంగురంగుల పూసలు ద్వారా తోరణాలుగా, పర్సులుగా, హాండ్ బ్యాగులుగా రూపాంతరం చెంది దర్శనమిస్తుండేవి. మా అమ్మ జాకెట్లకు జాలరిలాగా పూసల వరుసల్ని వేలాడేలా కుట్టుకునేది. ఇంకా రకరకాల ఆకారాల పూసలతో దండలు కూడా అల్లేవారు. పాల పూసలు, గొట్టం పూసలు, బొట్టు పూసలు, గుండ్రని పూసలు అంటూ రకరకాల ఆకారాల్లో దొరికేవి. నేను కూడా మా అమ్మతో పాటు చాలా పూసల అల్లకాలు నేర్చుకుని అల్లాను. చిన్న చిన్న బొమ్మలు, వాకిలికి కట్టుకునే తోరణాల వంటివి, హాఫ్ కర్టెన్లు, బ్యాగులు ఇలా ఎన్నో అల్లాను. అప్పట్లో ఇంటిటికీ తిరిగి పూసలు, దువ్వెనలు, సవరాలు అంటూ అమ్ముతుండేవారు. వీరంతా సంచార జాతులకు సంబంధించిన వారే. పాల పూసలు ఎక్కువగా వీళ్ళ దగ్గరే దొరికేవి. పశువులకు కూడా లావుపాటి పూసల దండలను గంటలతో కలిపి కట్టేవారు. పూసలు మానవ జీవితాల్లో పెనవేసుకున్నటువంటివి.

- డాక్టర్ కందేపి రాణీప్రసాద్

పూసల అల్లికల డిజైన్లు

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్

పూసల నక్లెస్

ఈ మధ్య పూసల జువెల్లరీ పెట్టుకోవడం చాలా ఫ్యాషన్ అయింది. ముత్యాలు, పగడాలు, దండలుగా గుచ్చి అమ్మే పనిలో మహిళలు ఇంటి పరిశ్రమలుగా చేసుకుంటున్నారు. క్రిస్టల్స్ వంటి మెరిసే పూసలు, నాలుగు పలకల పూసలు, ఎనిమిది పలకల పూసలు అంటూ రకరకాలు దొరుకుతున్నాయి. ఈరోజు మెడకు చోకర్‌లా పెట్టుకునే చిన్న పూసల నెక్లెస్ తయారీ గురించి తెలుసుకుందాం. దీని కోసం రెండు మూడు రంగుల మెరిసే పూసలు తీసుకుంటే వాటిని డిజైన్లుగా అల్లవచ్చు. ఇతర దేశాలు వెళ్ళిన వారు అక్కడ దొరికే రంగు పూసల్ని తెచ్చుకుని బీడ్స్, గంటలు, చిన్న గొట్టాలు, పువ్వులు వంటివి బంగారపువి వేసుకుని దండలుగా అల్లించుకుంటున్నారు. ఇందులో వేల రకాల డిజైన్లు ఉన్నాయి. నేను కూడా అప్పట్లో అల్లుకున్నాను. అదే మీకు చూపించబోతున్నాను. ఈ పూసల అల్లకాలు అందరికీ వచ్చినవే, నచ్చినవే, సులభమైనవే. కాబట్టిల పెద్దగా శ్రమపడాల్సింది ఏమీ లేదు. ముందుగా గులాబీ రంగు పూసల్ని తీసుకొని రెండు పూసల కొక డైమండ్ జాలరి డిజైన్ వచ్చేలా చూసుకోవాలి. దీనికోసం సన్నని గట్టి దారం కానీ వైరు కానీ వాడవచ్చు. జాలరి వేలాడుతూ చక్కగా కనిపిస్తుంది. జాలరి కిందవైపుగా పెద్దపూసలు దానికోచిన్నపూస వేసుకుంటే చాలా అందంగా ఉంటుంది. ఒక్కసారి పాత రోజుల్లోకి వెళ్ళి పోదాం రండి.



పూసలతో పువ్వులు



పూసలతో పువ్వులు కూడా అల్లుకోవచ్చు. ఒక్కసారి ఈ కళను మొదలుపెట్టామంటే ఏమైనా సృష్టించవచ్చు. ఈ మధ్య పూసల అల్లకంతో జెఆర్‌డి టాటా లాంటి ప్రముఖుల చిత్రాలు అల్లుతున్నారని చదివాను. ఓపిక, ఉపాయం ఉండాలే గానీ ఎన్నెన్ని వెరైటీలుగానో అల్లవచ్చు. మా అమ్మ వెంకటేశ్వరస్వామి, అలివేలు మంగల చిత్రాలను అల్లింది. శ్రీకృష్ణుని లీలలు అల్లిన వాళ్ళు ఉన్నారు. నేను కూడా ప్రయోగాత్మకంగా పిల్లల స్కూలు బ్యాగును, వాచీని, రాఖీలను తయారు చేశాను. నాకు రాఖీని అల్లినవారు ఎవరూ కనిపించలేదు. ఇప్పుడు మనం గులాబీలను అల్లుదామా, లిల్లీలను అల్లుదామా ఆలోచించుకోవాలి. అల్లాల్సిన పూల రంగుకు అనుగుణంగా "పూసల్ని తెచ్చుకోవాలి. కొద్దిగా సులభంగా ఉండే ఐదు రెక్కల సాదా పువ్వుల్ని చూపిస్తున్నాను. ఎరుపు రంగు పూసలతో ఐదు రెక్కల్ని అల్లుకున్నాను. మధ్యలో కేసరాల కోసం పొడవైన తీగలాగా పెట్టాను. ఇలా పూలు తయారు చేసి ఒక కాడకు గుచ్చి ఫ్లవర్‌వేజ్‌లో పెట్టాలి. ఫ్లవర్‌వేజ్‌లాగా ఒక సీసాను తీసుకొని దానికి వల వలె పూసల అల్లకం అల్లుకుంటే మ్యాచింగ్‌గా ఉంటుంది.

అరటి గెల చేద్దాం



దీనికి ఆకుపచ్చ రంగు మామూలు చిన్న పూసలు కావాలి. ఈ ఆకుపచ్చ రంగు పూసలతో కాడను అల్లుకోవాలి. పై రెండు బొమ్మల అల్లకం వేరు. దీని అల్లకం వేరు. ఇది నాలుగు పలకలుగా రావాలి. అందువలన ముందుగా నాలుగు పూసల్ని అల్లాక పక్కనుంచి మూడు పూసలు కలిపి మరల నాలుగు పూసల అల్లకం రావాలి. అలా నాలుగువైపులా అల్లితే మధ్యలో ఖాళీగా లావుగా వస్తుంది. చివరగా నాలుగో పక్కకు వచ్చే సరికి రెండు పూసలే పడతాయి. ఇలా గెలకు కావాల్సిన కాడను తయారు చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు అరటి పళ్ళు పెట్టాలి. దీని కోసం రెయిన్ డ్రాప్ పూసలు తెచ్చుకోవాలి. ఇవి పసుపు రంగులో ఉండాలి. ఈ కాడకు ఒక్కొక్క పసుపు రంగు పూసను అతుకుతూ వైరు చుట్టుకోవాలి. అరటి గెల తయారయ్యే వరకు చివరిదాకా పూసలు అల్లాలి. మా చిన్నప్పుడు ఈ అరటిగెల ఎంత ఫేమస్ అంటే మా చుట్టాలందరి ఇళ్ళలో షోకేసులో ఉండేది. మా ఇంట్లో కూడా మా అమ్మ అల్లిన అరటి గెల ఇప్పటికీ ఉంది.

ద్వార తోరణం



పూసలు మానవ జీవితంలో చాలా మిళితమై ఉంటాయి. మన సామెతలు పొడుపు కథలు, జాతీయాలు అన్నింటిలో పూసలకో స్థానం ఉన్నది. "ఆమె ఆ విషయాన్ని పూస గుచ్చినట్టు చెప్పింది" అంటూ పెద్ద వాళ్ళు చెప్పే విషయాల్లోనూ, సాహిత్యంలోనూ ప్రధాన పాత్ర పోషిస్తుంది. పూసకు పూసకు మధ్య ఖాళీ లేకుండా క్రమ పద్ధతిలో గుచ్చినట్టుగా ఉంటాయి కాబట్టి చెప్పే విషయంలో ఎక్కడా ఏదీ మరిచి పోకుండా వరసగా చెప్పేటటువంటి విషయాన్ని 'పూస గుచ్చినట్టుగా' అంటారు. పూసలతో వాకిలికి కట్టే ద్వార తోరణం చేసుకుందాం. తోరణమే కాకుండా హాఫ్ కర్టెన్ కూడా చేసుకోవచ్చు. నేను గ్లూకోజ్ వైర్లు, పొడుగు పూసలతో హాఫ్ కర్టెన్, ఫుల్ కర్టెన్‌ను చేశాను. ద్వార తోరణానికి ముందుగా నాలుగు వేళ్ళ పట్టీ వలె సాదాగా ఏ జాలరి లేకుండా అల్లుకోవాలి. జాలరీ ఉండదుగానీ దీనిలో డిజైను చేయవచ్చు. డిజైను ఎలా చెయ్యాలనుకుంటున్నామో ఆ విధంగా వచ్చేలా వివిధ రంగుల పూసల్ని వాడాలి. కొంతమంది ఇంత వరకే కూడా వాకిలికి కట్టేసుకుంటారు. ఇంతకు ముందు గొలుసుకు చెప్పిన వల లాంటి డైమండ్ డిజైను వేసుకోవచ్చు. నా చిన్ననప్పుడు నేను బేబీల డిజైనును అల్లాను. ఇప్పుడు ఎవరూ అలాంటి డిజైను అల్లడం లేదు. అమ్మాయిలు వేలాడుతున్నట్టుగా వేశాను. ఇప్పుడు చిలకలు, ఏనుగులు వేలాడుతున్నట్టుగా అల్లవచ్చు. లేదంటే ఏ నూతన సృష్టి అయినా చెయ్యవచ్చు.

కీచైన్ చేద్దాం



హాస్పిటల్ రూములకు స్పెషల్‌గా వీటిని చేశాను. అలాగే మా పిల్లల హాస్పిటల్ కోసమని చిన్న బొమ్మ ఉయ్యాలను తయారు చేశాను. ఇలా కొత్త ప్రయోగాలు చేస్తునే ఉన్నాం. కీచైను తయారు చేయడం చాలా సులువు. నలుచదురంగా గానీ, డైమండ్ ఆకారంలో గానీ చేసుకుంటే బాగుంటుంది. మొదటగా ఆరు పూసలతో రింగు అల్లుకోవాలి. పూసల్లో ఆరు పూసల అల్లకం కూడా ఉంటుంది. ఇప్పుడు దాన్ని చెప్పడం లేదు. ఆరు పూసల రింగుకు నలుచదరపు బిళ్ళను అల్లాను. దానికి కింద నాలుగు పూసలు గుచ్చి ప్లాస్టిక్ పువ్వును పెట్టాను. ఐదు నిమిషాలలో అయిపోతుంది. ఇలా నాలుగైదు రంగులలో చేసుకుని పెట్టుకుంటే అందంగా ఉంటుంది. రబ్బరు బొమ్మలకు పూసల డ్రెస్‌లు అల్లి అందంగా తయారు చేయవచ్చు. ఇవీ పూసల అల్లకాల విశేషాలు.

కలిసి పని చేయడం ఇలా...



ఆఫీసులో భిన్న మనస్తత్వాలు, వ్యక్తిత్వాలు ఉన్నవారితో కలిసి పని చేయాల్సి ఉంటుంది. మాట పట్టింపులు, చిన్న తగాదాలు సాధారణమే. కొందరి తీరు వల్ల పనిపైనా ప్రభావం పడుతుంది. అలాంటి వారితో సాగాలంటే..

- ఇంట్లో చిన్న చిన్న తగాదాలు సాధారణమే కదా. అప్పుడేం చేస్తాం.. వీలైతే సర్దుకుపోతాం లేదంటే అలక చూపిస్తాం. ఆఫీసులో అలకంటే కష్టం. దూరంగా ఉండటమూ సాధ్యం కాదు. కాబట్టి సమస్య ఎంత పెద్దదో ఆలోచించుకోండి. వ్యక్తిగతం కాదనిపిస్తే అంతటితో వదిలేయడమే మేలు. వాదనకు దారితీసిన అంశంపై మళ్లీ మాట్లాడుకోకపోతే ఇంకా మంచిది.
- 'మాకు క్షణం పడదు' కొందరి విషయంలో ఇలా చెబుతుంటాం. మీతో వారి ప్రవర్తన, పనితీరు.. ఇలా ఏం నచ్చట్లేదో ప్రశ్నించుకోండి. పని మెరుగుదలకు ఆవిడ చేసే ప్రయత్నం ఇబ్బంది పెడుతోంటే.. కోపం పెంచుకోవాల్సిన పనీలేదు. కావాలని వంకలు పెట్టడం, ఇబ్బందికరంగా ప్రవరిస్తోంటే చర్యలు తీసుకోవచ్చు.
- మనకు పిల్లలు, ఇంటి బాధ్యతలుంటాయి. అవి ఇతరులకీ అర్థమవ్వాలనేం లేదు. దీంతో ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండాలని ఆశిస్తుంటారు. లేకపోతే విభేదాలు. వాళ్లే అర్థం చేసుకోవాలి అనుకున్నంత కాలం పరిస్థితిలో మార్పుండదు. కాబట్టి నోరు తెరవండి.
- ఎంతసేపు మన కోణంలోనే ఆలోచిస్తేనే తేడాలొచ్చేది. అవతలి వాళ్ల గురించీ ఆలోచించాలి. అందరినీ కలుపుకొంటూ వెళ్లాలి. నేను సాయపడను కానీ అందరూ నాకు సహకరించాలన్న తత్వం పనిలోనే కాదు.. పక్కవారితో బంధం ఏర్పరచడంలోనూ చేటే చేస్తుంది.
- చివరగా.. అన్నింటికీ ఫిర్యాదు చేయడం మంచిది కాదు. నిజమే.. కానీ అవతలి వాళ్లు మిమ్మల్ని టార్గెట్ చేస్తున్నా.. అధికార బలంతో ఇబ్బంది పెడుతున్నా.. అదనపు భారం వేస్తున్నా పై అధికారి లేదా హెచ్‌ఆర్‌కి ఫిర్యాదు చేయండి. అప్పుడు సర్దుకుపోవద్దు.

అందాన్ని పెంచే గులాబి



గుప్పెడు గులాబీ పూరేకలు తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. ముఖం బాగా శుభ్రం చేసుకున్న తర్వాత ఈ మిశ్రమాన్ని ప్యాక్‌లా వేసుకోవాలి. తర్వాత 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి సబ్బు ఉపయోగించకుండా నీటితో కడిగేసుకోవాలి. ఫలితంగా చర్మం మృదువుగా మారడమే కాకుండా కాంతిని సంతరించుకొని, పరిమళాన్ని వెదజల్లుతుంది. ఈ మిశ్రమానికి తాజా ఫేస్ క్రీం కొద్దిగా కలిపి ముఖానికి మాస్క్‌లా కూడా వేసుకోవచ్చు. ఫలితంగా చర్మాన్ని నిగారించేలా చేయడమే కాకుండా పెదవులు కూడా పగిలిపోకుండా సంరక్షించుకోవచ్చు.

- తాజా గులాబీ పూరేకలు కొద్దిగా తీసుకుని చిక్కగా ఉన్న పెరుగులో వేసి మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడకి ప్యాక్‌లా అప్లై చేసుకుని 15 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ ద్వారా చర్మం కొత్త మెరుపును సంతరించుకుంటుంది. అయితే ఇందుకు ఉపయోగించే గులాబీ రేకలు బాగా శుభ్రం చేసినవై ఉండాలి. అప్పుడే ఈ ప్యాక్ వల్ల సత్ఫలితాలు ఆశించవచ్చు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న కన్నుమూత



(మొదటిపేజీ తరువాయి)

పరామర్శించి ఓదార్చారు. నివాళ్లర్పించిన వారిలో మంత్రులు హరీశ్‌రావు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్ మాగంటి గోపీనాథ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ రావు ఉన్నారు. ఎమ్మెల్యే సాయన్నకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. సోమవారం కార్ఖానాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచనున్నారు. అనంతరం బన్సిలాల్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు వెల్లడించారు.

ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపు

సాయన్న 1951 మార్చి 5న సాయన్న - భూదేవి దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన బ్యాంకులో పని చేశారు. కాలేజీ దశ నుంచి సాయన్నకు ఎన్టీఆర్ అంటే ఎంతో అభిమానం. దాంతో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరి క్రియాశీలక పదవిలో పనిచేశారు. ఈ క్రమంలో అశోక్‌నగర్ నుంచి కార్పొరేటర్‌గా ఆయన పోటీ చేసి ఓటమి పాలయ్యారు, ఆ తర్వాత వరుసగా 1994, 1999, 2004 ఎన్నికల్లో ఆయన సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే 2009లో కాంగ్రెస్ అభ్యర్థి పి శంకర్‌రావు చేతిలో ఓటమి చెందారు. అనంతరం 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడగా ఆయన టీడీపీ నుంచి బరిలోకి దిగి మరోసారి గెలుపొందారు. 2015లో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలకమండలి సభ్యుడిగా నియమితులయ్యారు. తర్వాత ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరి 2019లో ఆ పార్టీ తరపున పోటీ చేసి ఐదో సారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 2019లో జరిగిన ఎన్నికల సమయంలో ప్రచారం చేస్తుండగా ఆయన కాలికి గాయాలు కావడంతో అప్పుడు షుగర్ లెవెల్ పెరగడంతో డాక్టర్లు ఓ కాలును తొలగించారు. అయినప్పటికీ సాయన్న అంగవైకల్యాలు మర్చిపోయి నియోజకవర్గ అభివృద్ధి కోసమే పాటుపడుతూ వచ్చారు. అలాగే సాయన్న హుడా డైరెక్టర్‌గా 6 సార్లు పనిచేశారు. కాగా ఆయన చిన్న కుమార్తె కవాడిగూడ కార్పొరేటర్‌గా పనిచేశారు. అయితే వచ్చే ఎన్నికల్లో కంటోన్మెంట్ టికెట్‌ను తన రెండో కుమార్తె నివేదికకు ఇవ్వాలని ఆయన సీఎం కేసీఆర్‌ను ఇటీవలే కలిసి కోరినట్టు తెలిసింది. అందుకు కేసీఆర్ నిరాకరించటంతో ఆయన తీవ్ర మనస్థాపానికి బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

ఖదీర్ చివరి వీడియోను మరణ వాంగ్మూలంగా స్వీకరించాలి



- టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్వీట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహ్మద్ ఖదీర్ చివరి వీడియో మరణ వాంగ్మూలంగా స్వీకరించాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి కోరారు. ఐదురోజులుపాటు పోలీసులు తీవ్రంగా కొట్టడంతో మరణించారని పేర్కొన్నారు. ఆదివారం ఈమేరకు ఆయన ట్వీట్ చేశారు. తప్పును కప్పిపుచ్చుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దారుణమైన సంఘటన తనను కలిచివేస్తున్నదని తెలిపారు. మహ్మద్ ఖదీర్ కుటుంబానికి రూ. 50లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సాయన్న మరణం పట్ల రేవంత్ దిగ్భ్రాంతి

కంటోన్మెంట్ శాసన సభ్యులు సాయన్న మరణం పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సాయన్న కుటుంబానికి తన సానుభూతి వ్యక్తం చేశారు.

గిరిజనేతరుల సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తులను తిరస్కరించినట్టు తెలుస్తున్నది. అలాంటి దరఖాస్తులను పున:పరిశీలించాలని వారు కోరుతున్నారు. ఇందులో గిరిజనులు, గిరిజనేతరులూ ఉన్నారు.

మూడు తరాల రుజువు సమస్య..

2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబరు 13 ముందు వరకు సాగులో ఉన్న గిరిజనులకు పత్రాలు ఇవ్వాల్సి ఉంది. గిరిజనేతరులకు కూడా ఇదే చట్టం ప్రకారం 75 ఏండ్ల నుంచి అంటే మూడు తరాల నుంచి సాగులో ఉన్నట్టు రుజువు ఉంటే హక్కు పత్రాలివ్వొచ్చని నిబంధన ఉంది. ఇదే ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే గిరిజనేతరులకు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా హక్కుపత్రాలు ఇవ్వొచ్చని వారు చెబుతున్నారు. ప్రస్తుత పరిశీలన ప్రకారం చూస్తే- గిరిజనులకే హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్టు సమాచారం. దీంతో గిరిజనేతరుల్లో ఆందోళన మొదలైంది. తరతరాలుగా ఇక్కడే బతుకుతున్నామంటూ ..ఇప్పుడు హక్కుపత్రాలు ఇవ్వబోమంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల గిరిజనేతరుల అంశం ఎటూ తేలకపోవడంతో అధికార పార్టీ నేతల్లో సైతం ఆందోళన మొదలైంది. పరిశీలనలో తిరస్కరణకు గురవుతున్న దరఖాస్తుల్లో అధికంగా గిరిజనేతరులవే ఉన్నట్టు సమాచారం. 75 ఏండ్ల రుజువు కలిగిన గిరిజనేతరులు అతి తక్కువ మంది తేలడం గమనార్హం! ఈ నిర్ధారణ కూడా శాస్త్రీయంగా లేదనే విమర్శలున్నాయి. శాటిలైట్ సర్వే గాకుండా..గ్రామ సభలద్వారా గిరిజనేతరుల్లో అర్హులను గుర్తించి, చట్ట ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని ఇప్పటికే ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో పోడు పత్రాలపై గిరిజన శాఖ తర్జనభర్జన పడుతున్నది. గిరిజనులందరికీ హక్కుపత్రాలిస్తామని సర్కారు ప్రకటించినప్పటి నుంచి గిరిజనేతరుల అంశంపై తీవ్ర చర్చ సాగుతున్నది.

సమస్యపై కేంద్రానికి లేఖ..

గిరిజనులకు పోడు హక్కు పత్రాలు ఇవ్వడంపై 2006 అటవీ హక్కు చట్టంలో స్పష్టమైన వివరాలు ఉండడంతో ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ, గిరిజనేతరులకు ఇచ్చే అంశం మాత్రం 75 ఏండ్ల రుజువుకు ముడిపడి ఉండడంతో ముందుకెళ్లలేకపోతున్నారు. పోడు భూములు, ఇతర అంశాలు మొత్తం కేంద్రం పరిధిలో ఉండటంతో 75 ఏండ్ల గుర్తింపు అంటే ఇబ్బంది అవుతోందని.. దీనిపై కొంత సడలింపు కావాలని కోరుతూ గిరిజన శాఖ కేంద్రానికి ఏడాది క్రితమే లేఖ రాసినట్టు తెలిసింది. కనీసం కటాఫ్ తేదీని 2018 వరకు పొడిగించాలని కోరినట్టు సమాచారం. అయితే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తున్నదని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జిల్లా స్థాయి కమిటీలకు దరఖాస్తులు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనుల్లో అర్హులైన వారికి పోడు హక్కు పత్రాలు అందించేందుకు ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తులు గ్రామస్థాయి నుంచి సబ్ డివిజనల్ స్థాయిలో పరిశీలన పూర్తిచేసుకుని జిల్లా కమిటీలకు చేరాయి. ఈ కమిటీల్లో మరోసారి పరిశీలన జరగనుంది. ఇక్కడ తిరస్కరించిన దరఖాస్తులను తిరిగి గ్రామస్థాయికి పంపనున్నారు. ఎందుకు తిరస్కరించారన్న వివరాలను దరఖాస్తుదారులకు తెలియజేయాల్సి ఉంది. అనంతరం వారు మళ్లీ అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.

తక్షణం హక్కు పత్రాలివ్వాలి

పోడు సాగుదారులందరికీ తక్షణమే హక్కుపత్రాలు ఇవ్వాలి. హక్కు పత్రాలు లేకపోవటంతో రైతు బంధు, బీమా తదితర సౌకర్యాలకు దూరమయ్యారు. చట్టంలో ఉన్న ప్రకారం గిరిజనేతరులకు కూడా హక్కు పత్రాలివ్వాలి. రకరకాల నియమాల పేరుతో వాటిని నిరాకరించటం సరికాదు. అటవీ హక్కుల గుర్తింపు చట్టంలో రెండు సవరణలు చేయాలని ఆరు నెల్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం..కేంద్రానికి లేఖ రాసింది. దానిపై కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయటం పోడు రైతులపై ఆ సర్కారుకున్న ప్రేమ ఏపాటిదో తెలియజేస్తున్నది. దీంతో వేలాది మంది గిరిజనేతరులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలి. లేదంటే ఉద్యమాలు తప్పవు.

ఆర్ శ్రీరాంనాయక్
ప్రధాన కార్యదర్శి తెలంగాణ గిరిజన సంఘం

టికెట్ రద్దుతో రైల్వేకు ఆదాయం

(మొదటిపేజీ తరువాయి)

మధ్య (డిసెంబర్ వరకు) ఈ-టికెట్‌లతో సహా టికెట్ల రద్దు ద్వారా రైల్వేకు మొత్తం రూ. 1949.98 కోట్లు వచ్చాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో కౌంటర్ మరియు ఈ-టికెట్ రెండింటినీ రద్దు చేయడం ద్వారా రైల్వే అత్యధికంగా రూ. 694.08 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రద్దుల ద్వారా రూ. 604.40 కోట్లను సముపార్జించింది. టికెట్ల రద్దుపై ప్రయాణీకులకు కన్వీనియెన్స్ ఫీజు వసూలు చేయడం లేదని కేంద్ర మంత్రి పార్లమెంటుకు తెలిపారు. కాలానుగుణంగా రైల్వేలు జారీ చేసే సూచనల ఆధారంగా ఐఆర్‌సీటీసీ ద్వారా రద్దు లేదా సౌకర్యవంతమైన ఛార్జీలు సేకరిస్తారు అని వివరించారు. ప్రస్తుతం భారత రైల్వే నిమిషానికి 25,000 టికెట్ల బుకింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నది. ఈ సామర్థ్యాన్ని నిమిషానికి 2.25 లక్షలకు అప్‌గ్రేడ్ చేయడం లక్ష్యమనీ, ఇందుకు సాంకేతిక మెరుగుదల చేయబడుతున్నదనీ, సాఫ్ట్‌వేర్ జోడించబడుతున్నదని రైల్వే మంత్రి ఇటీవల వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఇది 4 లక్షలకు పెంచడానికీ రైల్వే శాఖ కృషి చేస్తుందన్నారు.

విక్రయానికి ల్యాండ్‌పార్సెల్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా నగర శివారు ప్రాంతాల్లో ఉన్న ల్యాండ్ పార్సిల్స్(ప్లాట్లు)ను మార్కెట్ రేటుపై ప్రజానీకానికి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు లోబడి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) ల్యాండ్ పార్సెల్(ప్లాట్లు)ను పారదర్శకంగా ఆన్‌లైన్ పద్ధతిలో వేలం ద్వారా అమ్మకానికి పెట్టింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ ఈ వేలం ప్రక్రియను నిర్వహించనున్నది. మధ్యతరగతి ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, డెవలపర్లు ఈ ల్యాండ్ పార్సిల్స్ కొనుగోలుకు ఆసక్తి కనబస్తున్నారు.

39 ల్యాండ్ పార్సెల్స్

ప్రస్తుతం అందుబాటులో మూడు జిల్లాల పరిధిలో అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు దగ్గరలో అమ్మకానికి 39 ల్యాండ్ పార్సెల్స్ ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో పది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆరు, సంగారెడ్డి జిల్లాలో 23 ల్యాండ్ పార్సిల్స్ విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్రాంతాలను (ల్యాండ్ పార్సిల్స్) కేఎంఎల్ ఫైల్ ద్వారా చూసుకునే సదుపాయం ఉంది. అందుబాటు ధరల్లో 121 గజాల నుంచి 10,164 గజాల వరకు స్థలాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలోని గండిపేట మండలంలో మూడు, శేరిలింగంపల్లి మండలంలో ఐదు, ఇబ్రహీంపట్నం మండలంలో రెండు చోట్ల ల్యాండ్ పార్సెల్స్ ఉండగా, మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలంలో నాలుగు, ఘట్‌కేసర్ మండలంలో ఒకటి, బాచుపల్లి మండలంలో ఒకటి చొప్పున ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ మండలం పరిధిలో 16, అంసీపురం మండలంలో ఆరు, జిన్నారం మండలంలో ఒకటి చొప్పున ల్యాండ్ పార్సిల్స్ ఉన్నాయి. మార్చి 1న 39 ల్యాండ్ పార్సిల్స్‌ను ఎంఎస్‌టీసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించడానికి హెచ్‌ఎండీఏ సన్నాహాలు చేస్తున్నది. వంద శాతం ఎటువంటి చిక్కులు లేని, క్లియర్ టైటిల్ ఉన్న ఈ ల్యాండ్ పార్సెల్స్‌ను కొనుగోలు చేసిన వారు సత్వరమే భవన నిర్మాణ అనుమతులు పొందడానికి అవకాశం ఉంది. ఆన్‌లైన్ వేలంలో పాల్గొనడానికి వీలుగా ఈనెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీలో రిజిస్ట్రేషన్(నమోదు) చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్టర్ అయిన వారందరూ మరుసటి రోజు ఫిబ్రవరి 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల గడువు లోపు నిర్దేశించిన ఈఎండీ రుసుమును చెల్లించాల్సి ఉంటుందని హెచ్‌ఎండీఏ వెల్లడించింది.

రేపటి నుంచి ప్రీబిడ్ సమావేశాలు

హెచ్‌ఎండీఏ వేలం వేస్తున్న ల్యాండ్ పార్సిల్స్‌పై కొనుగోలుదారులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం నుంచి ప్రీ బిడ్ సమావేశాలు నిర్వహిస్తుంది. 21న రంగారెడ్డి జిల్లా ల్యాండ్ పార్సిల్స్‌పై శేరిలింగంపల్లి జోనల్ ఆఫీసులో, 22న సంగారెడ్డి జిల్లా ల్యాండ్ పార్సిల్స్‌పై అర్‌సీపురంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో, 23న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ల్యాండ్ పార్సిల్స్‌పై ఉప్పల్ స్టేడియం వద్ద గల సర్కిల్ ఆఫీస్‌లో ప్రీబిడ్ మీటింగ్స్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో సీరం ఇన్ స్టిట్యూట్

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరోనా సమయంలో కోవిషీల్డ్ వ్యాక్సిన్‌ను అందించి పేరుగాంచిన సీరం ఇన్‌స్టిట్యూట్ అంటువ్యాధులు, మహమ్మారులను ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పింది. నగరంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రాంగణం నుంచి ఇది సేవలందించనున్నది. సీరం ఇన్ స్టిట్యూట్ ప్రపంచంలోనే వ్యాక్సిన్ల తయారీలో అగ్రగామి. ఈ సంస్థ పోలియో, డిఫ్తీరియా, టెటానస్, పెర్టస్సిస్, హిబ్, బీసీడీ, ఆర్-హెపటైటిస్ బి, మీజిల్స్, రుబెల్లా, కోవిడ్-19 తదితర వ్యాధులకు వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తున్నది. సీరం వ్యాక్సిన్లను దాదాపు 170 దేశాలు తమ జాతీయ ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో ఉపయోగిస్తుండటం గమనార్హం. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సీరం సంస్థ సీఈవో పూనవాలాతో సమావేశమై చర్చించారు. దీని ఫలితంగా ఇప్పటికే ప్రపంచ వ్యాక్సిన్ల రాజధానిగా పేరుగాంచిన హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పూనవాలా మాట్లాడుతూ ప్రజారోగ్య విద్య, అంటువ్యాధుల పర్యవేక్షణ, స్థానిక ఆరోగ్య సంరక్షణలతో సమన్వయం, మహమ్మారితో ప్రభావితులైన కుటుంబాలకు సరైన సమాచారమివ్వడం, అంతిమంగా రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వడం లక్ష్యంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రొఫెసర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మహమ్మారులను ఎదుర్కొనేందుకు తగిన రీతిలో సిద్ధపడేందుకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

వైఎస్ షర్మిల అరెస్టు

- కేసు నమోదు చేసి హైదరాబాద్ తరలింపు



నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిలను మహబూబాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మానుకోట మండలం బేతుల్ గ్రామ శివారులో శిబిరంలో ఉన్న వైఎస్ షర్మిలను డీఎస్పీ రమణబాబు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు. వైఎస్ షర్మిల మహబూబాబాద్‌లో పర్యటించే క్రమంలో ఎమ్మెల్యే భానోత్ శంకర్ నాయక్‌కు ఆయన భార్య సీతా మహాలక్ష్మి విడాకులు ఇవ్వాలని చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. అంతేగాక ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై భూ కబ్జాకోరు.. కొజ్జా మాఫియా.. అంటూ సంచలనం వ్యాఖ్యలు చేశారు. దాంతో షర్మిల బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శంకర్ నాయక్ సతీమణి సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు షర్మిల క్యాంపు ముందు 365 జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దాంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒకానొక దశలో షర్మిల క్యాంపును ముట్టడించడానికి బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించాయి. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డు మీద కూర్చొని రాస్తారోకో చేశారు. ఇదే క్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ లూనావత్ అశోక్ షర్మిలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గిరిజన ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై షర్మిల అనుచితంగా వ్యాఖ్యలు చేశారంటూ చేసిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పొద్దున్నే పోలీసులు నోటీసు పట్టుకుని షర్మిల వద్దకు వెళ్లారు. ఆమె నోటీసులు తీసుకోవడానికి బస్సు నుంచి దిగి రావడానికి నిరాకరించి క్యాంప్ నుంచి బయటికి రాలేదు. దాంతో ఎస్ఐ దీపికా రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బలవంతంగా నోటీసు షర్మిలకు ఇచ్చి అరెస్టు చేసి హైదరాబాద్ తరలించారు.

మంత్రి సబితారెడ్డికి వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-సరూర్‌నగర్

ఆర్.కె.పురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయ చైర్మెన్ గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్ కూతురి వివాహం సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వివాహ పత్రిక అందజేసి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, ఆర్.కె.పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు తదితరులు ఉన్నారు.

అవినీతిపై ప్రశ్నిస్తే అరెస్టులా?



నవతెలంగాణ- సరూర్‌నగర్

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్రలో భాగంగా 3800 కిలో మీటర్లు పూర్తిచేసుకుంటే మహబూబాబాద్ పట్టణంలో అక్రమంగా అరెస్టు చేసి షర్మిలని హైదరాబాద్‌కు తరలించడం రాష్ట్ర ప్రభుత్వ నీతిమాలిన చర్య అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఎల్బీనగర్ నియోజక వర్గం కోఆర్డినేటర్ మామిడి రామచందర్ అన్నారు. ఏర్పాటుచేసిన సమావేశంలో మామిడి రామచంద్ర మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం తిరుగుతూ అవినీతిపైన ప్రశ్నిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజాప్రస్థానం పాదయాత్ర కొనసాగిస్తున్న వైఎస్ షర్మిల అరెస్టు అప్రజా స్వామికం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొడ శ్రావణ్, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి కోట్ల వాసుదేవ్, జితేందర్, మల్లేష్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో యువత కదలాలి

- రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి
- ప్రొఫెసర్ నాగేశ్వర్

నవతెలంగాణ-ముషీరాబాద్



దేశంలో భగత్ సింగ్ స్ఫూర్తితో యువత కదలాలని డీవైఎఫ్ఐ మాజీ నాయకులు, ప్రొఫెసర్ నాగేశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో తాజా, మాజీ డివైఎఫ్ఐ నాయకుల ఆత్మీయ సమావేశాన్ని నగర కార్యదర్శి ఎండీ జావేద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన మాట్లాడే స్వేచ్ఛని ప్రశ్నించే తత్వాన్ని ఈరోజు పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారని, సుప్రీంకోర్టును సైతం ప్రశ్నిస్తున్న పరిస్థితి మనం చూస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించడానికి కూడా జీర్ణించుకోలేకుండా తట్టుకోలేకుండా ఉన్న పరిస్థితిని మనం గమనిస్తామని, ఇలాంటి పరిస్థితులలో యువత భగత్ సింగ్ ఇచ్చిన విలువలను, పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకుపోయేలా ప్రయత్నించాల్సిన అవసరాన్ని నేటి యువతకు అందించాల్సిన అవసరాన్ని ఉందని వివరించారు. భగత్‌సింగ్ ఎందుకోసమైతే త్యాగం చేశారో ఆ త్యాగం విలువలు ఆ త్యాగపు వారసత్వం నేడు కనుమరుగు చేయాలని కొంతమంది పాలకులు కుట్రలు పన్నుతున్న పరిస్థితి చూస్తున్నామన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ పోరాటం చేశాడని, ఆ మతోన్మాదాన్ని ఇప్పుడు ఈ దేశం మీద రుద్దాలని పాలకులు ప్రయత్నిస్తున్న పరిస్థితి చూస్తున్నామని చెప్పారు. కాబట్టి వీటిని ఎదిరించే చైతన్యాన్ని నేటి యువతకు అందించే కర్తవ్యాన్ని డీవైఎఫ్ఐ యువత బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే డ్రగ్స్ వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. భగత్ సింగ్ వర్ధంతిని పెద్ద ఎత్తున హైదరాబాద్‌లో నిర్వహించాలని, అందులో ప్రతి ఒక్క యువకుడు, విద్యార్థి పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ నగర మాజీ నాయకులు పార్థసారథి అంజయ్య, జెకె శ్రీనివాస్, హరి, శ్రీనివాస, శ్రీనివాసరావు, ఎం.మారన్న, విజయ్ కుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి అనగంటి వెంకటేష్, డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్, జావేద్ శతి మేడ్చల్ నాయకులు కిరణ్, నాగలక్ష్మి సుచిత్ర పాల్గొన్నారు

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - మీర్‌పేట్



మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సందే చెరువు కట్టపై ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ జీవితాలను పణంగా పెట్టి ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని అన్నారు. అనంతరం మీర్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మన ఊరు - మనబడి జరుగుతున్న పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ కాలనీలవాసులు పాల్గొన్నారు.

జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని శ్రీరాం కాలనీ 18,19 వార్డు కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్‌లు అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సహకారంతో రూ.1కోటి 30లక్షల హెచ్ఎండిఏ నిధులతో ముత్యాలమ్మ గుడి దగ్గర నుంచి జంక్షన్ వరకు, జంక్షన్ నుంచి టీయూఎఫ్ఐడీసీ నిధులతో కెనరా బ్యాంక్ వరకు రూ.60లక్షల హెచ్ఎండిఏ నిధులతో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. సీసీ, బీటీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక శ్రద్ధతో మున్సిపాలిటీకి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే కార్గో రోడ్డుకు శ్రీరామ్ కాలనీకి రాకపోకలకు సులభమవుతుందని, ఎన్నో ఏళ్ల ప్రజల కల నెరవేరబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలి



ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ చింతపంటి ప్రవీణ్

నవతెలంగాణ - సరూర్‌నగర్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు లాంటి అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ చింతపంటి ప్రవీణ్, సైంటిస్ట్ డాక్టర్ శ్రీధర్‌లు అన్నారు. భాష్యం లిటిల్ చాంప్స్ 10వ వార్షికోత్సవ వేడుకలు పల్లవి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా వారితో పాటు భాష్యం విద్యాసంస్థల సీఈవో చైతన్య, జెడిఓ అంకమ్మరావులు హాజరై కార్యక్రమంలో జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ప్రణాళికలు తీర్చిదిద్దే విధంగా భాష్యం విద్యా సంస్థలు చూపే కృషి , శ్రద్ధ ప్రశంసనీయంగా ఉన్నాయని అన్నారు. విద్యార్థులకు పాఠశాల దశ ఎంతో కీలకమని, ఈ దశలోనే భవిష్యత్తు కావలసిన పునాదులు వేసుకోవాలి అని అన్నారు. ఈ వేడుకల్లో లిటిల్ చాంప్స్ విద్యార్థులు వివిధ వేషధారణలో ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రిన్సిపాల్ పల్లవి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ భానుమతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా ధూమ్ దాం



నవతెలంగాణ-హయత్‌నగర్

మహా శివరాత్రిని పురస్కరించుకొని జాగారం సందర్భంగా హయత్‌నగర్ డివిజన్ తెలంగాణ ఉద్యమకారుడు బీఎస్‌పి నాయకులు జెనిగె విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో శివాలయం వద్ద 13వ వార్షికోత్సవం బహుజన ధూమ్ ధామ్ ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హయత్‌నగర్ డివిజన్ ప్రజలు బహుజన కళాబృందం అశోక్‌తో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బీఎస్పీ నాయకురాలు రంగారెడ్డి జిల్లా కన్వీనర్ కంబాలపల్లి శాంత, బోడనర్సింహ, కాటపాక శివకుమార్, గుడ్డేటి లింగస్వామి, దుబ్బాక నవీన్, కొంగరి విజయ్, చాగంటి మనోహర్, తిరుమలేష్, చుంచు కుమార్, వివిధ పార్టీ నాయకులు బహుజన ధూంధాన్ని విజయవంతం చేశారు.

భక్తి శ్రద్ధలతో ...

నవతెలంగాణ-సంతోష్‌నగర్

భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే మహాశివరాత్రి ముఖ్యమైంది. ప్రతి యేట మాఘ బహుళ చతుర్దశిని శివరాత్రిగా కంటా శివుడికి ఎంతో ప్రీతికరమైన బిల్వపత్రాలతో అభిషేకం చేస్తే అనుగ్రహం లభిస్తుందని, శివరాత్రి రోజున ఉపవాసం ఉండి, జాగరణ చేస్తే పాపాలన్నీ నశిస్తాయని, శివరాత్రి పర్వదినాన్ని భక్తుల నమ్మకం. యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ నగర శివాలయంలో జరిగిన ప్రత్యేక ఆలయ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సెక్రెటరీ మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, వైస్ చైర్మెన్ కుంటికూర చంద్రశేఖర్ రెడ్డి, రాజేష్, రాజేశ్వరరావు, భాస్కర్, అనిల్ పాల్గొని శివుడు అభిషేకం చేశారు. అధ్యక్షులు పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ భక్తులందరూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించాలని పేర్కొన్నారు.



నియంత పాలనకు చరమగీతం పాడుదాం

ఎల్మేటి అమరేందర్ రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వెంకటాపూర్, జల్‌పల్లి మున్సిపల్‌లోని కొత్తపేట్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఆదివారం వైఏఆర్ గార్డెన్‌లో టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో సుమారు వందమంది వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు, మహిళలు చేరారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు మహేందర్, పాండు నాయక్, విజయ్, శ్రీశైలం యాదవ్, దేవరాజ్, వెంకటేష్, కృష్ణ, యాదగిరి, రాజు, వినయ్, భారతమ్మ, అంజమ్మ, శశికళ, మంజుల, లక్ష్మి,తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు అహ్మద్ బామ్, వంగేటి మధుసూధన్ రెడ్డి, ఉమేష్, కిరణ్, ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

లార్డ్స్ స్కూల్స్ చైర్మెన్ సిద్దాల బీరప్ప

నవతెలంగాణ-తుర్కయంజాల్



విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని లార్డ్స్ స్కూల్స్ చైర్మెన్ సిద్దాల వీరప్ప వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం తుర్కయంజాల్ లార్డ్స్ పాఠశాలలో ఆయత్ స్మార్ట్ లెర్నింగ్ ఆధ్వర్యంలో చేతిరాత పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రోఫీలతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి శ్రద్ధగా చదువుతూ అనుకున్న లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు లార్డ్స్ విద్యాసంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయని తెలిపారు. అనంతరం లార్డ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు చేతిరాత పోటీలను నిర్వహించినట్లు చెప్పారు.

ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ సంత్ సేవాలాల్ జీవితం ఆదర్శం

మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



గిరిజన జాతి పితామహులు శ్రీశ్రీ సంత్ సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శమని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ తిరుమలనగర్‌లో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సేవాలాల్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, 26వ డివిజన్ కార్పొరేటర్ రాముడి కవిత రాంరెడ్డి, 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రామిరెడ్డి, నాయకులు భరత్ నాయక్, జయరాం నాయక్, స్వామీజీ ఎస్సీ నరసింహ నాయక్, లాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కృషి

టూరిజం చైర్మెన్ ఉప్పల శ్రీనివాసగుప్త

నవతెలంగాణ-నాగోల్



తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేవాలయాలు అత్యద్భుతంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ మరియు ఐవిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సరూర్నగర్ ఇండోర్ స్టేడియం కోకో గ్రౌండ్లో ప్రజాపిత బ్రహ్మకుమారి ఐశ్వర్య విశ్వవిద్యాలయం దిల్‌సుఖ్‌నగర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమరనాథుని మంచు లింగ దివ్యదర్శనం ఆదివారం ఆయన సందర్శించి దర్శించుకున్నారు. అదేవిధంగా లేజర్ షో యోగాను భూతి, సైన్స్ మరియు ఆధ్యాత్మిక స్టాలుతో పాటు తదితర కార్యక్రమాలలో పాల్గొని తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాతే తెలంగాణ ప్రాంతంలోని దేవాలయాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయని అన్నారు. దీంతో దేవాలయాల్లో పనిచేసే బ్రాహ్మణలకు పూజారులకు అపూర్వమైన గౌరవం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని పేద బ్రాహ్మలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యతను కలిగిస్తూ ఆదుకుంటుందని పేర్కొన్నారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శన కార్యక్రమం అద్భుతమని నేటి తరానికి ఎంతో ఉపయోగపడే విధంగా నిర్వాహకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారని ఆయన ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విట్టల్ రెడ్డి, బీ.ఆర్.ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడేండ్లలో గణనీయమైన అభివృద్ధి



చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య

నవతెలంగాణ-తుర్కయాంజల్

గడిచిన మూడేండ్లలో తుర్కయాంజల్ సహకార బ్యాంక్ గణనీయమైన అభివృద్ధి సాధించిందని డీసీసీబీ వైస్ చైర్మెన్, తుర్కయాంజల్ బ్యాంక్ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఆదివారం బ్యాంక్‌లో తమ బాడీ ఎన్నికై మూడేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ళ కాలంలో దాదాపు పదకొండు కోట్లు అభివృద్ధి సాధించిందని తెలిపారు. బ్యాంకు నుండి 18 స్కూల్స్‌కు ఎల్ఈడీ టీవీ లను,రైతులకు600స్ప్రేయర్‌లను, 10 పవర్ వీడర్లను, 2 చాప్ కట్టర్‌లను, 802 టార్పాలిన్లను, వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రాంరెడ్డి, డైరెక్టర్లు చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతాడి నర్సింగరావు, వంగేటి లక్ష్మారెడ్డి, చాపల యాదగిరి, కొండ్రు స్వప్న, బ్యాంక్ మేనేజర్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడలోని సీవైఆర్ కాలనీ అధ్యక్షులు డి.కృష్ణారెడ్డి, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, దేవాలయ కమిటీ కోశాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా శివాలయంలో వివిధ కాలనీల నుండి భక్తులు దేవాలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఆవరణమంతా శివనామస్మరణతో మారుమోగింది.



- నవతెలంగాణ,బడంగ్‌పేట్

ధీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్











నవతెలంగాణ-హయత్‌నగర్

ఛత్రపతి శివాజీ మహారాజ్ 393వ జయంతి సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో జడ్జెస్ కాలనీ ఫేస్-1లో ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు ఆదివారం పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధైర్యానికి, దేశభక్తికి, ధీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ భరతమాతకు ముద్దుబిడ్డని, ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశభక్తితో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ చైర్మెన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, మాజీ డివిజన్ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీశ్ యాదవ్, వేములయ్య గౌడ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, రమేష్, విజయ్ భాస్కర్‌రెడ్డి, మార్గం రాజేష్, జగదీశ్, రాకేశ్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కార్యకర్తలు, ఛత్రపతి శివాజీ మహారాజ్ అభిమానులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

నాగోల్ : మొగల్ సామ్రాజ్య పతనాన్ని శాసించి హిందూ సామ్రాజ్యాన్ని నిర్మించిన భరతమాత వీరపుత్రుడు ఛత్రపతి శివాజీ అని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం ఛత్రపతి శివాజీ 393వ జయంతిని పురస్కరించుకొని నాగోల్ డివిజన్లో నిర్వహించిన బైక్ ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతల సురేందర్‌నాథ్ యాదవ్ ,రాఘవచారి, రాజులతోపాటు పలువురు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ : ఛత్రపతి శివాజీని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ శ్రేణులు, యువజన సంఘ నాయకులు ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సభ్యులు, యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నీతి నిజాయితీతో ప్రజా రంజకంగా పాలన చేసి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజు బీఆర్ఎస్ యాకత్పురా నియోజకవర్గం ఇన్‌ఛార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. ఉప్పుగూడ గౌలిపురా, అంబికా నగర్ కాలనీ, డివిజన్ పరిధిలోని వద్ద నిర్వహించిన నాయకులు కార్యకర్తలతో కలిసి శివాజీ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీరామ్ కోటయ్య డివిజన్ అధ్యక్షులు సీఎం ప్రవీణ్ రాజు పార్టీ శ్రేణులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజల్ : తుర్కయాంజల్ గ్రామంలో శివాజీ జయంతి వేడుకలు మున్సిపాలిటీ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి మారగోని విశాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కయాంజల్ గ్రామంలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు బచ్చిగళ్ల రమేష్‌లు హాజరై మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మొగలాయి సామ్రాజ్యాన్ని కూకటివేళ్ళతో నేలమట్టం చేసిన మహావీరుడు బలశాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కన్వీనర్ ఎన్ను యాదగిరి రెడ్డి, శ్రవణ్ కుమార్, కదారి అనిల్ కుమార్, బాలకృష్ణ గౌడ్, విశ్వంత్ గౌడ్, ఖానాపురం లక్ష్మణ్, మల్లెల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తారకరత్న మృతికి తెలుగు యువత సంతాపం



నవతెలంగాణ-జవహర్‌నగర్

నటుడు, రాజకీయ నాయకుడు నందమూరి తారకరత్న మృతిపట్ల జవహర్ నగర్ తెలుగు యువత మేడ్చల్ జిల్లా నాయకుడు రెపన లక్ష్మణ్ ఆధ్వర్యంలో చెన్నపురం లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ జవహర్ నగర్ సీనియర్ నాయకులు చెన్నపురం యాదయ్య.లింగాల సూరిబాబు, యూత్ నాయకులు గౌస్, చెంద్ర శేఖర్, కలియ భాస్కర్ గౌడ్, రాజు, సాయి జాంబయ్య తదితరులు ఉన్నారు.

మతసామరస్యతకు ప్రతీక ఛత్రపతి శివాజీ పాలన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

చత్రపతి శివాజీ మహారాజ్ పాలన మతసామరస్యతకు ప్రతీక అని టీజేఎస్ మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.దయాకర్ అన్నారు. ఆదివారం టీజేఎస్ మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో అన్ని వర్గాల ప్రజలను, మతాలను తన రాజ్యంలో భాగస్వామ్యం చేస్తూ తన పరిపాలన సుభిక్షంగా నిర్వహించడం జరిగిందన్నారు. నాయకులు ప్రభునాథ్, విష్ణుమూర్తి, పవన్ కుమార్, వాసు, భరత్, నరేష్, విశాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలనూ సమానంగా చూసిన ఛత్రపతి శివాజీ

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- బన్సీలాల్‌పేటలో శివాజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-బేగంపేట్

చత్రపతి శివాజీ లౌకిక పాలకుడని, అన్ని మతాలకు అనుకూలంగా ఉండి, అన్ని మతాల ప్రజలను సమాన గౌరవం కల్పించారని అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. భారత జాతి సగర్వంగా చెప్పుకునే ధీరుడు, యావత్ భారతం వీరత్వానికి ప్రతీకగా కొలుచుకునే వీరుడు చత్రపతి శివాజీ అన్నారు. ఆదివారం బన్సీలాల్ పేట డివిజన్ బోయిగూడ కమాన్ వద్ద నిర్వహించిన శివాజీ 396వ జయంతి వేడుకలలో వారు పాల్గొని శివాజీకి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరాఠా రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ జయంతిని దేశంలో నేడు ఎంతో ఘనంగా నిర్వహిస్తారని చెప్పారు. మాస్టర్ స్ట్రాటజిస్ట్‌గా పేరుగాంచిన ఛత్రపతి శివాజీ మొఘలులపై అనేక యుద్ధాలు చేసి మరాఠా సామ్రాజ్యాన్ని నిర్మించాడని తెలిపారు. సుదీర్ఘకాలం లెక్కలేనన్ని యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదన్నారు. యుద్ధంలో ఓడిపోయినా శత్రువుల రాజ్యంలో ఉన్న యుద్ధం చేయలేనివారికి, స్త్రీలకు, పసివారికి సహాయం చేసిన గొప్ప నాయకుడు అని పేర్కొన్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవచేయడం, తాను చేస్తున్న పనిపట్ల అంకితభావం, మచ్చలేని వ్యక్తిత్వం ఆయన అనుచరులకు, ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. శివాజీ భవానిదేవి భక్తుడని, ఆయన తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా చూసేవాడన్నారు. కేవలం గుళ్ల మాత్రమే కాకుండా ఎన్నో మసీదులు కట్టించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాజు, నిర్వహకులు కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానమాలలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ పరిధి జమ్మిగడ్డలో అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ చిత్రపటానికి, జమ్మిగడ్డ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బి.జె.ఆర్ కాలనీ అధ్యక్షులు ఎస్.ఏ రహీం సభ్యులందరితో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను చేయించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్ఫూర్తి గ్రూప్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ మనువాదం మనుస్మతి పేరుతో బడుగు బలహీన వర్గాలను అణిచివేయాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని తీసేస్తూ మనువాదాన్ని ముందుకు తీసుకువచ్చే ప్రయత్నాన్ని తిప్పికొడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని పేర్కొంటూ ప్రతీ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయమని తెలియజేశారు.కార్యక్రమంలో స్ఫూర్తి గ్రూప్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సభ్యులు శ్రీమన్నారాయణ, వెంకట్, ఉద్యమకారుడు వెంకటేష్, న్యూ విరాట్ నగర్ కాలనీ అధ్యక్షులు సుధీర్, జమ్మిగడ్డ వాసులు దయానంద్, నాగేష్, వినయ్, ఆనందరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బంజారా భాషను 8వ షెడ్యూల్లో చేర్చాలి



- బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహాన్
- ఢిల్లీలో సేవలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

బంజారా భాషను 8వ షెడ్యూల్లో చేర్చి.. లిపి కల్పించి అధికార భాషగా గుర్తించాలని బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహాన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఢిల్లీ యూనివర్సిటీలో ఢిల్లీలోని బంజారా స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఐఏఎస్ అధికారి జయరాజ్ నాయక్, ఎస్పీ సింగ్ లబాన్, డాక్టర్ వెంకటేష్ చౌహాన్, అశోక్ రాథోడ్, లక్కపతి నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఢిల్లీలో జరగడం సంతోషంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం స్పందించి సెలవు దినంగా ప్రకటించాలన్నారు. అంతేకాకుండా దేశంలో ఉన్న బంజారాలను ఒకే జాబితాలో చేర్చాలని ఆయన కోరారు. ఆ రోజుల్లోనే సేవాలాల్ మహారాజ్ పోరాటం చేశారని గుర్తు చేస్తూ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాజ్యాంగం ఇచ్చిన హక్కుల కోసం బంజారాలు కలిసికట్టుగా ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో శశినాయక్, బాలు నాయక్, విద్యార్థి ప్రతినిధులు ధనుష్, తరుణ్, సతీష్, సంజయ్, దీపిక, శిరీష, నరేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

నవతెలంగాణ-బేగంపేట్

శివాజీ జయంతి వేడుకలు ఆదివారం జనరల్ బజార్‌లో ఘనంగా జరిగాయి. తెలంగాణ గోల్డ్ అండ్ సిల్వర్ రిఫైనరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో మహారాష్ట్రకు చెందిన బ్యాండ్‌తో అసోసియేషన్ సభ్యులు, మహారాష్ట్రీయులు జై శివాజీ.... జై జై శివాజీ అంటూ ఊరేగింపుగా మహంకాళి వీధి సుభాష్ రోడ్ బాట పార్ట్ మార్కెట్ మీదుగా మార్కెట్ స్ట్రీట్ లోని శివాజీ విగ్రహం వరకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఏడేండ్ల చిన్నారి మైథిలి శివాజీ మహారాజ్ గురించి చేసిన ప్రసంగం అందరిని ఉత్తేజితులను చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సికింద్రాబాద్ ప్రాంతా అధ్యక్షులు ఆనంద్ పాటీల్ మాట్లాడుతూ.. చత్రపతి శివాజీగా ఖ్యాతి పొందిన శివాజీ రాజే భోంస్లే పశ్చిమ భారతదేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించాడన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఆకుల ప్రతాప్, మహంకాళి ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాసులు, తెలంగాణ శాఖ అధ్యక్షులు ప్రకాష్ పాటిల్, అసోసియేషన్ కార్యదర్శి సురేష్ బూస్లే, సభ్యులు ప్రవీణ్, విశాల్, నరేష్, అజిత్, అసోసియేషన్ సలహాదారులు జగదీష్ ప్రసాద్ వర్మ, మానేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ బస్టాండ్‌ను సందర్శించిన రీజినల్ మేనేజర్



నవతెలంగాణ-కాప్రా

కీసరగుట్ట జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీఎస్ఆర్టిసి ఈసీఐఎల్ బస్టాండ్ లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న ఈసీఐఎల్ బస్టాండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తులకు కీసరగుట్ట బ్రహ్మోత్సవాల ముగింపు వరకు 24 గంటలు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సొంత వాహనాలపై వెళ్లేవారికి రెండు కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ ఉన్నందువలన నడుచుకుంటూ వెళ్లడానికి ఇబ్బంది ఉంటుందని అదే ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే శ్రీ రామలింగేశ్వర మందిర సమీపంలోనే బస్టాప్ వరకు చేరుకోవచ్చునని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి బస్సు పాసులు చెల్లుబాటు కావని చెప్పారు. సికింద్రాబాద్ డీవీఎం అపర్ణకళ్యాణి, కుషాయిగూడ డిపో మేనేజర్ పి చంద్రకాంత్, కుషాయిగూడ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీపతి కృష్ణ, రాణిగంజ్ డిపో అసిస్టెంట్ మేనేజర్ సరిత, టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మరాఠీ సామ్రాజ్యాన్ని నెలకొల్పిన వీరుడు ఛత్రపతి శివాజీ



నవతెలంగాణ-నాచారం

చత్రపతి శివాజీ జయంతి వేడుకలు నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సాయిజెన్ శేఖర్, ధర్మ రక్షణ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆవుల అభిషేక్ పాల్గొని శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ యుద్ధ తంత్రాలలో అపారమైన అనుభవం కలవాడన్నారు. సకల విద్యలు తెలుసుకున్న శివాజీ మరాఠీ సామ్రాజ్య స్థాపన లక్ష్యంగా తన వ్యూహాలను మొదలుపెట్టి మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాచారం డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, నాయకులు అంజి, విఠల్ యాదవ్, సత్యనారాయణ, శంకర్, మహేష్, రాజు, శివ, అనిల్, నరేష్, నరసింగరాజు, కృష్ణ, విష్ణు, అర్జున్, శ్రావణ్, భరత్ పాల్గొన్నారు.

ఓయూ ఎస్సీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-ఓయూ

సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ వేడుకల్లో భాగంగా ఓయూ ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రో.మంగు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సీ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ,సైన్స్ కళాశాల, లా కళాశాల , ఇంజనీరింగ్ కళాశాల, ఎంబీఏ, కామర్స్ కళాశాల, సికింద్రాబాద్ పీజీ కళాశాల, నిజాం కాలేజీ, సైన్స్ కాలేజీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ డాక్టర్ రవి భూక్యా, రమేష్, భాస్కర్, రిసర్చ్ స్కాలర్స్ శ్రీను, రమేష్, శరత్, చందర్ ,విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



షిరిడి నగర్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-కాప్రా

కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి సమస్యల రహిత కాలనీగా తీర్చిదిద్దుతానని ఎల్లారెడ్డి గూడా షిరిడీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు రిజ్వాన్ ఖాన్ తెలిపారు. కాప్రా డివిజన్ ఎల్లారెడ్డి గూడ షిరిడీ నగర్ కాలనీలో నిర్వహించిన ఎన్నికల్లో రిజ్వాన్ ఖాన్ ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం ఏర్పరచుకొని కాలనీవాసుల సహకారంతో ఎప్పటికప్పుడు పరిష్కరించే క్రమంలో కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా కాలనీలో ప్రభుత్వ ఖాళీ స్థలాలు కబ్జాలకు గురికాకుండా, ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని కమిటీ నిర్మానించింది. నూతన అధ్యక్షులుగా రిజ్వాన్ ఖాన్, ఉపాధ్యక్షులుగా మాజీ సైనిక ఉద్యోగి గోవింద్, ప్రధాన కార్యదర్శిలుగా సత్తయ్య, విజయలక్ష్మి, కోశాధికారిగా శ్రీధర్, జాయింట్ సెక్రెటరీలుగా వెంకట్రాంరెడ్డి, కుశాల్, కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, వేణుగోపాల్ మోతిలాల్ ,రాములు యాదవ్,మౌలాలి ,సోమయ్యలు ఎన్నిక కాగా అనంతరం కాలనీలో గల సాయిబాబా మందిరంలో నూతన కమిటీ సమావేశంలో చెన్నారెడ్డి, సత్తిరెడ్డి,స్వామి గౌడ్, బోడ బిక్షం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ వీరుడు ఛత్రపతి శివాజీ



నవతెలంగాణ-జవహర్ నగర్

యుద్ధ వీరుడు ఛత్రపతి శివాజీ అని శ్రీకాంత్ యాదవ్ అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లో ఛత్రపతి శివాజీ సైన్యం ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ దేశాన్ని శత్రుదేశాల నుంచి రక్షించేందుకు శివాజీ తన 16వ ఏటనే కత్తి పట్టారని తెలిపారు. వీరత్వానికి ప్రతీకగా చెప్పుకునే, ఛత్రపతి శివాజీని యువత స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేటర్లు, శివాజీ సైన్యం నాయకులు శ్రీకాంత్, కార్తీక్, వినయ్, శంకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రా : మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో శివాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఘటికే సూరజ్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, పన్నల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మహనీయులను స్మరించుకుందాం : మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ- బంజారాహిల్స్

మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత అని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గాంధీపుర బస్తీలో శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను బీజేపీహైదరాబాద్ సెంట్రల్ జిల్లా సెక్రటరీ ఫణి కుమార్ సాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధులు శ్రవణ్ యాదవ్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు బంగారం చంద్రశేఖర్,సెక్రటరీ రాఘవరెడ్డి, కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి చర్లపల్లి విజయ్, సెక్రెటరీ సత్యం, యువమోర్చా అధ్యక్షులు మోహన్ దీప, ప్రధాన కార్యదర్శి సాయి నాయక్,మహిళా మోర్చా జిల్లా సెక్రెటరీ పూర్ణ,డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు వర్షమహిళా మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ స్వాతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-నాచారం

నాచారం చౌరస్తాలోని శ్రీ రాజరాజేశ్వరి సహిత శివాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు మల్లికార్జున గౌడ్, పసియుద్దీన్, నవీన్ రెడ్డి, ప్రభాకర్, గ్యార కిరణ్, సాయి, సురేందర్ రెడ్డి, శ్రావణ్ కుమార్, పవన్, నితీష్,

పూజల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత




నవతెలంగాణ-ఓయూ

లాలాపేట్ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో శ్రీ శ్రీ అఖండలమని పూజ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మధ్య శాస్త్రోత్తంగా రుద్రమహా యజ్ఞం, మత్యుంజయ యజ్ఞానికి ముఖ్యఅతిథిగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తార్నాకలోని హనుమాన్ నగర్ లోని శ్రీ శివాంజనేయ దేవస్థానంలో మహాలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ మహా యజ్ఞానికి కమిటీ నిర్వాహకులు వెంకటేష్ గౌడ్, అమర్ కుమార్, ప్రవీణ్ కుమార్, అజయ్ నాయక్, రమేష్, పవిత్ర దాస్, సోమనాథ్, హనుమాన్ నగర్ శ్రీ శివాంజనేయ దేవస్థానం కమిటీ సభ్యులు అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్ గౌడ్, కమిటీ సభ్యులు శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట :మహాశివరాత్రిని పురస్కరించుకొని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ డివిజన్‌లోని పటేల్ నగర్,ప్రేమ్ నగర్,నరేంద్ర నగర్,బాపు నగర్ శివాలయాలల్లో అంబర్ పేట మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోషామహల్ నియోజకవర్గం రహీంపురలో పురాతనమైన శివాలయంలో కూడా పూజలు నిర్వహించి, లింగానికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు, ఆలయ నిర్వాహకులు రాజేశ్వర్, పండరి నరసింహ, శ్రీను,రాగుల ప్రవీణ్,పడకండి



బ్రహ్మచారి, వేణు, వెంకటేష్ గౌడ్, రాము,నవీన్ గౌడ్,మహంకాళి అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, అంబర్ పేట డివిజన్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, సంతోష్ చారి,వినయ్ తదితరులు పాల్గొన్నారు.



బేగంపేట : మహాశివరాత్రి పురస్కరించుకొని గోషామహల్ నియోజకవర్గం లోని పలు దేవాలయాలలో బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు నందకిషోర్ వ్యాస్ బిలాల్ పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.వి మహేందర్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింఘ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆనంద్ గౌడ్, శైలేష్ కుమార్, రవీందర్ రెడ్డి, ప్రియా గుప్తా, పప్పు శశిరాజ్, శివాలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు



ఆలయాన్ని సందర్శించిన కార్పొరేటర్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్ మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి కీసర రామ లింగేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె భక్తులందరికి మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినా న్ని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహా శివరాత్రి రోజున స్వామి వారి ఉపవాస దీక్ష లో ప్రజలు అందరూ భక్తితో స్వామిని కొలిస్తే మీ కోరికలు నెరవేర తాయన్నారు.ప్రజలం దరూ ఆయురారోగ్యాలు, అష్టశ్వ ర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడుని కోరుకున్నట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి,నాయకులు చెన్నారెడ్డి, శ్రీనివాస్, ఉత్తమ్, రోహిత్, లోహిత్, దినేష్, శివ తదితరులు పాల్గొన్నారు



వినాయక్‌నగర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు అజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవి యాదవ్ పాల్గొని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

నవతెలంగాణ- నేరేడ్‌మెట్

రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట మున్సిపల్ కాలనీలోని శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో శివ రాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివ పార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఛైర్మెన్ రంగు వెంకటేశ్ గౌడ్ ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. దేవస్థాన కమిటీ ఛైర్మెన్ రంగు వెంకటేష్ గౌడ్ తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు రంగు సతీష్, రామి రెడ్డి, నరేందర్, సూరజ్, కష్ణకాంత్,అన్వేష్,భాస్కర్ రెడ్డి, నాగరాజ్ ,శశిమోహన్, గట్టు భాస్కర్,గట్టురమేష్, వెంకట య్య, సాయిరాం,జింక రాము,జింకా శ్రీనివాస్, సురేష్, నాగ కిరణ్ పలువురు పాల్గొన్నారు.

నందమూరి తారకరత్న మృతి చెందగా ఆయన భౌతికకాయాన్ని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు సాయిబాబా, తదితరులు సందర్శించి నివాళ్లర్పించారు. తారకరత్న కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-సాయిబాబా



చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి హెూంగార్డు మృతి



నవతెలంగాణ-బంజారాహిల్స్

అనారోగ్యంతో బాధపడుతున్న హెూంగార్డు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కన్నుమూశారు. వివరాల్లోకెళ్తే.. హెూమ్ గార్డు దీపక్ సింగ్ గత కొన్ని సంవత్సరాలుగా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో సేవలందిస్తున్నారు. ఈనెల 7న ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తరలించగా శనివారం తుదిశ్వాస విడిచారు.ఆయన చికిత్స కోసం బంజారాహిల్స్ పోలీసులు సిబ్బంది రూ.2 లక్షల వరకు నిధులు సమీకరించి సహకారాన్ని అందించారు. అయితే చికిత్సకు సంబంధించిన రూ. 14 లక్షలు ఆస్పత్రి యజమాన్యం మాఫీ చేయడంతో పోలీసులు సిబ్బంది ఆస్పత్రికి ధన్యవాదాలు తెలిపారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరం : ఎమ్మెల్యే వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అంబర్ పేట నియోజకవర్గంలోని 18 మంది లబ్దిదారులకు మొత్తం 10,83,500/- రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజలను చల్లగా చూసే మహా నాయకుడన్నారు. పేద ప్రజల కష్టాలు సీఎం గారికి తెలిసినంతగా మరెవ్వరికీ తెలియవని, అందుకే వారి సంక్షేమం కోసమే, ప్రతీ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. నాయకులు,

ప్రజాస్వామ్య దేశాన్ని మోడీ ఫాసిజం బెదిరిస్తోంది

- మతోన్మాద, నిరంకుశ విధానాలను ఎండగట్టాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఫాసిస్ట్ నాజీ వారసత్వానికి తిరిగి తీసుకువచ్చిన ప్రధాని మోడీ తన ఫాసిజంతో అతిపెద్ద ప్రజాస్వామ్యా దేశమైన భారతదేశాన్ని బెదిరిస్తున్నారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ తన నిరంకుశ విధానాలతో భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య-లౌకిక రాజకీయాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు.ఆదివారం హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్ లో సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వి.ఎస్.బోస్ మాట్లాడుతూ బీజేపీ భావజాలం, మతోన్మాద జాతీయవాదం ప్రజలను మతపరమైన మార్గాల్లో విభజిస్తుందని, ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక దేశంలో మితవాద దాడికి తెరలేచిందని, మితవాద నయా ఉదారవాద ఆర్థిక విధానాల కలయిక, హిందూత్వ ఎజెండా దూకుడు దేశ పురోగతికి ప్రమాదకరమని సూచిస్తున్నాయని తెలిపారు. మితవాద శక్తుల దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక వాదులు ఏకమై బలమైన ఉద్యమాలు నిర్మించాలని ఆయన కోరారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ మాట్లాడుతూ..ప్రజా సమస్యలపై పోరాటాల నిర్వహణతోనే పార్టీని బలమైన రాజకీయ శక్తిగా ముందుకు తీసుకపోగలమని పేర్కొన్నారు.ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరిగి సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవించే స్థితి కనిపించడం లేదన్నారు. మతోన్మాదం రెచ్చగొట్టి బీజేపీ పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు.బీజేపీ మతోన్మాద, నిరంకుశ విధానాలను ఎండగట్టాలని సూచించారు. కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. దేశవ్యాపితంగా ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారని, ప్రజలు ఏం కొనుగోలు చేసి, తినే పరిస్థితి కనిపించడం లేదన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తు ప్రజా ఉద్యమాలు వేగవంతంగా నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.ఛాయాదేవి, బి.స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, నరసింహ, కమతం యాదగిరి, నెర్లకంటి శ్రీకాంత్, షంషుద్దీన్, పడాల నళిని తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి



- ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- జూబ్లీహిల్స్ డివిజన్‌లో పాఠశాల ప్రారంభం

నవతెలంగాణ- బంజారా హిల్స్

నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యఆర్థిక శాఖామంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లు అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ రోడ్ నెం. 8లో నూతనంగా ఏర్పాటు చేసిన కంగారు కిడ్స్ ప్రీ స్కూల్‌ను మంత్రి హరీశ్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. స్థానికులకు ఉత్తమ సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు హర్షిణి శ్రీ బింగి, సిరిశ్రీ బింగిలు మాట్లాడుతూ 120 మందికి పైగా చిన్నారులు ఈ స్కూల్‌లో ఆట,పాటలతో వివిధ అంశాలు నేర్చుకునేలా డిజైన్ చేసినట్టు వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, కొత్త ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని, రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



- మాజీ ఎంపీ వీ హనుమంతరావు
- గోల్నాకలో హత్ సే హత్ జోడో యాత్ర

నవతెలంగాణ-అంబర్‌పేట

దేశాన్ని, రాష్ట్రాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లూటీ చేయడానికి పోటీ పడుతున్నాయని మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు అన్నారు. హత్ సే హత్ జోడో యాత్ర కార్యక్రమం ఆదివారం గోల్నాక డివిజన్‌లో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అంబర్ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి అర్ లక్ష్మణ్ యాదవ్, పార్టీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి పోలినేని రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో గొల్నాక చౌరస్తా నుంచి జిందా తీలిస్మత్ అలీ కేఫ్ వరకు సాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వి హనుమంత రావు హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటేమో మతంతో, మరొకరేమో మాటలతో పబ్బం గడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు డా. రోహిన్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రేమ్ లాల్, బొల్లు కిషన్, నగేష్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు జ్ఞానేశ్వర్ గౌడ్, నారాయణ స్వామి, పీసీసీ కార్యదర్శులు లక్ పతి యాదగిరి గౌడ్ షంబుల శ్రీకాంత్ గౌడ్, అఫ్సర్ యూసుఫ్ జాహి,అజయ్ కుమార్,ఎస్.సీ సెల్ నగర అధ్యక్షుడు రమేష్ బాబు, టీపీసీసీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి జమీర్, ఓ.బి.సి నాయకులు శ్రీనివాస్ యాదవ్, సుభాష్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

21న ఆస్ట్రేలియా అడ్మిషన్ డే



నవతెలంగాణ- బంజారాహిల్స్

ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యను అభ్యసించి స్థిరపడాలనుకునే విద్యార్థుల కోసం ఈనెల 21న యూని ఎక్స్ పర్ట్స్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా అడ్మిషన్ డ ను నిర్వహిస్తున్నట్టు సంస్థ తెలంగాణ ఆపరేషన్స్ హెడ్ ఉమా తెలిపారు. ఆదివారం సోమాజిగూడ లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... అడ్మిషన్ డే లో ఆస్ట్రేలియాకు చెందిన 25కు పైగా యూనివర్సిటీలు పాల్గొంటున్నాయని తెలిపారు. అడ్మిషన్ డే లో పాల్గొనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీసా రిక్రూట్మెంట్, అడ్మిషన్, స్కాలర్‌షిప్ ఆప్షన్స్, లాంగర్ స్టడీ బ్యాక్ తదితర అంశాలను నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులచే మాట్లాడి తెలుసుకోవచ్చునని చెప్పారు. అడ్మిషన్ గ్యారెంటీతోపాటు విద్యార్థులు 50 శాతం పైగా స్కాలర్‌షిప్, ఆరు సంవత్సరాల వర్క్ వీసా,బెస్ట్ పీఆర్ ఆప్షన్స్ ను పొందుతారని వివరించారు. ఈ అడ్మిషన్ డే లో ఇంటర్, డిగ్రీ, బి.టెక్ అర్హతలు గల వారు ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 9912328645 నెంబర్‌ను సంప్రదించవలసిందిగా కోరారు.

సంతు సేవాలాల్ జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్



నవతెలంగాణ -ముషీరాబాద్

సంతు సద్గురు సేవాలాల్ మహారాజ్ జీవితాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని, 2014 ఎన్నికల్లో గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ డిమాండ్ చేశారు. నంగరాభేరి, లంబాడీ హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంతు సద్గురు సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ధారవత్ గణేష్ నాయక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి రాములు నాయక్ హాజరై ప్రసంగించారు. ప్రధాని సైతం సేవాలాల్ మహారాజ్ గొప్పతనాన్ని కొనియాడుతుంటే సీఎం కేసీఆర్ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను 12 శాతానికి పెంచుతానని మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గణేష్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. యాదగి రిగుట్టలో రూ.100 కోట్లతో సేవాలాల్ మందిరాన్ని, బంజారా భవన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుట్టంగండి శ్రీనివాస్ నాయక్, ఇన్‌చార్జి రంజిత్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ బంజారా, మహిళా విభాగం అధ్యక్షురాలు సుశీలబాయి, సినీ నటి పద్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకుంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

- ఎంపీ రాజు శెట్టి
- రాజు శెట్టి నగరానికి రాక గర్వకారణం : డాక్టర్ ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అన్నదాతలను ఆదుకుంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మహారాష్ట్ర స్వాభిమాని షడ్కరి సంఘటన్ ఎంపీ రాజు శెట్టి అన్నారు. ఆదివారం ఛత్రపతి శివాజీ మహా రాజ్ జయంతి వేడుకలను నాంపల్లి గృహకల్పలోని ఆ సంఘం కార్యాల యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రాజు శెట్టి, సంఘటన్ అధ్యక్షులు ప్రకాష్ కొప్పులే, నాందేడ్ జిల్లా అధ్యక్షులు, హనుమంతరావు పాటిల్, పర్బనీ జిల్లా అధ్యక్షులు కిషోర్ దగ్గిలే, తెలంగాణ రాష్ట్ర మరాఠా మందిర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్ పాటిల్‌ను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముజీబ్, ఎస్.విక్రమ్ కుమార్ ఘనంగా సన్మానించారు. అనంతరం రాజుశెట్టి మాట్లాడుతూ 2013లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఢిల్లీ పార్లమెంట్లో కేసీఆర్‌తో కలిసి తాము అప్పటి ప్రభుత్వంపై ఉద్యమించిన సందర్భాన్ని గురుచేసుకున్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత తెలంగాణ రైతులకు చేస్తున్న సహాయం అపూర్వమన్నారు. తనతోపాటు తమ పార్టీ ప్రముఖులను ఇక్కడ సన్మానించడం గంగా జమున తహజీబ్ కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ఉంటుందని తెలిపారు. ముజీబ్ మాట్లాడుతూ.. రైతుల గురించి అనేక పోరాటాలు చేసి పేరు ప్రఖ్యాతలు సంపాదించిన ఎంపీ రాజు శెట్టి నగరానికి రావ డం గర్వకారణమని, టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆయనకు సదా రుణపడి ఉంటుందని అన్నారు. తెలంగాణ మరాఠా మండల్ సభ్యులు నిక్కం నివాస్, దిలీపజి, తానాజీ, జిల్లా సభ్యులు కె.ఆర్. రాజ్‌కుమార్, ఉమర్ ఖాన్, ఎం.ఏ.ముజీబ్, హరి బాబు, వైదిక శస్త్ర, నాలుగో తరగతి అసోసియేట్ అధ్యక్షులు ముజీబ్, జిల్లా ఏపీఆర్వో మహమ్మద్ వహీద్, ఖుతుబుద్దీన్, మిత్రులు ఉస్మాని అలీ ఉస్మాని, రామకృష్ణా రెడ్డి, రోహిత్, వివిధ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మరణం బాధాకరమని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు ప్రజల నాయకుడు అని, ఎప్పుడూ కూడా ప్రజల గురుంచి ఆలోచించేవారు అని తెలిపారు.వారితో గడిపిన క్షణాలను డిప్యూటీ మేయర్ గుర్తు చేసుకున్నారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మరణం బాధాకరమని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. వారితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

రచయితలు, కవులు ప్రజా సంఘాల నేతల అక్రమ అరెస్ట్ తగదు

- బీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు అంసాల్ లక్ష్మణ్



నవతెలంగాణ-ఓయూ

స్వేచ్ఛ భావ ప్రకటన జేఏసీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బహుజన్ ముక్తి పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని, వారిని వెంటనే విడుదల చేయా లని రాష్ట్ర అధ్యక్షుడు అంసొల్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ బతికి వుంటె గాంధిని గాడ్సే చంపినట్టు చంపుతానాన్న బీజేపీ నాయకుడు హమరప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని పలు దళిత సంఘాలు చలో ట్యాంకు బండ్ పిలుపునిచ్చాయన్నారు. రాజ్యాంగాన్ని మార్చి మనుస్మతినీ అమలుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా శాంతియుత నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకుల అరెస్టులను దుర్మార్గపు చర్యగా భావిస్తున్నామన్నారు. నూతన సెక్రటేరియట్‌కి అంబేద్కర్ పేరు పెడుతున్నాం, ట్యాంక్ బండ్ పక్కన నిలువెత్తు అంబేద్కర్ విగ్రహం కడుతున్నాం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం హమార ప్రసాద్ వ్యాఖ్యలకు కనీసం నిరసన తెలపనియ్యకుండ అడ్డుకోవడం శోచనీయమన్నారు. బీజేపీని మాటల్లో వ్యతిరేకిస్తూ అచరణలో మనువాదులను అరెస్టు చెయకుండా ప్రజాస్వామ్యవాదులను అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు.

దళిత సీఎం సాధనే లక్ష్యం

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణలో దళిత సీఎం సాధనే తమ లక్ష్యంగా మార్చి 11న హైదరాబాద్ నగరంలో నిర్వహించే దళిత గర్జన సదస్సును విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో పార్టీ రాష్ట్ర పతాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి నూతన సీఎంగా దళితుడిని చేస్తామని సీఎం కెసిఆర్ ప్రకటించి దళిత జాతిని నమ్మించి మోసం చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రారంభించిన బీఆర్ఎస్ వల్ల దళిత జాతులకు ఒరిగేదేమి లేదన్నారు. దళితుల డెవలప్ మెంట్ ఫండ్ కు చెందిన వేల కోట్ల రూపాయలు దారి మళ్లించి దోచుకుని, దాచుకొని నేడు బీఆర్ఎస్ ను జాతీయ స్థాయిలో విస్తరించడానికి ఖర్చు చేస్తున్నారని, దళితుల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని అడ్డుకున్న దళిత ద్రోహి కేసీఆర్ అని ఆయన ఆరోపించారు. కొంత మంది దళిత ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు కేసీఆర్ కు రాజకీయ పాలేర్లుగా ఉంటూ ఆయనను అభినవ అంబేద్కర్ అంటూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు.తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించిన తరువాత రెండు, మూడు దోపిడీ కులాలే లాభపడ్డాయన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ వల్ల 90 శాతం నిమ్న జాతులకు సామాజిక న్యాయం, రక్షణ ఉండదన్నారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి ఈ దోపిడీ పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయని, నేటి రాజ్యాంగం స్థానంలో మనుస్మతిని తీసుకురావడానికి, దళితులను బానిసలుగా చేయడానికి కేంద్ర, రాష్ట్ర సర్కారులు ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర పొలిటికల్ పవర్ దళిత సీఎం సాధన ద్వారానే దళిత జాతికి విముక్తి కలుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీరం సతీష్ కుమార్, రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి దేవునూరి శ్రీనివాస్, యూత్ కన్వీనర్ ఎం.కిరణ్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సుబ్బారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ప్రీమియర్ లీగ్ విజేతకు నగదు, ట్రోఫీ అందజేత



నవతెలంగాణ- బంజారాహిల్స్

శివరాత్రి పండుగను పురస్కరించుకొని ఖైరతాబాద్‌లోని శాఖ గ్రౌండ్స్‌లో ఖైరతాబాద్ ప్రీమియర్ లీగ్ (నైట్ మ్యాచ్‌లు) జరిగాయి. ఖైరతాబాద్‌లోని ఆరు ఫ్రాంచైజెస్ పాల్గొనగా గెలుపొందిన వారికి కార్పొరేటర్ పీ విజయ రెడ్డి పీజేఆర్ ఫౌండేషన్ తరపున విన్నర్ టీం భారత్ ఫైబర్ నెట్‌కు రూ.10 వేలు నగదుతో పాటు ట్రోఫీని, రన్నరప్ టీం క్రాంతి రాజ్, సీసీకి రూ. 5 వేల నగదు, ట్రోఫీని అందజేశారు.

కేసీఆర్ వాలీబాల్ కప్ విజేత జీసీపీఈ జట్టు

- విజేతకు బహుమతి అందజేసిన ఎమ్మెల్యే కిషోర్



నవతెలంగాణ-ఓయూ

సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉస్మాని యా యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి మిథున్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఓయూలో గత మూడు రోజులు గా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా జీసీపీఈ జట్టు నిలిచింది. విజేతకు తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ షీల్డ్‌తో పాటు మెడల్, 30 వేల రూపాయలు అందజేశారు. రన్నరప్ వారసిగూడ జట్టుకు రెండో బహుమతిగా 15000 రూపాయలు, మూడవ బహుమ తిగా లయోలా అకాడమీ జట్టుకు 7000 రూపాయలు టోర్నమెంట్ నిర్వాహకులు నల్ల మిథున్ ప్రసాద్ అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజేత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వాలీబాల్ జట్లు ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి క్రీడలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్య మంత్రి కోరుకునే విధంగా క్రీడాలు కుల మత విభేదాలకు అతీతంగా ఐక్యమతంగా ఆడి క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారని ప్రశంసించారు. ఈ టోర్నమెంటు అత్యద్భుతంగా నిర్వహిం చిన నల్లా మిథున్ ప్రసాద్ కు శుభాకాంక్షలు అని అన్నారు. నల్ల మిథున్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ నిర్వహించడం చాలా అదష్టంగా భావిస్తున్నానని తెలిపారు. టోర్నమెంట్ కు సహకరించిన ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, రవీంద్ర కుమార్, ఇతర శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ వల్ల మల్ల మల్ల కష్ణ, డాక్టర్ మంద సురేష్, డాక్టర్ బండారు వీరబాబు, ఉస్మానియా యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు పెరిక శ్యామ్, శ్రీకాంత్ గౌడ్, జంగయ్య, శ్యామ్ సుందర్, కోచ్ బాల రాజు, అవినాష్ శ్రీకాంత్, మాధు, కురువన్న పాల్గొన్నారు.

శివాజీకి మహిళల పట్ల అపారమైన గౌరవం

- కార్పొరేటర్ సామల హేమ
- ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

ఛత్రపతి శివాజీకి మహిళల పట్ల అపారమైన గౌరవం ఉండేదని, కార్పొరేటర్ సామల హేమ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా వారాసిగూడలో ఆయన విగ్రహానికి కార్పొరేటర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ. ఇతర రాజ్యాలపై దండెత్తినప్పుడు స్త్రీలపై ఆయన ఎలాంటి దాడులకు అనుమతించే వారు కాదన్నారు. అలాగే సైనికులకు వ్యక్తిగత ఆయుధాలను కూడా ఇవ్వడానికి నిరాకరించారని తెలి పారు. వేరే రాజ్యాలను ఆక్రమించుకున్న సందర్భంలో దోచుకున్న ఆయుధాలకు తప్పనిసరిగా లెక్క లు చూపి, ఆయుధాగారానికి తరలించాలనే నిబంధనలు అమలు చేశారని చెప్పారు. తన స్నేహితుల్లో, సైనిక వ్యవస్థలో ఎంతోమంది ముస్లింలకు సుముచిత స్థానం కల్పించారని తెలిపారు.బి.ఆర్.ఎస్ నాయకులు కరాటే రాజు,అశోక్,కుమార్,నరేష్ పాల్గొన్నారు.

రామంతపూర్ టీవీ స్టూడియో మెయిన్ రోడ్డు దగ్గర ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహం దగ్గర బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిలు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్విఎస్ఎస్ ప్రభాకర్, హబ్సిగూడ కార్పొరేటర్, చేతన హరీష్, బీజేపీ నాయకులు తిండేరు హనుమంతరావు, కక్కిరేణి హరీష్, సంజయ్ పటేల్, సుమన్ రావు, ఎల్లా చారి, నాగేష్ గుప్తా, సోమ శీను, రమేష్ గుప్తా, అరవింద్, పాల్గొన్నారు.



శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధ నగర్ డివిజన్‌లో శోభాయాత్రలో హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తో కలిసి స్థానిక బీజేపీ నేత మద్దేర్ల శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. ఈ సంద్భంగా కార్యక్రమాన్ని నిర్వహించిన కష్ణమూర్తి, బీజేవైఎం నాయకుడు లడ్డూను అభినందిస్తూ దేశ పరిరక్షణకు ప్రతి యువకుడు ముందుకు రావాలని కోరారు.



సుల్తాన్ బజార్ : చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రినాక చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుశీల్ కుమార్, సభ్యులు సి.విజయ్ కుమార్, నికాంత్, కార్తిక్ చారి, ప్రశాంత్, అమర్ నాథ్, కె.సాయి కుమార్, జి.కిరన్, భాస్కర్, నినార్సింహ, సత్యనారాయణ, బస్తీ వాసులు పాల్గొన్నారు



బంజారా హిల్స్ : ఖైరతాబాద్ నియోజకవర్గంలో వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్‌లో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు బడుగు బలహీన వర్గాల ప్రజా నాయకుడు పల్లపు గోవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



జూబ్లీహిల్స్ : బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకురాలు డా. పద్మ విరపనేని నిర్వహించిన, ఛత్రపతి శివాజీ మహారాజు జయంతి ర్యాలీకి యూసుఫ్ గూడా డివిజన్ పరిధిలో, వెంకట్ గిరి చౌరస్తాలో ఘనంగా బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ ర్యాలీలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ బీజేపీ సీనియర్ నాయకులు గ్యానేశ్వర్, పులి రామ్, బడుగు సతీష్, కాట్రజ్, శాంతి కుమార్, శ్రీనివాస్ రావు తది తరులు పాల్గొన్నారు.



శివాజీకి ఎమ్మెల్యే నివాళి



నవతెలంగాణ-ఓయూ

శివాజీ జయంతి వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. హబ్సిగూడ డివిజన్ గణేష్‌నగర్ చౌరస్తాలో గల ఛత్రపతి శివాజీ విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి నివాళ్లర్పించారు. అలాగే శివాజీ యూత్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదాతలకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం భాస్కర్ రెడ్డి, డాక్టర్ బీవీ చారి, మేకల ముత్యం రెడ్డి, నంది కంటి శివ, కనకయ్య శివాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల రాజు, హనుమంతరావు, జిల్లా శ్రీనివాస్, నగేష్ గుప్తా, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సనాతన ఆధిపత్యాన్ని దిక్కరించిన యోధుడు ఛత్రపతి శివాజీ



- సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్
- శివాజీకి నివాళ్లు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

సనాతన ఆధిపత్యాన్ని ధిక్కరించిన మహా యోధుడు ఛత్రపతి శివాజీ అని సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ పేర్కొంది. సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ లో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..వేల సంవత్సరాలుగా బ్రాహ్మనీయ అధిపతి శక్తులు శూద్రులకు రాజ్యాలను పాలించే అధికారం లేదని, ఒక వర్ణ వ్యవస్థను ప్రజలపై బలవంతంగా రుద్దారని, దీన్ని ఛత్రపతి శివాజీ దిక్కరిస్తూ స్వాతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసి శూద్రులు పాలనకు అర్హులే అని నిరూపించాడన్నారు. ఈ విషయం జీర్ణించు కోలేనీ ఆధిపత్య శక్తులు ఆయనను హత్య చేయడానికి అనేక ప్రయత్నాలు చేశారని గుర్తు చేశారు. యుద్ధ నైపుణ్యాలు తెలిసిన శివాజీ కుట్రలు, కుతంత్రాలను చాకచక్యంగా ఎదుర్కొన్నాడని, పరిపాలనలో నూతన విధానాలకు రూప కల్పన చేశారని, రైతులకు శిస్తూలు, పన్నులను తగ్గించారని, మహిళా హక్కుల కోసం నిలబడ్డారని తెలిపారు. ఉద్దేశ పూర్వకంగా కొన్ని సనాతన సంస్థలు శివాజీని ఓ మతానికి వ్యతిరేకం అని చెబుతూ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇలాంటి సంకుచిత భావజాలాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. శివాజీ సైన్యంలో వేలాది మంది ముస్లింలు ఉన్నారని, ఆనాడు రాజ్యాల మధ్యన యుద్ధాలు జరిగాయని, కానీ మతాల మధ్య కాదనేది చరిత్ర అన్నారు.సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు బి.ఛాయాదేవి, స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహా, చంద్రమోహన్, కమతం యాదగిరి, మన్నన్, పడాల నళిని, శంశుద్దీన్, నేర్లకంటి శ్రీకాంత్, ఆర్.మల్లేష్, కాంపల్లి శ్రీనివాస్, సలీం, మామిడిచెట్ల వెంకటస్వామి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-సిటీబ్యూరో
సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో విశిష్ట అతిథి స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ అధికారి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం నిర్మూలన సంస్థ అధ్యక్షులు స్థితప్రజ్ఞ రావడం చాలా ఆనందం, గర్వంగా ఉందని డాక్టర్ ముజీబ్ తెలిపారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ జిల్లా అధ్యక్షుడితో పాటు కార్య వర్గానికి ఇంతటి చక్కటి కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

నందమూరి తారకరత్నకు నివాళ్ళులర్పించిన ఎమ్మెల్యే గాంధీ



నవ తెలంగాణ, కేపీహెచ్బి :
ప్రముఖ సినీ నటుడు స్వర్గీయ నందమూరి తారకరత్న మృతి చెందడంతో ఆదివారం మోకీల లోని ఆయన స్వగృహానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు లు పాల్గొని నందమూరి తారకరత్న పార్థివ దేహం పై పుష్ప గుచ్చం ఉంచి, శ్రద్ధాంజలి ఘటించారు.
అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నందమూరి తారక రత్న మంచి మనసున్న వ్యక్తి అని, సినీ వినీలాకాశం లో వెలుగు వెలిగిన గొప్ప నటుడు అని అన్నారు. ఆయన అకాల మరణం తీవ్ర ధ్రిగ్భంతికరం అని,సినీ రంగానికి తీరని లోటన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవ తెలంగాణ - బాలానగర్
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని చరబండ రాజు నగర్, నవజీవన నగర్ లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సంస్కరణవాది, ప్రజల మధ్య అంతరాలను చెరిపేసేందుకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కొందరు వ్యక్తులు అంబేద్కర్ ను కొందరికే పరిమితం చేసి చూస్తున్నారని, అది ముమ్మాటికీ తప్పిదమని, ఈ దేశ భవిష్యత్తు అంతా భవిష్యత్తు పునాదుల కోసం ఆయన ఎంతో చెమటోడ్చి భారతదేశానికి ఒక దిక్సూచిని అందించిన మహానుభావుడని కొనియాడారు. ఆయన కల్పించిన హక్కుల ద్వారానే ఈ దేశంలో అందరికీ సమన్యాయం పొందేందుకు వీలు పడిందని గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గంలోని రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నాడని, అంబేద్కర్ ఆశయాలను సాకారం చేసేలా సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా దళితబంధు పథకం తీసుకువచ్చి దళితులు బలోపేతమయ్యేలా కృషి చేస్తున్నారన్నారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధిని సాధించవచ్చని సీఎం కేసీఆర్ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. అలాగే దేశంలో కూడా సనాతనమైన మార్పులు జరగాల్సిన అవసరం ఉందని గ్రహించి బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసి ముందుకు వెళుతున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత నోముల సుదీప్ పటేల్, తెలంగాణ దళిత సంఘం అధ్యక్షుడు ఆదిమల్ల రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్మూరి శ్రీనివాసరావు, నర్సింగ్ రావు, నవజీవన్ నగర్ కాలనీ అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి రాజ్ కుమార్, దళిత సంఘం నాయకులు రత్నం, ఎలిజాల యాదగిరి, మహంకాళి సూరి, జరిపోతుల రవీందర్, ఎడ్ల ప్రభాకర్, మాదాసు నరసింహ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కృష్ణారావు జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-కేపీహెచ్బి
జన నేత, కూకట్‌పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జేఎన్టీయూ యూనివర్సిటి విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు,పలువురు జర్నలిస్టులు పాల్గొని ఎమ్మెల్యే కృష్ణారావు చేత కేక్ కట్ చేయించారు.
అనంతరం ఎమ్మెల్యేకు పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేపీహెచ్ బి డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డివిజన్ లోని 9 వ ఫేస్ పార్టీ కార్యాలయం నుండి నాయకులు, కార్యకర్తలతో భాజ భజంత్రీలతో పెద్ద ఎత్తున ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, అదే విధంగా పాపిరెడ్డి నగర్ కాంటెస్టెడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి , ఇతర నాయకులతో కలిసి ఎం ల్ ఏ మాధవరం కృష్ణారావు ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా సుమారు ఐదే వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యుజే (ఐజేయు) అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, నవతెలంగాణ ప్రతినిధి శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, పాపిరెడ్డి నగర్ సీనియర్ నాయకులు మాయ రాజయ్య, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, అక్కిరెడ్డి, యాదగిరి, వడ్డెర, రామకృష్ణారెడ్డి, యాదగిరి, మహేష్, రాజు, జేఎన్టీయూహెచ్ విద్యార్థి సంఘాల నాయకులు ఎరవెల్లి జగన్, బొజ్జ ప్రణయ్ భాస్కర్, సిద్దార్థ, టి.తేజ, తరుణ్, బద్రు నాయక్, ఆకాష్,పలువురు జర్నలిస్టులు, కార్పొరేటర్లు శిరీష బాబురావు,సభిహ గౌసుద్దీన్,ముద్దం నర్సింమ్మ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే







నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని న్యూ శివాలయం నగర్ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవం, సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షిక మహోత్సవం, సూరారం శ్రీ సాయినగర్ బాలాజీ క్వార్టర్స్ వద్ద భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధిలో ఎల్లవేళల సహకారం అందిస్తామని అన్నారు. స్వామివారి మహోత్సవాల్లో పాల్గొనడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు

నవ తెలంగాణ-జగద్గిరిగుట్ట
మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి అంజయ్య నగర్‌లో గల శ్రీ భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆలయ కమిటీ చైర్మెన్, నల్లగోపుల బాబుగౌడ్, బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పబ్బోజు ప్రవీణ్ కుమార్ చారి, సభ్యులు కోటగడ్డ శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, నాయకులు పి. శేషారెడ్డి ,విఠల్ ముదిరాజ్, ఆంజనేయులు, హనుమంతరెడ్డి , కిరణ్, డి. జయశ్రీ, కె.అరుణ రెడ్డి, సిద్దారెడ్డి, విట్టల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ దేవాలయంలో...
జగద్గిరిగుట్ట శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల మార్కండేయ దేవాలయంలో (శివాలయం)ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ మునిపల్లి జనార్దన్, సభ్యులు గడ్డం జయరాములు, రాము, రాజు, రాములు, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన భరత సింహారెడ్డి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని జీడిమెట్ల విలేజ్ హనుమాన్ యూత్ గవర్నమెంట్ మరియు సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ రామలీల మైదానంలో క్రికెట్ షార్ట్ పిచ్ టోర్నమెంట్‌కి ముఖ్యఅతిథిగా పాల్గొని టోర్నమెంట్ ని బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో 130 డివిజన్ బిజెపి అధ్యక్షులు కంది శ్రీరాములు, నార్ల కంటి దుర్గయ్య మల్లేష్, సాయిలు, శ్రీనివాస్ ముదిరాజ్, నందు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, నాగదీప్ గౌడ్, బైండ్ల రాము, నాగరాజు, మానస్ గౌడ్ ,కాంతి యాదవ్, శ్రావణ్, జ్ఞాన వర్మ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్ లహరి గ్రీన్ పార్క్ లో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొని ఈ సందర్భంగా కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, మంజీర నీటి సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యే కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. నిధులకు కొరత లేకుండా రాబోయే రోజుల్లో ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, మురళి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి మరియు అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యామ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బాలుడు, జనరల్ సెక్రటరీ వి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ కె.వి శ్రీనివాస్, ట్రెజరర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే







నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు డివిజన్లో పార్టీలకు అతీతంగా అనేక మంది నాయకులు, కార్యకర్తలు శివాజీకి ఘన నివాళులు అర్పించారు. శివాజీ ధైర్య సాహసాలను గుర్తు చేసుకున్నారు. మరాఠ పోరాట యోధుడని స్మరించుకున్నారు. శివాజీ జయంతి సందర్భంగా జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ శివాజీ సర్కిల్ వద్ద ఆర్య క్షత్రియ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ఛత్రపతి జయంతి వేడుకలు

నవతెలంగాణ - కూకట్‌పల్లి
ఆల్విన్ కాలనీ డివిజన్, జలకన్య హోటల్ వద్ద బీజెవైఎం డివిజన్ అధ్యక్షులు రాహుల్ కుమార్ ఆధ్వర్యంలో, నిర్వహించినటువంటి ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ వేడుకల్లో బీజేపీ సీనియర్ నాయకులు సురభి రవీందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు రామరాజులు పాల్గొని మాట్లాడుతూ హిందూ పరిరక్షణ కై ఛత్రపతి శివాజీ చూపిన తెగువ, పాలనా దక్షత నేటి పాలకులకు ఆదర్శప్రాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ విజిత్ వర్మ, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు స్రవంతి, డివిజన్ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్రరెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ మణి భూషణ్, బీజెవైఎం స్టేట్ జనరల్ సెక్రెటరీ అరుణ్, గద్వాల్ జిల్లా ఇన్‌చార్జ్ కుమార్, సీనియర్ నాయకులు కేశవ్, రామ్‌రెడ్డి, నర్సింగ్ యాదవ్, ఎత్తిరి రమేష్, డివిజన్ జనరల్ సెక్రెటరీ టప్పా రఘు, బీజేపీ స్పోక్ పర్సన్ వేణు, బీజెవైఎం డివిజన్ అధ్యక్షులు రాహుల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేపీహెచ్బి :
ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా అల్లాపూర్ డివిజన్ లోని వివేకానంద నగర్ లో గల శివాజీ విగ్రహం వద్ద మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు పులిగోల్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ , నియోజకవర్గ కన్వీనర్ డాకయ్య , సీనియర్ నాయకులు సునీల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి లు పాల్గొని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా సభ్యులు సుదర్శన్ ముదిరాజ్, మోహన్ గౌడ్, గంగాధర్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు విజయ్ , ప్రధాన కార్యదర్శి బొంత హరికృష్ణ , ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, వెంకటరెడ్డి, శ్రావణ్, కృష్ణ శర్మ, సిరికి శ్రీనివాస్, సాయి చంద్, అంకిత్, రామకృష్ణ, జితేందర్, దత్తాత్రేయ,ప్రసాద్, సత్యనారాయణ , బిజెపి కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నదానం మహాదానం: కంఠం కృష్ణారెడ్డి

నవ తెలంగాణ-శామీర్ పేట
అన్నదానం మహాదానం అని శామీర్ పేట మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు కంఠం.కృష్ణారెడ్డి అన్నారు. శామీర్ పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలో మహ శివరాత్రి పండుగ పర్వదిన సందర్భంగా ఆదివారం గ్రామంలోని శివాలయం వద్ద మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ కంఠం. కృష్ణారెడ్డి శ్వేతా రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ కంఠం.కృష్ణారెడ్డి శ్వేతరెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాస శివరాత్రి సందర్భంగా శివాలయం వద్ద భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈఅన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కొంపల్లి వడ్డెర సంఘం సభ్యులు



నవతెలంగాణ-దుండిగల్
అసెంబ్లీ సమావేశాల్లో వడ్డెర కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన నేపథ్యంలో కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన వడ్డెర సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర జాతిని బీసీ జాబితా నుండి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలన్న తమ డిమాండ్ ను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో సమస్య పరిష్కారానికి మొట్టమొదటి సారిగా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు ఎమ్మెల్యే నివాళి

నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకల్లో ఆదివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. క్రికెట్ టౌర్నమెంట్ విజేతలకు ఎమ్మెల్యే ట్రోఫీలు అందజే శారు. స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
ఈవెంట్ అని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ పి.సైదులు, కుటుంబ సభ్యులు, తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్ట సమీపంలోని లెనిన్ నగర్ ప్రాంతంలో దూద్ నాథ్ ప్రైవేట్ ఉద్యోగి ఈయనకు ఐదుగురు సంతానం చిన్న కూతురైన అంజు కుమారి (20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇదిలా ఉండగా 18 న శనివారం ఉదయం 11 గంటలకు సమయంలో ఈవెంట్‌లో మేకప్ చేయడానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్ళింది. సాయంత్రం వరకు ఎంతకీ రాకపోవడంతో ఆందోళన చెందిన అంజు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సోదరి అంజు కుమారి మొబైల్ స్విచ్ ఆఫ్ వస్తుందని ఆమె సోదరీ సంజు కుమారి ఫిర్యాదులో పేర్కొంది.పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సెమీస్‌పై కన్నేసి..!

- ఐర్లాండ్‌తో హర్మన్‌సేన ఢీ నేడు
- ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్

పోర్ట్ ఎలిజబెత్ : భారత మహిళల జట్టు కీలక మ్యాచ్‌కు సిద్ధమవుతుంది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్స్ బెర్త్‌పై కన్నేసిన టీమ్ ఇండియా నేడు ఐర్లాండ్‌తో తలపడనుంది. గ్రూప్-2లో మూడు మ్యాచుల్లో రెండు విజయాలు సాధించిన భారత్.. నేడు ఐర్లాండ్‌పై భారీ విజయం సాధిస్తేనే సెమీఫైనల్లోకి నేరుగా చేరనుంది. వెస్టిండీస్, ఐర్లాండ్‌లు సెమీస్ రేసు నుంచి నిష్క్రమించినా.. పాకిస్థాన్ జట్టు ఇంకో రెండు మ్యాచులు ఆడాల్సి ఉంది. నేడు ఐర్లాండ్‌పై భారత్ విజయం సాధిస్తే ఆరు పాయింట్లతో గ్రూప్-2లో రెండో స్థానంతో సెమీస్‌కు చేరుకోనుంది. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో మెరుగ్గా రాణించినా.. ఓటమి చెందిన హర్మన్‌ప్రీత్ సేన.. నేడు ఐర్లాండ్‌పై ధనాధన్ దండయాత్ర చేయనుంది. భారత్‌కు మంధాన, రిచా ఘోష్, దీప్తి శర్మ, రేణుక సింగ్ కీలక కానుండగా.. ఐర్లాండ్ తరపున లెవిస్, ఓర్లా, కెల్లి, లారా డెలానీలు కీలక పాత్ర పోషించనున్నారు. భారత్, ఐర్లాండ్ మ్యాచ్ సాయంత్రం 6.30 గంటలకు ఆరంభం కానుంది.





రంజీ ట్రోఫీ టైటిల్‌తో సౌరాష్ట్ర ఆటగాళ్లు

రంజీ చాంపియన్ సౌరాష్ట్ర

- ఫైనల్లో బెంగాల్‌పై గెలుపు

కోల్‌కత : దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీని సౌరాష్ట్రం సొంతం చేసుకుంది. కోల్‌కత ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఫైనల్లో గెలుపొందిన సౌరాష్ట్ర గత మూడు సీజన్లలో రెండుసార్లు చాంపియన్‌గా అవతరించింది. 2020 రంజీ ట్రోఫీ ఫైనల్లో బెంగాల్‌పై విజయంతో విజేతగా నిలిచిన సౌరాష్ట్ర.. మళ్లీ అదే ప్రదర్శన పునరావృతం చేసింది. తొలుత బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకు కుప్పకూలగా..సౌరాష్ట్ర 404 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. బెంగాల్ రెండో ఇన్నింగ్స్‌లో 241 పరుగులు చేయగా.. 12 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సౌరాష్ట్ర ఊదేసింది. 2.4 ఓవర్లలో 14/1తో 9 వికెట్ల తేడాతో బెంగాల్‌పై ఘన విజయం సాధించింది. సౌరాష్ట్ర కెప్టెన్ జైదేవ్ ఉనద్కత్ తొమ్మిది వికెట్ల ప్రదర్శనతో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' గా నిలువగా.. సౌరాష్ట్ర స్టాండ్ ఇన్ కెప్టెన్ అర్పిత్ వసవాడ (907 పరుగులు) 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డు అందుకున్నాడు. 2020 రంజీ ఫైనల్లో బెంగాల్‌పై విజయంతో సౌరాష్ట్ర చాంపియన్‌గా నిలిచింది. 2023 రంజీ ఫైనల్లో మరోసారి ఈ రెండు జట్లు పోటీపడగా.. మళ్లీ బెంగాల్‌కు భంగపాటు తప్పలేదు.

తొలి వన్డేకు రోహిత్ దూరం

- ఆసీస్‌తో వన్డేలకు జట్టు ఎంపిక
- చివరి రెండు టెస్టులకు మార్పుల్లేవ్



ముంబయి : ఆస్ట్రేలియాతో తొలి వన్డేకు రోహిత్ శర్మ దూరం కానున్నాడు. వ్యక్తిగత, కుటుంబ కారణాలతో మార్చి 17న ముంబయిలో జరిగే తొలి వన్డేకు అందుబాటులో ఉండటం లేదు. రోహిత్ గైర్హాజరీలో వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య పగ్గాలు చేపట్టనున్నాడు. గత ఐదు టెస్టుల్లో 13 సగటుతో 117 పరుగులే చేసిన కెఎల్ రాహుల్‌ను ఆసీస్‌తో చివరి రెండు టెస్టులకూ కొనసాగించారు. కానీ టెస్టు జట్టు వైస్ కెప్టెన్సీ నుంచి రాహుల్‌ను తప్పించారు. రంజీ ఫైనల్స్ కోసం రెండో టెస్టుకు దూరమైన జైదేవ్ ఉనద్కత్ ఇండోర్, అహ్మదాబాద్ టెస్టులకు జట్టులోకి వచ్చాడు. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ కారణాలతో టెస్టులు, వన్డేలకు దూరమయ్యాడు. భారత్, ఆస్ట్రేలియా రెండో వన్డేకు మార్చి 19న విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుండగా, చివరి వన్డే మార్చి 22న చెన్నైలో జరుగనుంది.

భారత వన్డే జట్టు : రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, సూర్య, రాహుల్, కిషన్, పాండ్య (వైస్ కెప్టెన్), జడేజా, కుల్దీప్, వాషింగ్టన్, చాహల్, షమి, సిరాజ్, ఉమ్రాన్, శార్దుల్, అక్షర్, జైదేవ్.

జడేజా మాయ

- పది వికెట్ల ప్రదర్శనతో మాయాజాలం
- రెండో టెస్టులో భారత్ ఘన విజయం
- ఛేదనలో మెరిసిన రోహిత్, పుజార, కోహ్లి

2-0తో బోర్డర్-గవాస్కర్ సిరీస్‌పై పట్టు

ఫిరోజ్ షా కోట్లలో మరోసారి మాయ. ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో కనీసం రెండు సార్లు మ్యాచ్‌ను కోల్పోయామనే దుస్థితిలో నిలిచిన టీమ్ ఇండియా.. 6 వికెట్ల తేడాతో అద్భుత విజయం నమోదు చేసింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 2-0 ఆధిక్యంతో పదిలం చేసుకుంది. రవీంద్ర జడేజా (7/42) కెరీర్ అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయగా ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో చివరి 8 వికెట్లను 28 పరుగులకే కోల్పోయింది. 113 పరుగులకే ఆసీస్‌ను కుప్పకూల్చిన భారత్.. సవాల్‌తో కూడిన స్వల్ప లక్ష్యాన్ని 26.4 ఓవర్లలోనే ముగించింది. రోహిత్ శర్మ (31), పుజార (31 నాటౌట్), విరాట్ కోహ్లి (20) రాణించారు. సిరీస్‌లో మూడో టెస్టు మార్చి 1 నుంచి ఇండోర్‌లో జరుగనుంది

నవతెలంగాణ-న్యూఢిల్లీ

కష్టసాధ్యంగా మారిన రెండో టెస్టులో టీమ్ ఇండియా కండ్లుచెదిరే విజయం సాధించింది. రవీంద్ర జడేజా (7/42), రవిచంద్రన్ అశ్విన్ (3/59) మాయజాలంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో అనూహ్యంగా 113 పరుగులకే కుప్పకూలింది. 115 పరుగుల సవాల్‌తో కూడిన ఛేదనను టీమ్ ఇండియా 26.4 ఓవర్లలోనే ముగించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (31, 20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), చతేశ్వర్ పుజార (31 నాటౌట్, 74 బంతుల్లో 4 ఫోర్లు), విరాట్ కోహ్లి (20, 31 బంతుల్లో 3 ఫోర్లు), తెలుగు తేజం కె.ఎస్ భరత్ (23 నాటౌట్, 22 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రెండో టెస్టులో 6 వికెట్ల తేడాతో గెలుపొందిన భారత్ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 2-0తో తిరుగులేని ముందంజ వేసింది. చివరి రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియా విజయం సాధించినా.. సిరీస్‌ను, ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు ఖాయం చేసుకుంది. తొలి సెషన్లోనే కుప్పకూలిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో ట్రావిశ్ హెడ్ (43, 46 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), మార్నస్ లబుషేన్ (35, 50 బంతుల్లో 5 ఫోర్లు) రాణించారు. పది వికెట్లు పడగొట్టిన రవీంద్ర జడేజా 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

28 పరుగులకే 8 వికెట్లు

ఓ వైపు ఆస్ట్రేలియా వేగంగా పరుగులు రాబడుతోంది. మరోవైపు ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కంగారూలకు ప్రాణ సంకటంగా మారుతున్నాడు. ఈ మధ్యలో రవీంద్ర జడేజా ఓవర్లలలో ఆసీస్ పరుగులు పిండుకుంది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో ఇలా సాగుతున్న పరిస్థితి.. ఒక్కసారిగా మ్యాజిక్ తరహాలో మారిపోయింది. అప్పటి వరకు ఆసీస్‌కు పరుగులు సమర్పించుకునే పనిలో ఉన్న జడేజా... ఆసీస్‌కు రివర్స్ పంచ్ ఇచ్చాడు. రివర్స్ స్వీప్ ఆడుతున్న ఆసీస్ ఆటగాళ్లను చూస్తుండగానే పెవిలియన్ దారి పట్టించాడు. 86/2తో భారీ స్కోరు దిశగా సాగుతున్న ఆస్ట్రేలియా జడేజా దెబ్బకు చివరి 8 వికెట్లను 28 పరుగులకే చేజార్చుకుంది. కనీసం 150 పరుగులైనా చేసేలా కనిపించిన ఆస్ట్రేలియాను జడేజా 113 పరుగులకే పరిమితం చేశాడు. అశ్విన్ (3/59) సైతం రాణించటంతో తొలి సెషన్‌లోనే ఆస్ట్రేలియా కుప్పకూలింది.



కెరీర్ ఉత్తమం! : జడేజా పది వికెట్ల ప్రదర్శన

ట్రావిశ్ హెడ్ (43), స్టీవ్ స్మిత్ (9), మాట్ రెన్షా (2)లను అశ్విన్ అవుట్ చేయగా.. మిగతా బ్యాటర్ల సంగతి జడేజా చూసుకున్నాడు. తొలి ఆరు ఓవర్లలో వికెట్ లేకుండా 31 పరుగులు సమర్పించుకున్న జడేజా ఆ తర్వాత ప్రతాపం చూపించాడు. రివర్స్ స్వీప్ షాట్లతో భారత్‌పై ఎదురుదాడి చేసిన కంగారూ బ్యాటర్లను.. అదనపు పేస్, స్పిన్, స్ట్రెయిట్ బంతుల వైవిధ్యంతో బోల్తా కొట్టించాడు. ఆస్ట్రేలియా 95 పరుగుల స్కోరు వద్ద ఏకంగా నాలుగు వికెట్లను కోల్పోయింది. లబుషేన్, రెన్షా, హ్యాండ్స్‌కాంబ్, కమిన్స్‌లు ఒకే స్కోరు వద్ద అవుటయ్యారు. ఓవర్‌నైట్ స్కోరు 62/1తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా.. ఓ దశలో 86/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. ఆ తర్వాత అసలు కథ మొదలైంది. జడేజా మాయతో 8 వికెట్లను 28 పరుగులకే కోల్పోగా.. 27 స్వీప్ షాట్లతో ఆసీస్ విలువైన 71 పరుగులు పిండుకుని భారత ఫీల్డింగ్ ప్రణాళికలను తికమక చేసింది.

ఛేదనలో దూకుడు

115 పరుగుల ఛేదన భారత్‌కు సైతం సవాల్ విసిరింది. లంచ్ లోపే ఛేదనకు వచ్చిన టీమ్ ఇండియా ఓపెనర్ కెఎల్ రాహుల్ (1)ను ఇన్నింగ్స్ ఏడో బంతికే కోల్పోయింది. 14/1తో లంచ్ విరామానికి వెళ్లిన టీమ్ ఇండియా.. ధనాధన్ ప్రణాళికలతో వచ్చింది. ఓ ఎండ్‌లో చతేశ్వర్ పుజార (31 నాటౌట్) వికెట్లను కాపాడగా.. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ ఎదురుదాడి చేశాడు. నాథన్ లయాన్‌పై వరుసగా 6, 4 బాదిన రోహిత్.. కుహ్నేమాన్‌నూ సిక్సర్ బాదకుండా వదల్లేదు. 20 బంతుల్లోనే 31 పరుగులు పిండుకున్న రోహిత్.. క్రీజులో సౌకర్యంగా కనిపించాడు. పుజారను రెండో పరుగుకు పిలిచిన రోహిత్..తనే రనౌట్‌గా నిష్క్రమించాడు. అప్పటికి భారత్ స్కోరు 39/2. ఆ తర్వాత విరాట్ కోహ్లి (20, 31 బంతుల్లో 3 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (12, 10 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) అదే ఫార్ములా పాటించారు. తెలుగు కుర్రాడు శ్రీకర్ భరత్ (23 నాటౌట్, 22 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దేశవాళీ దమ్ము చూపించాడు. మూడు ఫోర్లు, ఓ సిక్సర్ బాదిన భరత్.. పుజారతో కలిసి ఐదో వికెట్‌కు అజేయంగా 30 పరుగులు జోడించాడు. కెరీర్ వందో టెస్టులో పుజార మెగా ఇన్నింగ్స్ ఆడకపోయినా.. జట్టుకు అత్యంత విలువైన ఇన్నింగ్స్ నమోదు చేశాడు. 74 బంతులు ఎదుర్కొన్న పుజార అజేయంగా 31 పరుగులు సాధించాడు. బౌండరీతో జట్టుకు గెలుపు పరుగులు అందించాడు. 26.4 ఓవర్లలోనే 118 పరుగులు చేసిన భారత్ టీ విరామం లోపే లాంఛనం ముగించింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో వరుసగా రెండో టెస్టు సైతం మూడు రోజుల్లోనే ముగిసింది. ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లయాన్ (2/49) రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.



'వంద' ఆనందం : పుజారతో ఆసీస్ ఆటగాళ్ల కరచాలనం

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 263/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 262/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : ఉస్మాన్ ఖవాజ (సి) అయ్యర్ (బి) జడేజా 6, ట్రావిశ్ హెడ్ (సి) భరత్ (బి) అశ్విన్ 43, లబుషేన్ (బి) జడేజా 35, స్మిత్ (ఎల్బీ) అశ్విన్ 9, మాట్ రెన్షా (ఎల్బీ) అశ్విన్ 2, హ్యాండ్స్‌కాంబ్ (సి) కోహ్లి (బి) జడేజా 0, అలెక్స్ కేరీ (బి) జడేజా 7, కమిన్స్ (బి) జడేజా 0, నాథన్ లయాన్ (బి) జడేజా 8, టాడ్ మర్ఫీ నాటౌట్ 3, కుహ్నేమాన్ (బి) జడేజా 0, **ఎక్స్‌ట్రాలు :** 0, **మొత్తం : (31.1 ఓవర్లలో ఆలౌట్) 113.**

వికెట్ల పతనం : 1-23, 2-65, 3-85, 4-95, 5-95, 6-95, 7-95, 8-110, 9-113, 10-113.

బౌలింగ్ : అశ్విన్ 16-3-59-3, మహ్మద్ షమి 2-0-10-0, జడేజా 12.1-1-42-7, అక్షర్ పటేల్ 1-0-2-0.

భారత్ రెండో ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ రనౌట్ 31, కెఎల్ రాహుల్ (సి) అలెక్స్ (బి) లయాన్ 1, పుజార నాటౌట్ 31, విరాట్ కోహ్లి (స్టంప్డ్) అలెక్స్ (బి) మర్ఫీ 20, శ్రేయస్ అయ్యర్ (సి) మర్ఫీ (బి) లయాన్ 12, కె.ఎస్ భరత్ నాటౌట్ 23, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం : (26.4 ఓవర్లలో 4 వికెట్లకు) 118.**

వికెట్ల పతనం : 1-6, 2-39, 3-69, 4-88.

బౌలింగ్ : మాథ్యూ కుహ్నేమాన్ 7-0-38-0, నాథన్ లయాన్ 12-3-49-2, టాడ్ మర్ఫీ 6.4-2-22-1, ట్రావిశ్ హెడ్ 1-0-9-0.



వాలీబాల్‌కు మంచి ఆదరణ

- సినీ హీరో విజయ్ దేవరకొండ
- ప్రైమ్‌వాలీబాల్ లీగ్‌లో సందడి

నవతెలంగాణ, హైదరాబాద్ : భారత్‌లో వాలీబాల్‌కు మంచి ఆదరణ లభిస్తుందని, క్రీడాభిమానులకు వాలీబాల్ ప్రధాన ఎంటర్‌టైన్‌మెంట్‌గా మారనుందని సినీ నటుడు విజయ్ దేవరకొండ అన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రైమ్ వాలీబాల్ లీగ్‌కు వచ్చిన విజయ్ అభిమానులతో కలిసి మ్యాచ్ వీక్షించాడు. 'వాలీబాల్ అంటే ఇష్టం, హైదరాబాద్ అంటే ఎంతో ఇష్టం. స్కూల్ డేస్‌లో వాలీబాల్ బాగా ఆడేవాళ్లం. ఎటాకర్లను ఎక్కువగా అనుసరించే వాళ్లం. భారత్‌లో వాలీబాల్‌కు మంచి ఆదరణ ఉంటుంది. ప్రతి ఐదు నిమిషాలకు మలుపు తిరిగే వాలీబాల్ రానున్న రోజుల్లో క్రీడాభిమానులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ కానుందని' విజయ్ అన్నారు. ఇదిలా ఉండగా, చెన్నై బ్లిట్జ్‌పై హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 3-2తో విజయం సాధించింది. 10-15, 15-14, 15-9, 12-15, 15-11తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ సీజన్లో మూడో విజయం నమోదు చేసింది. హైదరాబాద్‌లో జరిగిన రెండు మ్యాచుల్లోనూ బ్లాక్‌హాక్స్ బ్లాక్‌బస్టర్ విజయాలు సాధించటం విశేషం.

ఇంగ్లాండ్ గెలుపు

మౌంట్ మౌంగానుయ్ : న్యూజిలాండ్‌తో తొలి టెస్టు (డేనైట్)లో ఇంగ్లాండ్ 267 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 394 పరుగుల రికార్డు ఛేదనలో కివీస్ 126 పరుగులకే కుప్పకూలింది. జేమ్స్ అండర్సన్ (4/18), స్టువర్ట్ బ్రాడ్ (4/49) నిప్పులు చెరగటంతో కివీస్ బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 306 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ వరుసగా 325/9, 374 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ సెంచరీలు బాదిన ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యం సాధించింది.

నవచిత్రం

నిర్మాతల మండలి నూతన అధ్యక్షుడిగా దామోదర్ ప్రసాద్



విజయానందంలో తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి నూతన కార్యవర్గ సభ్యులు

2023- 2025 సంవత్సరాలకు గాను ఆదివారం ఉత్కంఠభరిత వాతావరణంలో తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నిర్మాతల మండలి నూతన అధ్యక్షుడిగా కె.ఎల్.దామోదర్ ప్రసాద్ విజయం సాధించారు. ప్రత్యర్థి నిర్మాత జెమిని కిరణ్‌పై 24 ఓట్ల తేడాతో ఆయన ఈ విజయాన్ని కైవసం చేసుకున్నారు. 1200 సభ్యులకు గాను 339 మంది సభ్యులు దామోదర ప్రసాద్‌కి వేయగా, 315 ఓట్లను ప్రత్యర్థి జెమినీ కిరణ్‌కు వేశారు. ఉపాధ్యక్ష పదవికి వై.సుప్రియ, కె.అశోక్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, ట్రెజరర్‌గా రామ సత్యనారాయణ గెలుపొందారు. సెక్రటరీలుగా ప్రసన్న కుమార్, వై.వి.ఎస్.చౌదరి, జాయింట్ సెక్రటరీలుగా భరత్ చౌదరి, నట్టికుమార్ ఎన్నికయ్యారు. దిల్ రాజు, దానయ్య, రవి కిషోర్, యలమంచిలి రవి, పద్మిని, బెక్కం వేణుగోపాల్, సురేందర్ రెడ్డి, గోపీనాథ్ ఆచంట, మధుసూదన్ రెడ్డి, కేశవరావు, శ్రీనివాద్ వజ్జ, అభిషేక్ అగర్వాల్, కృష్ణ తోట, రామకృష్ణ గౌడ్, కిషోర్ పూసలు తదితరులు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. ఎంపికైన ఈ నూతన కార్యవర్గం 2023- 2025 వరకు కొనసాగుతుంది.

ఎన్నికల ఫలితాల అనంతరం తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ,'అందరూ ఒకటే అనే నినాదంతో కౌన్సిల్ అభివృధికి పాటుపడదాం. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దృష్టిలో పెట్టుకొని సభ్యుల సంక్షేమం కోసం హౌసింగ్, పేద నిర్మాతల పిల్లల విద్య, వివాహం, ప్రొడ్యూసర్ గిల్డ్‌ని కౌన్సిల్‌లో విలీనం చేయడానికి బైలా మార్చాలని నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు.

మా ఊరి పొలిమేర

సీక్వెల్ షూటింగ్ పూర్తి

శ్రీ కృష్ణ క్రియేషన్స్ బేనర్ పై గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ నిర్మాతగా 'మా ఊరి పొలిమేర' చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతోంది. డా.అనిల్ విశ్వనాథ్ దర్శకుడు.

సత్యం రాజేష్, డా. కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, బాలాదిత్య, రవి వర్మ, చిత్రం శ్రీను, అక్షత శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఉత్తరాఖండ్, కేరళ, ఆంధ్రప్రదేశ్, ఖమ్మం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ వెల్లడించనున్నారు.

ఈ చిత్రానికి సంగీతం: గ్యాని, సినిమాటోగ్రఫీ: ఖుషేందర్ రమేష్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్: ఉపేంద్ర రెడ్డి చందా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్.సి.సతీష్ కుమార్.



కామాక్షి భాస్కర్ల, సత్యం రాజేష్



తారకరత్న భౌతిక కాయానికి ఘన నివాళి అర్పిస్తున్న చిరంజీవి, బాలకృష్ణ తదితరులు

నేడు తారకరత్న అంత్యక్రియలు



విషణ్ణ వదనాలతో సోదరులు కళ్యాణ్‌రామ్, ఎన్టీఆర్

'యువగళం' పాదయాత్రలో తీవ్ర గుండెపోటుకు గురై గత 23 రోజులుగా మృత్యువుతో పోరాడిన నటుడు తారకరత్న తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి ఆయన భౌతికకాయాన్ని బెంగుళూరులోని నారాయణ హృదయాలయ నుంచి హైదరాబాద్‌లోని మోకిలలోని తారకరత్న నివాసానికి తరలించారు. ఆదివారం తారకరత్న నివాసానికి నందమూరి కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతోపాటు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆయనకు ఘన నివాళి అర్పించారు. నారాచంద్రబాబునాయుడు, బావ లోకేష్‌తోపాటు బాబాయ్ బాలకృష్ణ, సోదరులు ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్‌తోపాటు చిరంజీవి, రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, ఆలీ వంటి తదితర పరిశ్రమ ప్రముఖులు తారకరత్న భౌతికకాయాన్ని సందర్శించి, కన్నీటి పర్యంతమయ్యారు. ముఖ్యంగా బాబాయ్ బాలయ్య తీవ్ర భావోద్వేగానికి లోనవ్వడం అందరి కళ్లని చెమర్చింది. బాబాయ్ బాలకృష్ణ అంటే తారకరత్నకి ఎంతో ప్రేమ. ఆ ప్రేమకు సంకేతంగా బాబాయ్ బాలకృష్ణ సంతకాన్ని తారకరత్న తేన చేతిపై పచ్చబొట్టుగా వేయించుకున్నారు. ఇదిలా ఉంటే, తారకరత్న కూతురు నిష్క తన తమ్ముడిని పట్టుకుని నాన్నకోసం వెక్కి వెక్కి ఏడవటం అందరినీ కలచివేసింది.

పెద్దలంటే గౌరవంతోపాటు ఇండ్రస్టీలో సౌమ్యుడిగా పేరొందిన తారకరత్న ఇకలేరనే విషయాన్ని ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తారకరత్న భౌతికకాయాన్ని అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖుల సందర్శనార్థం నేడు (సోమవారం) ఉదయం 8 గంటలకు ఫిల్మ్‌నగర్‌లోని ఫిల్మ్‌ఛాంబర్‌కు తరలించనున్నారు. అక్కడ మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉంచి, తర్వాత జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానంలో తారకరత్న అంత్యక్రియలను నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆసక్తికరంగా కథ వెనుక కథ



సునీల్

కొత్త కాన్సెప్ట్ చిత్రాలను అందిస్తూ న్యూ టాలెంట్‌ను ఎంకరేజ్ చేయటానికి ప్రారంభమైన నిర్మాణ సంస్థ దండమూడి బాక్సాఫీస్. ఈ బ్యానర్‌పై రూపొందుతున్న తొలి చిత్రం 'కథ వెనుక కథ'.

విశ్వంత్ దుడ్డుంపూడి, శ్రీజిత గౌష్, శుభ శ్రీ ప్రధాన తారాగణంగా నటించారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అవనింద్ర కుమార్ నిర్మిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ టీజర్‌ను డైరెక్టర్ గోపీచంద్ మలినేని రిలీజ్ చేశారు. టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని, సినిమా పెద్ద హిట్ కావాలని చిత్ర యూనిట్‌కి ఆయన అభినందనలు తెలిపారు.

ఈ టీజర్‌ను గమనిస్తే.. ఓ యంగ్ డైరెక్టర్ (విశ్వంత్) మరో పాత్రకు ఓ క్రైమ్ కథను చెప్పటంతో టీజర్ స్టార్ట్ అవుతుంది. సిటీలో చాలా వరకు మిస్సింగ్ కేసులుగా నమోదు అవుతున్న అమ్మాయిలను ఎవరో హత్య చేస్తుంటారు. ఇంత భయంకరమైన హత్యలను చేస్తున్న హంతకుడెవరో పోలీసులకు అంతు చిక్కదు. దీంతో వారు కేసుని సత్య (సునీల్) అనే సిన్సియర్ పోలీస్ ఆఫీసర్‌కి అప్పగిస్తారు. సిటీలో జరుగుతున్న హత్యలకు ఓ వ్యక్తి కారణం కాదని, ఓ గ్యాంగ్ కలిసి ఈ హత్యలను చేస్తుందని సత్యకు తెలుసుకుంటాడు. మరి ఈ విషయాన్ని సత్య ఎలా కనుక్కున్నాడు?, అతను టీజర్‌లో చెప్పినట్లు మిస్ అయిన ఓ పాయింట్ ఏంటి? అనే విషయాలను తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే అనేలా టీజర్ ఉండటం విశేషం.

టీజర్‌లో పోలీసుల ఇన్వెస్టిగేషన్ ప్రకారం విశ్వంత్ పాత్ర పజిలింగ్‌గా అందరూ అనుమాన పడేలా కనిపిస్తుంది. మరో వైపు ఇదే క్యారెక్టర్ 2019లో జరిగిన దిశ రేప్, మర్డర్ కేసు గురించి చెప్పటం అప్పుడు ప్రజల్లో నుంచి వచ్చిన ఎమోషనల్ రియాక్షన్స్, దానికి పోలీసులు చూపించిన యాక్షన్ గురించి ప్రస్తావన ఉంటుంది. అసలు వరుస హత్యల వెనుకున్న సీరియల్ లింకును సునీల్ ఏం మిస్ చేసుకున్నాడు అనేది ఇంట్రెస్టింగ్‌గా ఉంది. సునీల్, విశ్వంత్ పాత్రలు చాలా ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి. పోలీసులు చేసే ఇంటరాగేషన్, ప్రొసీజర్స్, పోర్షన్స్, బ్యాక్‌డ్రాప్ అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తుంది.

ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఆడియోను ఆదిత్య మ్యూజిక్ రిలీజ్ చేస్తుంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ఎనౌన్స్ చేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.

మరో అందమైన ప్రేమకథ

మాధవే మధుసూదనా..

బొమ్మ దేవర శ్రీదేవి సమర్పణలో సాయి రత్న క్రియేషన్స్ పతాకంపై తేజ బొమ్మ దేవర, రిషిక లోక్రే జంటగా రూపొందుతున్న చిత్రం 'మాధవే మధుసూదనా'. బొమ్మదేవర రామచంద్రరావు దర్శక, నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం.2గా ఈ చిత్రం అన్నపూర్ణ స్టూడియోలో సినీ ప్రముఖుల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్ర ప్రమోషన్స్ కార్యక్రమాలను మేకర్స్ వేగవంతం చేశారు. ఇందులో భాగంగా అక్కినేని నాగార్జున చేతుల మీదుగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేయించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ,'ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ చాలా బాగుంది. అందరినీ మెప్పించేలా ఈ పోస్టర్ ఉంది. సినిమా కూడా విజయవంతం కావాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు.



రిషిక లోక్రే, తేజ బొమ్మదేవర

ఈ మోషన్ పోస్టర్‌లో సంగీతం, ఆర్ఆర్ వినసొంపుగా ఉంది. పోస్టర్‌ని బట్టి ఈ సినిమాలో అందమైన ప్రేమ కథను తెరపై ఆవిష్కరించ బోతున్నట్టుగా కనిపిస్తోంది. ఈ సినిమాకు వికాస్ బాడిస అందించిన సంగీతం మేజర్ హైలెట్ అవ్వనుంది. వాసు సినిమాటోగ్రఫీ ప్లస్ అయ్యేలా ఉంది. ఉద్ధవ్ ఎస్ బి ఈ సినిమాకు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ ప్రకటించనున్నారు.వెండితెరపై మరో అందమైన ప్రేమకథగా రాబోతున్న ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందనే దీమాతో మేకర్స్ ఉన్నారు.

జయ ప్రకాష్, శైలజా ప్రియ, మెకా రామకృష్ణ, నవీన్ నేని, రవి శివ తేజ, మాస్టర్ అజయ్, అంజలి, శ్రీ లత తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి సమర్పణ : బొమ్మ దేవర శ్రీదేవి, రచన -దర్శకత్వం : చంద్ర, నిర్మాత : బొమ్మ దేవర రామచంద్ర రావు, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ : వాసు, సంగీతం : వికాస్ బాడిస, ఎడిటింగ్ : ఉద్ధవ్ ఎస్ బి, మాటలు : బి సుదర్శన్, కొరియోగ్రఫీ : రాజు సుందరం - బృంద, పాటలు : శ్రీమణి, అనంత శ్రీరామ్, శ్రీ సిరాగ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : మానుకొండ మురళీకృష్ణ.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గ్రామపంచాయతీ కార్మికులను మనుషులుగా చూడాలి

- కనీస వేతనం రూ.26 వేలివ్వాలి
- కార్మికుల స్థితిగతులపై సోయిలేని పాలకులు
- ప్రధానితో పోరుకు కేసీఆర్ సిద్ధం కండి.. మేమూ మీ వెంట వస్తాం : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య
- నేటి నుంచి పారిశ్రామిక కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే

నవతెలంగాణ- భువనగిరి

గ్రామపంచాయతీ కార్మికులను మనుషులుగా చూడాలని, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పాదయాత్రలో పాల్గొన్న వారికి ఆరోగ్య సమస్యలు వచ్చినా మొక్కవోని ధైర్యంతో గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారమే తమ లక్ష్యంగా పాలకుర్తి నుంచి పట్నం వరకు ముందుకు పోతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య తెలిపారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ కూడిన బృందం చేపట్టిన పాదయాత్ర ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకున్నది. రైల్వేస్టేషన్ నుంచి భువనగిరి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి బృందం సభ్యులు పూలమాలలేశారు. భువనగిరి మున్సిపల్ పరిధిలోని రాయగిరి, భువనగిరి పట్టణం, పగిడిపల్లి, బీబీనగర్ వరకు యాత్ర కొనసాగింది. అనంతరం దాసరి పాండు అధ్యక్షతన భువనగిరి వినాయక చౌరస్తా వద్ద జరిగిన సభలో వీరయ్య గ్రామ పంచాయతీ కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు.

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు పరిశుభ్రంగా ఉండాలన్న సోయి పాలకులకు లేదన్నారు. ఆధునిక రాకెట్, ఇంటర్నెట్ యుగంలో మనుషుల మధ్య కులం, మతం పేరిట విభేదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచకుండా, పర్మినెంట్ చేయకుండా దాటవేస్తున్నారన్నారు. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే ప్రజా అన్న ప్రధానమంత్రి మోడీకి పారిశుధ్య కార్మికుల వేతనంలో అంతరాలు ఉండకూడదనే జ్ఞానం లేదని విమర్శించారు. గుజరాత్‌లో మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నడిరోడ్డు మీద ప్రజల గుడ్డలు విప్పినా నోరు మెదపలేదని ఆరోపించారు. కార్మికులకు న్యాయం చేయలేని మోడీ ఉన్నా లేకున్నా ఒక్కటేనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు రూ.300 ఉంటే నేడు రూ.8500 ఒక్కొక్క కార్మికులకు చెల్లిస్తున్నామని కేసీఆర్ చెప్పారన్నారు. ఇది ఆచరణలో అమలు కాలేదన్నారు. ఒక్కరికి రూ.8500 వేసి మిగతా వారిని పంచుకోమని చెప్తున్నారని తెలిపారు. సీపీఐ(ఎం) అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కార్మికులకు రూ.8500 వేతనం అమలవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం చేసే పనులను చేయనీయకుండా చేస్తున్నారని తెలిపారు.



రాష్ట్రాలకు వచ్చే ఆదాయం రాకుండా కేంద్రానికే నేరుగా ఆదాయం వచ్చేటట్టు చేశారని ఆరోపించారు. రాష్ట్రాలకు కేటాయించిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాని మోడీతో కొట్లాడటానికి సిద్ధమైతే కార్మికులందరూ మద్దతు పలకడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 28వ తేదీ వరకూ కొనసాగనున్న పాదయాత్ర ముగింపు లోపు ప్రభుత్వం స్పందించాలని, లేని యెడల ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, ఈనెల 20 నుంచి మార్చి 5వ తేదీ వరకు రాష్ట్రంలో పారిశ్రామిక కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 12 ఏండ్ల కింద నిర్ణయించిన వేతనాలనే పారిశ్రామిక యాజమాన్యాలు నేటికీ అమలు చేయడం లేదన్నారు.

గ్రామ పంచాయతీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గ్యార పాండు, వెంకటయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్టుగా జీపీ కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. జీవో నెం 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ళ గణపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వినోద్ కుమార్, మహేష్ పాదయాత్ర బృందం సభ్యులు, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు బత్తిని వెంకటేశ్వర్లు, యం మల్లేశం, యూనియన్ జిల్లా అధ్యక్షులు బందెల భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌యూలో మళ్లీ రచ్చ...

- ఏబీవీపీ, వామపక్ష కార్యకర్తల మధ్య ఘర్షణ

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో మరోసారి రచ్చ మొదలైంది. శివాజీ జయంతి సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, వామపక్ష కార్యకర్తలు ఘర్షణకు దిగారు. వామపక్ష కార్యకర్తలు శివాజీ మహారాజ్ చిత్రాన్ని కిందకు విసిరారని ఆరోపించగా,ఏబీవీపీ కార్యకర్తలు తమపై దాడికి దిగారని వామపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఇరువర్గాల నుంచి ఆరోపణలు వస్తున్నా యూనివర్సిటీ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.



వామపక్షాల వాదన ఏమిటంటే...

బాంబే ఐఐటీలో చదువుతున్న దర్శన్ సోలంకి కులతత్వ వాతావరణంతో హత్యకు గురయిన విషయం విదితమే. కాగా దర్శన్ సోలంకి తండ్రి పిలుపు మేరకు జేఎన్‌యూలో వామపక్ష విద్యార్థి సంఘాలు క్యాండిల్ మార్చ్ నిర్వహించారు..అయితే ఈ శాంతియాత్రను పూర్తి చేసేందుకు అనుమతించకుండా ఏబీవీపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయటంతో వివాదం మొదలైందని అంటున్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.

బడ్జెట్ కసరత్తులో ఉన్నా విచారణ వాయిదా వేయండి

- సీబీఐకి ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా లేఖ



న్యూఢిల్లీ : రాష్ట్ర బడ్జెట్ కసరత్తులో ఉన్నాననీ, తన విచారణ వాయిదా వేయాలని సీబీఐకి ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా లేఖ రాశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఆదివారం తమ ముందు హాజరు కావాలని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శనివారం సమన్లు జారీ చేసింది. అయితే, తన విచారణను ఫిబ్రవరి చివరి వారం వరకు వాయిదా వేయాలని సిసోడియా ఆదివారం సీబీఐని కోరారు. ఢిల్లీ బడ్జెట్‌ను ఖరారు చేసే పనిలో తలమునకలై ఉన్నందున తనకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. 'బడ్జెట్‌ను సకాలంలో సమర్పించడం ఆర్థిక మంత్రిగా నా కర్తవ్యం. ఇది చాలా కీలకమైన ప్రక్రియ. దీని కోసం 24 గంటలు పని చేస్తున్నా. బడ్జెట్‌ను ఖరారు చేస్తున్న నేపథ్యంలో.. సమయం కావాలని సీబీఐకి లేఖ రాశా. ఫిబ్రవరి చివరి వారం తరువాత విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరా' అని సిసోడియా మీడియాకు తెలిపారు.

కాంగ్రెస్ లేకుండా ప్రతిపక్షాల ఐక్యత అసాధ్యం

- అలాంటి ప్రణాళికలకు దిశానిర్దేశం చేసేందుకు ప్లీనరీ
- 2024లో బీజేపీ ని ఓడించడమే ప్రధాన లక్ష్యం
- ఛత్తీస్‌గఢ్ లో ఫిబ్రవరి 24 నుంచి మూడు రోజుల పాటు కాంగ్రెస్ 85వ ప్లీనరీ
- 15,000 మంది ప్రతినిధులు.. మీడియాతో కాంగ్రెస్ నేతలు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ లేకుండా ప్రతిపక్షాల ఐక్యత సాధ్యం కాదని ఆ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అన్నారు. అటువంటి ప్రణాళికలకు దిశానిర్దేశం చేసేందుకు ప్లీనరీ జరుగుతుందని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశం ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు జరగనున్నది. ఈ సందర్భంగా ఆదివారం నాడిక్కడ ఎఐసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, పవన్ కుమార్ బన్సాల్, కుమారి సెల్జా, తారిక్ అన్వార్ లు ప్లీనరీ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తొలుత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ పార్టీ స్టీరింగ్ కమిటీ సెషన్ మొదటి రోజు సమావేశమై, పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి ఎన్నికలు నిర్వహించాలా? వద్దా? అని నిర్ణయిస్తుందని అన్నారు. ప్లీనరీ సమావేశాల అజెండాను తొలిరోజు జరిగే స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఖరారు చేస్తామనీ, ఆ తరువాత సబ్జెక్టుల కమిటీ తీర్మానాలకు తుది రూపం ఇస్తుందని వేణుగోపాల్ తెలిపారు. 2005లో హైదరాబాద్‌లో జరిగిన చివరి ప్లీనరీ తరువాత, ఢిల్లీ వెలుపల కాంగ్రెస్ ప్లీనరీ జరగడం ఇదే ప్రథమమని అన్నారు. ప్లీనరీ సెషన్ 2024 పార్లమెంటరీ ఎన్నికల వైపు ప్రయాణంలో "ముఖ్యమైన మైలురాయి" అని, దేశవ్యాప్తంగా సుమారు 15,000 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్లీనరీకి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు 1,338 మంది, కో-ఆప్టెడ్‌లు 487 మంది ఉన్నారని, మొత్తం 1,825 మంది ప్రతినిధులు ఉన్నారని చెప్పారు. అంతేకాకుండా ఈ సమావేశానికి మొత్తం 9,915 మంది ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు హాజరవుతారని వేణుగోపాల్ తెలిపారు.

శివసేన పేరు, గుర్తు కోసం రూ.2 వేల కోట్ల ఒప్పందం : ఎంపీ సంజయ్‌రౌత్

ముంబయి: శివసేన పేరు, పార్టీ గుర్తు కోసం రూ 2 వేల కోట్లకు ఒప్పందం జరిగిందని శివసేన (ఉద్ధవ్ బాలాసాహేబ్ థాక్రే) ఎంపీ సంజయ్‌రౌత్ ఆరోపించారు. శివసేన పేరును, పార్టీ గుర్తును రూ. 2 వేల కోట్లకు ఏక్‌నాథ్ శిండే గ్రూపు కొనుగోలు చేసిందని సంజయ్‌రౌత్ ఆదివారం ఆరోపించారు. ఈ విషయాన్ని ఆదివారం సంజయ్ రౌత్ ట్వీట్ చేశారు. 'శివసేన పేరు, గుర్తు పొందడానికి రూ. 2000 కోట్ల రూపాయల ఒప్పందం జరిగినట్లు నా వద్ద విశ్వసనీయమైన సమాచారం ఉంది. రూ. 2,000 కోట్లు అనేది ప్రాథమిక సంఖ్య. ఇది 100 శాతం నిజం. అనేక విషయాలు త్వరలో వెల్లడి చేయబడతాయి. దేశ చరిత్రలో ఎప్పుడూ ఈ విధంగా జరగలేదు' అని రౌత్ ట్వీట్ చేశారు. దీనిపై ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీకి సన్నిహితంగా ఉండే ఒక బిల్డర్ ఈ సమాచారాన్ని తనతో పంచుకున్నారని తెలిపారు. తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని, వాటిని త్వరలో బయటపెడతానని చెప్పారు. శివసేన పార్టీ పేరు కొనుగోలు కోసం రూ. 2000 కోట్లు తక్కువ మొత్తం కాదని చెప్పారు. 'ఎన్నికల కమిషన్ నిర్ణయం ఒక ఒప్పందం' అని సంజయ్ రౌత్ ఆరోపించారు.

ఎయిర్‌బెలూన్ సంఘటనపై వైఖరి మార్చుకోండి : అమెరికాకు చైనా విజ్ఞప్తి

బీజింగ్ : ఎయిర్‌బెలూన్ సంఘటనపై వైఖరి మార్చుకోవాలని అమెరికాకు చైనా విజ్ఞప్తి చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి అంటోని బ్లింకెన్‌తో జరిగిన అనధికార సమావేశంలో చైనా దౌత్య వేత్త వాంగ్ యీ ఈ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మునిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ (ఎంఎస్‌సి) నేపథ్యంలో అమెరికా వైపు నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఈ సమావేశం జరిగింది. ఎయిర్‌బెలూన్ సంఘటనపై చైనా వైఖరి స్పష్టంగా ఉందని, ఈ సంఘటన వల్ల ఏర్పడిన ద్వైపాక్షిక నష్టాన్ని అమెరికానే పరిష్కరించాలని వాంగ్ యీ ఈ సమావేశంలో స్పష్టం చేశారు. శనివారం జరిగిన ఈ సమావేశం వివరాలను చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది.

లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు

- రాష్ట్ర మహిళా కమిషన్ సునీతా లక్ష్మారెడ్డి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా పీరం చెరువు వద్ద దోపిడీ దొంగలు వివాహితను కిడ్నాప్ చేసి కారులో తిప్పుతూ లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని సైబరాబాద్ సీపీ,కలెక్టర్‌ను ఆదేశించారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి రాష్ట్ర మహిళా కమిషన్‌కు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మహిళలకు సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో,పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 100, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ వాట్సప్ హెల్ప్ లైన్ నంబర్ 9490555533 కి పిర్యాదు చేయాలని సూచించారు. బాధితురాలికి మహిళా కమిషన్, ప్రభుత్వం అండగా ఉంటాయని ఆమె తెలిపారు.

తెలంగాణ గ్రామాలు చారిత్రాత్మక ఘటనలకు సాక్షిభూతాలు

- తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని ఏ గ్రామాన్ని తట్టిలేపినా ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు సాక్షిభూతంగా నిలుస్తాయనీ, ఆ చరిత్రలను రికార్డు చేసి భావితరాలకు అందించాల్సిన అవసరముందని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ నొక్కిచెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయంలో సీనియర్ జర్నలిస్టు, రచయిత గుండెల రాజు రాసిన 'జంగిలిగొండ గ్రామ చరిత్ర' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ.. బైరాన్‌పల్లి నుంచి జనగాం వరకు, కడవెండి నుంచి జంగిలిగొండ వరకు మహోజ్జ్వలమైన చరిత్ర కలిగి ఉందన్నారు. రాజు శాస్త్రీయపద్ధతిలో గ్రామాన్ని బాగా అధ్యయనం చేసి పుస్తకం రాసిన తీరు బాగుందని ప్రశంసించారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర మాట్లాడుతూ..తాను పుట్టి పెరిగిన గ్రామ చరిత్రను భావితరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో రాజు చేసిన ప్రయత్నం బాగుందని అభినందించారు. సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ డైరెక్టర్, ఓయూ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ జంగిలిగొండ వీరోచిత, సాంస్కృతి సాంప్రదాయ చరిత్రకు అనుగుణంగా 49 అంశాలపై లోతుగా అధ్యయనం చేసి గ్రామ చరిత్రను నిక్షిప్తం చేసిన తీరు అబ్బురపరిచిందన్నారు.

తారకరత్న మృతికి సీఎం కేసీఆర్‌తో పాటు పలువురి నేతల సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సినీ నటుడు నందమూరి తారకరత్న(40) మృతికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంతాపం తెలిపారు. ఆదివారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తారకరత్న మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏపీ సీఎం జగన్ కూడా సంతాపం తెలిపి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్, మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పువ్వాడ అజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అసోంలో అక్రమ మైనింగ్ వెనక బీజేపీ హస్తం : ఏజేపీ

గౌహతి : అసోంలో జరుగుతున్న అక్రమ బొగ్గు మైనింగ్ వెనక కొంత మంది బీజేపీ నాయకులు ఉన్నారని అసోం జాతీయ పరిషద్ (ఏజేపీ) ఆరోపించింది. ఈ విషయంపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి, ఎన్‌జీటి, జాతీయ మానవ హక్కుల కమిషన్, రాజ్యసభలో ప్రతిపక్ష నేతకు వినతిపత్రాలను పంపింది. ఈ సందర్భంగా ఎజెపి అధ్యక్షులు లురింజ్యోతి గొగొయ్, ప్రధాన కార్యదర్శి జగదీశ్ భుయాన్ విలేకరులతో మాట్లాడారు.

అసోంతో పాటు మేఘలాయ, ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ నాయకుల అండదండలతో అక్రమమైనింగ్ జరుగుతుందని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌లపై 2014లో ఎన్‌జీటీ నిషేధం విధించినా అక్రమమైనింగ్ కొనసాగుతుందని తెలిపారు. అస్సాంలో నెలకు రూ 2 వేల కోట్ల విలువైన అక్రమమైనింగ్ తవ్వకం, రవాణా జరుగుతుందని ఏజేపీ తన వినతిపత్రంలో ఆరోపించింది. అక్రమ మైనింగ్ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన గౌహతి హైకోర్టు రిటైర్డ్ జడ్జీ నేతృత్వంలోని విచారణ బృందం తన నివేదికలో ధ్రువీకరించిన విషయాన్నిఏజేపీ గుర్తు చేసింది.

గుజరాత్‌లో కరెన్సీ నోట్ల వర్షం

గాంధీనగర్: గుజరాత్‌లో నోట్ల వర్షం కురిసింది. గాల్లో ఎగిరిపడుతున్న కరెన్సీ నోట్లను అందుకునేందుకు స్థానికులు ఎగబడ్డారు. తమ కుమారుడి వివాహం సందర్భంగా ఓ కుటుంబం ఇంటిపై నుంచి నోట్లను వెదజల్లింది. మెహసాణా జిల్లా కడీ తాలుకాలో ఇటీవల ఈ ఘటన జరిగింది. గడిచిన మూడు రోజుల నుంచి ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. డాబాపై ఉన్న ఓ వ్యక్తి రూ.500 నోట్లను గాల్లోకి వెదజల్లుతుండగా..

కింద ఉన్న వారంతా వాటిని అందుకునేందుకు ఎగబడడం వీడియోలో కనిపిస్తోంది. ఒకరినొకరు తోసుకుంటూ నోట్లను అందుకునే ప్రయత్నం చేయడం వీడియోలో రికార్డైంది. మాజీ సర్పంచ్ కరీంభాయి దాదుభాయి జాదవ్ మేనల్లుడు రజక్ వివాహం సందర్భంగా ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వారి కుటుంబంలో రజక్ ఒక్కడే మగ సంతానం అని, అందుకే ఇలా చేశారని సమాచారం.

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

- బహుళ అంతస్థుల భవనాలు, పరిశ్రమలలో ప్రమాదాలపై చైతన్య కార్యక్రమాలు
- అగ్నిమాపక శాఖాధికారుల కార్యాచరణ



నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలలో అవగాహన పెంచడానికి అగ్నిమాపక శాఖ ప్రత్యేక కార్యాచరణను చేపడుతున్నది. ముఖ్యంగా, హైదరాబాద్‌తో పాటు రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్లు, ఇతర పట్టణాల్లో బహుళ అంతస్థుల భవనాలు, పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇటీవలన సికింద్రాబాద్, పురాణాపూల్, మలక్‌పేట్, కూకట్‌పల్లిలలో భారీ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం, వాటిని ఆర్పడానికి పదికి పైగా అగ్నిమాపక శకటాలు నిర్విరామంగా పని చేసి మంటలను ఆర్పేందుకు కృషి చేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటన్నిటికీ అగ్ని ప్రమాదాల పరంగా ఆయా సంస్థలు తగిన నివారణా చర్యలు చేపట్టకపోవడం, ముందు జాగ్రత్త చర్యగా అగ్నిమాపక పరికరాలను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోకపోవడమేనని అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలో అగ్ని మాపకాలకు ఆస్కారమున్న పరిశ్రమలు, బహుళ అంతస్థుల భవనాలు, ఆస్పత్రులలో అవగాహనా కార్యక్రమాలను అగ్నిమాపక శాఖ అధికారులు చేపడుతున్నారు. ముఖ్యంగా, అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం ఆయా బహుళ అంతస్థుల భవనాలు, ఆస్పత్రులలోని వాటర్ సంపులలో నీటి నిల్వలు ఉంచుతున్నారా? లేదా మొదలుకొని ప్రతి అంతస్థులో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేస్తున్నారా? లేదా ? అనే నిబంధనల పైన అగ్నిమాపక శాఖాధికారులు దృష్టిని కేంద్రీకరిస్తున్నట్టు తెలిసింది. అలాగే, బహుళ అంతస్థుల భవనాలలో ప్రమాదాలు జరిగితే అందులో ఉన్నవారు సురక్షితంగా వెలుపలికి వచ్చే విధంగా అవుటర్ స్టేర్ కేస్‌లను నిర్మించారా? లేదా అన్నది కూడా అధికారులు పరిశీలించబోతున్నట్టు తెలిసింది. వీటితో పాటు మరికొన్ని కీలకమైన నిబంధనలు కూడా బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్న బిల్డర్లు పాటిస్తున్నారా? లేదా ? అన్నది పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ విషయమై రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై. నాగిరెడ్డి అధికారులతో సమావేశమై చర్చించినట్టు తెలిసింది. దీనికి సంబంధించిన కార్యాచరణను కొన్ని ప్రాంతాల్లో ఫైర్ సర్వీసు అధికారులు ప్రారంభించారు.

అరుణాచల్ ప్రదేశ్‌లో భూకంపం..

ఇటానగర్: ప్రపంచంలో ఇటీవల కాలంలో వరసగా భూకంపాలు నమోదు అవుతున్నాయి. టర్కీ భూకంప విషాదం ముగియకముందే పలు ప్రాంతాల్లో భూకంపాలు వస్తున్నాయి. తాజాగా ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్ లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్ పై 3.8 తీవ్రతతో ఆదివారం భూకంపం వచ్చింది. అరుణాచల్ ప్రదేశ్‌తో పాటు అస్సాం, భూటాన్ దేశం తూర్పు ప్రాంతాల వరకు ప్రకంపనలు వచ్చాయి. అరుణాచల్ ప్రదేశ్ పశ్చిమ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 12.12 గంటలకు 3.8 తీవ్రతతో భూకంపం నమోదు అయినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూటాన్ సరిహద్దుల్లోని పశ్చిమ కమెంగ్ లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉంది. ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టాలు నమోదు కాలేదు. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ పర్వతాలు అధికంగా భూకంపాలు సంభవించే జోన్ లో ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో తరుచుగా భూకంపాలు వస్తుంటాయి. ఇదిలా ఉంటే ఏదో ఓ రోజు హిమాలయ ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ భూకంపం వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రాంతంలో భూగర్భంలో టెక్టానిక్ ప్లేట్ యాక్టివిటీ పెరుగుతోంది. ఇండియన్ టెక్టానిక్ ప్లేట్ ప్రతీ ఏడాది ఉత్తరం వైపుగా కదులుతూ.. ఆసియా టెక్టానిక్ ప్లేట్ ను నెట్టుతోంది. ఈ పరిణామం ఏదో సందర్భంలో భారీ భూకంపానికి దారి తీసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఇండోర్‌ను వణించిన భూకంపం

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఆదివారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 3తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. ఇండోర్‌కు 151 కిలోమీటర్ల దూరంలో, భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. ధార్, బర్వానీ, అలీరాజ్‌పూర్‌లో ప్రకంపనలు వచ్చాయి. స్వల్ప భూకంపం కావడంతో ఎలాంటి నష్టం జరుగలేదు. ఉన్నట్టుండి ఒక్కసారిగా భూకంపంతో ఇంట్లోని వస్తువులు ఊగిపోవడంతో ఇండ్లలోని ఉన్న వారంతా భయాందోళనకు గురై బయటకు పరుగులు పెట్టారు. చివరకు ఎలాంటి నష్టం జరుగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

భారత్‌లో ఏడాదికి 15వేల అవయవ మార్పిడిలు..

న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా వైద్యరంగంలో ఆధునిక సాంకేతికత, అవయవ దానంపై ప్రజల్లో పెరుగుతోన్న అవగాహనతో ఎంతో మంది ప్రాణాలు కాపాడగలుగుతున్నామని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు కూడా పెరుగుతున్నాయి. తాజాగా ఈ సంఖ్య ఏడాదికి 15వేలకు చేరుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశంలో అవయవ మార్పిడిల సంఖ్య ఈ స్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారి అని పేర్కొంది. 'కొవిడ్ తర్వాత అవయవ మార్పిడి కేసుల్లో ఎంతో వేగం పెరిగింది. గతేడాది 15వేల మార్పిడిలు జరిగాయి. ఈ స్థాయిలో జరగడం ఇదే తొలిసారి. ఇంతకుముందుతో పోలిస్తే అవయవ మార్పిడి కేసుల సంఖ్యలో 27శాతం పెరుగుదల కనిపించింది' అని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన నోటో సైంటిఫిక్ డైలాగ్-2023 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. వీటికోసం కేంద్ర, రాష్ట్ర, ప్రాంతీయ స్థాయిలోనూ ప్రత్యేక విభాగాలు ఉన్నాయని చెప్పారు. భారత్‌లో వద్ధుల జనాభా క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి నాణ్యమైన జీవన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ పేర్కొన్నారు. ఇటువంటి తరుణంలో కీలకమైన కమ్యూనికేషన్ వ్యవస్థ, అవగాహన వ్యూహాలు ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. వీటిపై ప్రజల్లో ఎంతో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే 640 మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు ఉన్నప్పటికీ.. అవయవ మార్పిడి సర్జరీ చేసే సదుపాయం కొన్నింటిలోనే ఉందని, వీటిని మరింత పెంచాలన్నారు.

టర్కీ, సిరియాలో 46 వేలు దాటిన మృతులు..

- నేటితో ముగియనున్న సహాయక చర్యలు!

టర్కీ : టర్కీ, సిరియా దేశాల్లో భూకంప మృతుల సంఖ్య 46 వేలు దాటింది. భారీ భూకంపం ధాటికి భారీ భవనాలు పేకమేడల్లా కుప్పకూలిపోయాయి. దీంతో శిథిలాలను తొలగిస్తున్నకొద్ది పెద్దసంఖ్యలో మృతదేహాలు బయటపడుతున్నాయి. ఇప్పటివరకు తుర్కియేలో 40,402 మంది మృతిచెందగా, సిరియాలో 5800 మంది చనిపోయారు. అయితే భూకంపం సంభవించి 12 రోజులు గడుస్తుండటంతో తుర్కియేలో సహాయక చర్యలను నేడు ముగించే అవకాశం ఉన్నది. ప్రమాదం జరిగి 296 గంటలు పూర్తవడంతో శిథిలాల కింద చిక్కుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశాలు కనిపించడం లేదని డిజాస్టర్ అండ్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అథారిటీ హెడ్ యూనస్ సెజర్ తెలిపారు. దీంతో సహాయ చర్యలను చాలావరకు ఆదివారం రాత్రి ముగించనున్నట్లు వెల్లడించారు. భూకంపం వల్ల 11 ప్రావిన్సుల్లో నష్టం కలగా.. దాంట్లో ఆదనా, కిలిస్, సనిలుర్ఫా ప్రావిన్సుల్లో ఇప్పటికే రెస్క్యూ ఆపరేషన్ ముగిసిందన్నారు. భూకంపం ధాటికి రెండు దేశ భూభాగాల్లో వేల సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి. తుర్కియేలో 84,726 భవనాలు ధ్వంసమైనట్లు ఆ దేశ పర్యావరణ, పట్టణ ప్రణాళిక మంత్రి మూరత్ కురుమ్ తెలిపారు. దేశంలోని 10 ప్రావిన్సుల్లో ఈ నష్టం జరిగినట్లు చెప్పారు. వీటిల్లో కొన్ని పూర్తిగా కూలిపోయాయి. మరికొన్ని భారీగా దెబ్బతిన్నాయని వెల్లడించారు. కాగా, మార్చిలో కొత్త భవనాల నిర్మాణాలను చేపట్టనున్నట్లు అధ్యక్షుడు ఎర్డగోన్ తెలిపారు. ఏడాదిలోగా వాటిని పూర్తి చేస్తామన్నారు.

విషమంగా జిమ్మీ కార్టర్ ఆరోగ్యం

న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ ఆరోగ్య పరిస్థితి విషమించింది. దాంతో ఆయనను దవాఖాన నుంచి ఇంటికి తరలించారు. చివరి రోజుల్లో కుటుంబసభ్యుల మధ్య గడపాలని జిమ్మీ కార్టర్ కోరుకోవడంతో ఆయనను స్వగృహానికి తీసుకొచ్చినట్లు ఆయన కుటుంబసభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట్లోనే ఆయనకు చికిత్స అందించేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జిమ్మీ కార్టర్ కొంతకాలంగా మెలనోమా అనే వ్యాధితో బాధపడుతున్నారు. ఇది అతడి కాలేయం, మెదడుకు వ్యాపించినట్లు వైద్యులు తెలిపారు. మెలనోమా అనేది ఒక రకమైన చర్మ క్యాన్సర్ అమెరికా చరిత్రలో జీవించి ఉన్న అత్యంత వద్ధ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్. ఆయన 1977 నుంచి 1981 వరకు యునైటెడ్ స్టేట్స్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. అతను 2002 సంవత్సరంలో నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు. అమెరికాలోని జార్జియా (%+వశీతీస్త్రఱు%) లో 1924 లో ఓ రైతు కుటుంబంలో జిమ్మీ కార్టర్ జన్మించారు. 1960 ల్లో రాజకీయాల్లోకి ప్రవేశించిన కార్టర్.. 1971 లో తొలిసారిగా జార్జియా రాష్ట్రానికి గవర్నర్‌గా ఎన్నికయ్యారు. సరిగ్గా ఆరేండ్ల తర్వాత రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్‌ను ఓడించి జిమ్మీ కార్టర్ అమెరికా ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. 1978 లో అప్పటి జనతా పార్టీ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఆయన భారతదేశంలో మూడు రోజుల పాటు పర్యటించారు. ఆ సందర్భంగా గుర్‌గావ్ సమీపంలోని దౌల్తాపూర్‌ను సందర్శించడంతో ఆ ఊరు పేరు కాస్తా కార్టర్‌పూర్ మారిపోయింది.